ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
23 అక్టోబర్, 2011

Entered

వాల్‌స్ట్రీట్ పోరు
విశ్వమంతటా హోరు

2011 హ్యాపీ బర్త్‌డే

(2011 అక్టోబర్ 23 నుంచి
2011 అక్టోబర్ 29 వరకు)

ఎన్.గీతిక
అక్టోబర్
లక్ష్మి-పుల్లారావు
పాసింగ్ హైవేరోడ్డు
ఖమ్మం

ఎన్.మేఘన
అక్టోబర్ 24
సుకన్య
ఎన్.వి.రమణరాజు
పెళ్లూరు-ప్రకాశం

వల్లభ్ ఆశ్రిత్
అక్టోబర్
మాధవి-ప్రసాద్
డిడికాలనీ
హైదరాబాద్

వి.జ్ఞాపిక
అక్టోబర్ 29
రాణి-రమేష్
హన్మకొండ
వరంగల్

శ్రీ వర్షిత
అక్టోబర్ 27
సుజాత-వెంకన్న
ఖానాపురం హవేలీ
ఖమ్మం

కె.సాయి చైతన్య
అక్టోబర్
ప్రమీల-ప్రదీప్
సత్తెనపల్లి
గుంటూరు

దీపక్ సత్యసాయి,
తేజా కిరణ్
అక్టోబర్ 25
రమాదేవి-కనకాచారి
సికింద్రాబాద్

బి.నేహా రెడ్డి
అక్టోబర్ 26
లక్ష్మి
మనోహర్ రెడ్డి
ఎదులాపురం
ఖమ్మం

పి.బాలాజీ
అక్టోబర్ 25
ఉషారాణి-యాదగిరి
ఎదులాపురం
ఖమ్మం

పి.నందకిషోర్
అక్టోబర్ 29
రాణి-మనోహర్
ఓల్డ్ బోయిన్‌పల్లి,
సికింద్రాబాద్

ఎల్.నికాహా
అక్టోబర్ 23
మల్లేశ్వరి-నాగరాజు
లోకవరం
ఖమ్మం



రిషిక
అక్టోబర్
శోభ-మల్లేష్
రామంతపూర్
హైదరాబాద్

టోనీ దీక్షిత్
అక్టోబర్ 27
బి.చైతన్య-శంకర్
సైదాబాద్
హైదరాబాద్

వన్సిక శ్రీ
అక్టోబర్ 25
కె.మాధురి-సుమన్
ముదిగొండ-ఖమ్మం

జై గణేష్, వెంకటేష్
అక్టోబర్ 23
లక్ష్మి ప్రసన్న-శ్రీనివాసరావు
సత్తెనపల్లి-గుంటూరు

మనలో మాట

దీపావళి - జనావళి



దీపావళి అనగానే అందరికీ చెవులు చిల్లులు పడే టపాసులు గుర్తుకొస్తాయి. మిరుమిట్లు గొలిపే కాకర పువ్వొత్తులు కళ్లల్లో ఆడతాయి. అదే బండ గుర్తు అనుకుంటే- మన రైతులకూ, సామాన్య జనానికీ ప్రతి రోజూ దీపావళే ...! కాకపోతే మరేమిటి? రెండు నెలల వ్యవధిలో ఎరువుల ధరలు ఏకంగా నాలుగు సార్లు పెరిగాయి. ఇంతగా ఏ బాంబు పేలగలదు? అప్పడే గుండెలదిరిపోయిన అన్నదాతలకు- ఇక ఈ మూమూలు దీపావళి టపాసులతో పనేముంటుంది చెప్పండి.

పెట్రో ధరలు దాదాపు నెలనెలా యథాశక్తిగా ఆకాశంలోకి తారాజువ్వల్లా దూసుకుపోతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలూ లక్ష్మీ బాంబుల్లా పేలుతున్నాయి. ప్రతిరోజూ జనానికి ఈ సంబడం అనుభవంలోకి వస్తూనే ఉంది. ఇక ప్రత్యేకంగా చిచ్చుబుడ్లు వెలిగించి కళ్లు మిరుమిట్లు గొలిపించుకోవల్సిన అవసరం ఉందా? చెప్పండి...

దీపావళి రోజున అన్ని టీవీల్లోనూ, రేడియోల్లోనూ మార్మోగే పాటొకటి ఉంది. అది : 'చీకటి వెలుగుల రంగేళి.... జీవితమే ఒక దీపావళి'. ఆ పాట అర్థమూ పరమార్థమూ అందరి కన్నా గాలి జనార్ధనరెడ్డి, యడ్యూరప్ప, రాజా, కనిమొళిలకు బాగా అవగతం అవుతుంది. ఈ పండగను జైల్లో జరుపుకోవడం వారికొక కొత్త అనుభవం.

అప్పట్లో నరకాసురుడు ఒక్కడేనేమో....! ఇప్పడా సంతతికీ, సంఖ్యకూ అంతూపొంతూ లేదు. అవినీతి నరకాసురుడు, అధిక ధరల నరకాసురుడు, కబ్జాల నరకాసురుడు, కరెంటు కోతల నరకాసురుడు, దళారీ నరకాసురుడు, దౌర్జన్య దమనకాండల నరకాసురుడు .... అబ్బో...! చెప్పకుంటూ పోతే- శతకోటి...! అవినీతి నరకాసురుల అంతం పేరిట అభినవ నరకాసురులే రథయాత్రలు చేస్తున్న మాయాకాలం ఇది. ఈ మాయాజాలాన్ని అర్థం చేసుకొని- మతోన్మత్తుల గేలానికి చిక్కకుండా ఉండడం జనావళికి చాలా అవసరం. మాయాజాలకుల మాటలు టపాసుల్లా చెవులకు చిల్లులు పెడతాయి. విన్యాసాలు కళ్లను మిరుమిట్లు గొలిపిస్తాయి. జనాలను బధిరాంధులను చేసే అలాంటి పన్నాగాలకు బలి కాకుండా ఉండటమే విజ్ఞత... అప్రమత్తత !

✶

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	4
రుచి	...	11
చూద్దామా	...	12
ఈ పేజ్	...	13
అట్టమీది కథ	...	14
ఎవరి గోల వారిదే	...	18
వికాసం	...	20
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

దీపావళి కార్టూన్లు ... 3

పాత కథ ... 6

అవ్వ తిరునాళ్లలో తప్పిపోయింది

సినిమా కబుర్లు ... 8

జనం మెచ్చిన జాలాది

కొత్త పుస్తకాలు ... 19

ధీరోదాత్తుని దినచర్య



మనుషులకే దిక్కులేదు

అట్టమీది కథ 'పీఠ'యాత్ర వాస్తవాల్ని అందించింది. 'అవినీతి పర్వాల పరంపరలో' కవిత, 'రైతుకు విరామం' కథ బాగున్నాయి. 'నవ్వుల్ పువ్వుల్' కడుపుబ్బ నవ్విస్తున్నాయి. 'చూద్దామా'లో గాంగ్‌టక్ విశేషాలు ఆకట్టుకున్నాయి. 'వికాసం'లో మానసిక వ్యాధిగ్రస్తులకు చేసే వైద్య పరీక్షా విధానం మీద అవగాహన కలిగింది. 'బాలనేస్తాలు'లో దేవలోకపు 'తోక పిగిలిపిట్ట' తోక చూసి ఔరా అనుకున్నాం.'ఈ పేజ్' విషయాలు ఆకర్షించాయి. చివరి పేజీలో 'బ్రహ్మి ఒక్కడే' చిత్రాలు భలే ఉన్నాయి. 'మనలో మాట'... మనుషులకే దిక్కులేదు. ఇక 'శునక సౌధ' ఎవరు వింటారు?

నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.

ఎత్తులు జిత్తులు

'కవర్ స్టోరీ' పీఠయాత్రలో అనేక విషయాలను ప్రస్తావించారు. బిజెపి నేత అద్వానీ బూటకపు యాత్రని, మోడీ చేసిన సద్భావన యాత్రని నమ్మే స్థితిలో ప్రజలు లేరు. గతంలో జరిగిన మారణహోమం ఎప్పటికీ మర్చిపోలేనిది. రాబోయే ఎన్నికల్లో పీఠాన్ని అధిష్టించడానికే ఈ పన్నాగాలన్నీ.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

అవగాహనా లేమి

వాస్తవాలపై అవగాహన లేకుండా ఎసి కార్లలో ప్రయాణిస్తూ, టీవీలో చూసిన, పేపర్లలో చదివిన వాటి ఆధారంగా అధికారులు నివేదికలు తయారు చేస్తున్నారు. ఇలాగైతే రోజుకు 32 రూపాయల కంటే తక్కువ సంపాదించేవారు కూడా ధనికులే అవుతారు. వాస్తవానికి ఆ డబ్బుతో ఒక రోజు సంగతి అటుంచితే ఒక్క పూటైనా కడుపునిండా తినగలమా? పేదరికానికి అదే నిజమైన నిర్వచనమైతే, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసేవాళ్లంతా సంపన్నులే అవుతారేమో!? నేడు అధికారులు, రాజకీయ ప్రతినిధులు పొందుతున్న జీతాలను ప్రణాళికా సంఘం సూచించిన జీవన ప్రమాణాలతో పోల్చి చూస్తే ఏనుగుకు దోమకు ఉన్నంత తేడా కన్పిస్తుంది. సామాజిక రుగ్మతలపై సంధించిన కవితలకు మరో పేజీ కేటాయిస్తే బాగుంటుంది. 'రైతుకు విరామం' కథ గ్రామ యాత్రలా ఉంది. అందులో సందేశం కానీ, పరిష్కారం కానీ కనిపించలేదు. కె.ఎక్స్.రాజు అందించే 'ఈ పేజ్'లో 3డి టీవీ సమాచారం ప్రాథమిక అవగాహనను కలిగిస్తోంది. 'నవ్వుల్ పువ్వుల్, బాలనేస్తాలు' బాగున్నాయి. గతవారం 'బాపూకు వినతి'లో కవి ఆవేదన, ఘోస ప్రజలందరూ అర్థం చేసుకోవాలి. 'బైక్ క్రేజ్' బాగుంది. ప్రమాదాలు జరిగాక పశ్చాత్తాపపడితే లాభం ఉండదనేది కఠిన వాస్తవం. తల్లిదండ్రులే కాదు, యువత కూడా తప్పకుండా చదవాల్సిన వ్యాసం ఇది. 'మనలో మాట వాస్తవాన్ని తెలియజేస్తోంది.

ఖైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

మరి దేనికీ కాదు

'తొలి అవకాశం'లో శైలజ, తులసి, సునీత, చంద్రమోహన్, మనో, రమాప్రభ, సాయికుమార్ చెప్పిన విషయాలు బాగున్నాయి. గాంగ్‌టక్ రమణీయ దృశ్యాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మానందం వెరైటీ గెటప్‌లు ఆకర్షించాయి. ముప్పొద్దులా లాగిస్తే పొట్ట పెరగడం ఖాయం.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

పోటీ ప్రపంచం

కోర్టులో తీర్పు చెప్పే న్యాయమూర్తికి కుక్క ఉంటే దానికి ఎంత ఖర్చవుతుందో ఆయనకి తెలుస్తుంది. మనిషికి అవసరాలకు ఎంత కావాలో సరైన తీర్పు చెప్తారని ఆశించవచ్చు. రైతు విరామం కథ బాగుంది. 'సినిమా కబుర్ల'లో చంద్రమోహన్ చెప్పినట్లు పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఆదివారాలు, సెలవు దినాలని చూసుకోకుండా పని చేయాల్సిందే. 'ఈ పేజ్'లో 3డి వల్ల మానసికానందం పొందగలం. కానీ ఇటువంటి వాటివల్ల ఎలా అనారోగ్యం పాలవుతున్నామో తెలుసుకోలేకపోతున్నాం. 'చూద్దామా'లో గాంగ్‌టక్ విషయాలు బాగున్నాయి. 'అట్టమీది కథ'లో చెప్పినట్లు పదవి కోసమే రథయాత్ర. ఈ వ్యాసానికి 'పీఠయాత్ర' అన్న పేరు బాగుంది. కాంగ్రెస్, బిజెపి పేర్లు వేరైనా వాటి పాలసీ ఒకటేనని రచయిత నాగేంద్ర చక్కగా చెప్పారు.

ఇలిపిల్ల సూర్యనారాయణ, విజయవాడ.

రాజ(నాట)కీయ ప్రస్థానం

మనలో మాట 'శునక సౌధ' బాగుంది. ప్రణాళికా సంఘం బుర్రలేని తనాన్ని వివరించి నవ్వించింది. 'కవర్ స్టోరీ'లో నాటి అద్వానీ రథయాత్ర నుండి నేటి వరకు అతని రాజకీయ ప్రస్థానంలో వేసిన ఎత్తులు, జిత్తులు, జరిగిన

విధ్వంసాలను రచయిత వివరించారు. 'హ్రస్వదృష్టి' కవితలో మన సంకుచిత దృక్పథం ఎలా వుంటుందో అర్థవంతంగా ఉంది. 'ఈ పేజ్' వ్యాసం చదివాక థియేటర్ల 3డికి, టీవీల్లో 3డికి మధ్య తేడా తెలిసింది. ఆలోచనల్లో సాధారణ, అసాధారణ రీతులను, మానసిక యంత్రాంగాలను 'వికాసం' ద్వారా పరిచయం చేసిన శర్మ అభినందనీయులు.

అన్నెపు పాపారావు, శ్రీకాకుళం.

వెండి కొండల అందాలు

'చూద్దామా' లో కొండల పట్టణంలో విషయాలు ఆకర్షించాయి. వెండి కొండల అందాలు, తీస్తా నది చక్కదనం, రంగు రంగుల పూలు... ఇలా ఎన్నో విషయాలను కళ్లకు కట్టినట్లు చెప్పారు.

నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం




వంకాయి బాంబు... ఉల్లిపాయ బాంబు...
పచ్చిమిరపకాయ బాంబు అంటే ఎవ్వరూ కొనడం లేదయ్యా! అందుకే పేర్లు అలా పెట్టాం...!!
మానవ బాంబు
దీపావళి టపాసులు


నీది వంకాయి బాంబు కాల్చిన కేసా? నాది చిచ్చుబుడ్డి పేలిన కేసులే


ఈతిబాధల మోత ముందు... బాంబుల మోతలేం వినబడ్డం లేదు ఆయనకు!!!
ఢాం


ఆగి... ఆగి... ఆగి... పేల్తుందా? ఏం బాంబయ్యా అది?
సీరియల్ బాంబమ్మా!
దీపావళి టపాసులు


50% డిస్కౌంట్... అంటే తెచ్చారా? అందుకే సగం పేల్తున్నాయ్... సగం పేల్డంలేదు!
తుస్... తుస్... తుస్...
ఢాం ఢాం ఢాం


బల్ల కింద చెయ్యి పెట్టగానే లంచం ఇస్తాడేమో అనుకున్నా... అంటించిన బాంబు చేతిలో పెట్టాడు!!!
అధికారి


ఏమిటి? అంత పెద్ద రౌడీవి... గూండావి... నువ్వు కాల్చినా... బాంబు మొఖం మీద పేలిందా...?
రౌడీ... గూండా... అని నీకు తెల్సు బాంబుకేం తెల్సు...?


దీపావళి బాంబులు కాల్చి గాయపడిన వాళ్లని కూడా 'ఆరోగ్యశ్రీ' లో చేర్చాల్సార్!!!

కవిత్వమ్

ఆకలి సరిగమలు

మేతకు తల్లి వెళ్లిపోయాక
అమ్మ వొడిలాంటి మహారణ్యంలో లేడిపిల్ల
చిందులు వేస్తూ చిగుళ్లు కొరుకుతుంది
పసిగట్టిన పులిపంజా విసిరి
పచ్చినెత్తురు తాగుతుంది
విగతజీవి గాజు కళ్లు
మరింత విశాలమై
సజీవ ప్రకృతిని దీనంగా ప్రశ్నిస్తున్నాయి
ఇదెక్కడి న్యాయమని
ఆకలెంత హింసాత్మకం?
మూటలు మోసి మెడ కుంచించుకుపోయి
వొళ్లంతా భారమై పాదాలు అదుపుతప్పి
రెక్కాడినా డొక్కాడని జాబితాలో చేరి
మంచంపై భర్త మగతగా పడిపోగా
వేడినీళ్ల కాపడంతో ఒంటికి జీవంపోసి
ఆకలిగొన్న కడుపుకు వూరట కల్పించి
ప్రాణామృతం పంచిన జీవన పోరాటం

ఆకలెంత ప్రేమమయం?
అంతసేపూ గాటి దగ్గర
నిరాహార దీక్ష చేసిన లేగదూడ
మసక మసక గోధూళిలో అమ్మ
కామధేనువులా కదలిరావడం చూసి
అదుపు తప్పిన ఆనందంతో చెంగలిస్తూ
అమ్మకు స్వాగతం పలకడం
పులకించిన తల్లి పాలివ్వడం

ఆకలెంత మూగప్రేమ?
కడుపునిండిన డొక్కఎండిన
రెండే కులాలు లోకంలో
కూడిన సంపద ఒక చేతికి చేరితే
చూస్తున్న చట్టాలు
ఊడిగం చేస్తున్నాయి
మండే కడుపుల కేకలు ఉద్రేకమై
ప్రశ్నల్ని సంధిస్తున్నాయి
ఆకలెంత ఆవేశం?
బడుగు జీవుల హాస్టళ్లను
అవినీతి అక్రమాలు చుట్టుముట్టాయి
వారానికో గుడ్డు వద్దు
ఆదివారం అరటిపండు వద్దు
పండుగ రోజు పాయసం వద్దు
పురుగులులేని అన్నం వడ్డించి
చద్దిగంజి పోసినా సంతోషమే
విద్యార్థుల కన్నీటి రోదన
ఆకలెంత బేలతనం?

- అడిగోపుల వెంకటరత్నం

మూలాల్ని పెకిలించినప్పుడు...

పుడుతూనే పెట్టిన పొలికేక
జీవి ఉనికిని చాటే సంకేతమైతే...
జనన ధృవీకరణ పత్రాన్ని పొందే దిశలో పైసల్ని
సమర్పించుకోలేక
జననీ జనకులు పెట్టే గావుకేక
జగాన్ని జలగలా పీడిస్తోన్న అవినీతికి సాంకేతికమే!
పుట్టుక మొదలు గిట్టేవరకు
చదువుల్లో... చేలల్లో
పనివేళల్లో... పదవుల్లో
స్థాయీబేధం వదలి ఇంతింతై వటుడింతై చందంగా
లంచావతారం తన వామనపాదమెత్తి
నీతికి నీరు గార్చి...
మానవతను ఏమార్చి
అడుగడుగునా సమాజపు అస్థిత్వానికి
తిలోదకాలిస్తూనే ఉంది!
నగరపు నడిబొడ్డున నిలబడి
అవినీతి అంతానికి గళమెత్తి



నిఖార్సైన నిజాలే నినాదాలై
ప్రజల గుండెల్లో ప్రతిధ్వనిస్తుంటే...
మేకవన్నె పులులు... గుంపుల్లో గోవిందయ్యలై
తిలాపాపం తలా తట్టెడు సర్దుకుంటూ
విచిత్ర విన్యాసాలతో శల్యసారథ్యం వహిస్తూ
నీతిని తుల్య పరీక్షకు నిలబెట్టడం
నేటి వార్తల్లో విశేషమైతే...
ప్రక్షాళన జరగాల్సింది పతాక స్థాయిలో కానేకాదు!
నరనరాన జీర్ణించుకుపోయిన అవినీతి
మూలాల్ని పెకిలించి....
కింకర్తవ్యాన్ని బోధిస్తూ
ప్రతి మనిషి ప్రవర్తనలో... పరివర్తన దిశగా
పద ఘట్టనను శాసించే మేథోమథన సారథ్యంలో
సగటు జీవి చైతన్యదీప్తుల సమరోత్సాహంలోనే
అవినీతికి అంతం సుసాధ్యం...!

- ఇల్ల ప్రసన్నలక్ష్మి

అమ్మ

అమ్మంటే అర్థం తెలిసొచ్చేసరికి
తాతయ్యగా స్థిరీకరణ పొందుతాడు ఒకడు
ముత్తాత అయినా తన అమ్మ ఔన్నత్యం
ఆలోచించిన పాపాన పోడు మరొకడు
విద్య శూన్య అజ్ఞానం వల్ల అతణ్ణి క్షమించవచ్చు
జీవితం ఆ మాత్రం విజ్ఞత ఇవ్వలేదంటే ఏమనొచ్చు
మనిషిగా ఆ మాత్రం సంస్కారం చిగురించకపోతే
బండరాయికీ అతనికీ తేడా ఏమిటి?
అంతస్థు అవతల పెట్టి ఆమె రొమ్ము పాల తీపి

ఓ సారి గుర్తుతెచ్చుకున్నపాపాన పోడు
గర్భాన అపురూపంగా మోసిన ఆమె కష్టం
అతనికి గుర్తు తెచ్చుకునేందుకు క్షణం తీరక లేదు
ఆమెకొచ్చిన గర్భరోగం అతడికొచ్చేలా ఉంది
ఆ గర్భంలోంచే పుట్టుకొచ్చానన్న వివేచన
అతనికి చచ్చి చాలా కాలమయ్యింది
తన బిడ్డల్ని కన్న భార్యే మళ్లీ
తల్లిగా ఛీత్కారాల సిరుల కోసం
కొంగు పట్టి అమాయకంగా
అడుగుతూ ఉంటుంది.

- జి.నరసింహామూర్తి

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

కూపన్ పంపండి లేదా SMS పంపండి.

CHENNAI: 0-97890 99589

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరిపేరు, ఫోన్ నెం., పిన్‌కోడ్‌లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. మా సెల్‌ఫోన్ 24 గంటలూ కంప్యూటర్‌కు లింక్ చేయబడి ఉంటుంది. మీ అడ్రసు ఆటోమేటిక్‌గా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుందని తెలుసుకోగలరు. కోర్స్ ఫీజు రూ.1000/-లు. ఇది 5 నెలల కోర్స్. రోజూ ఒక గంట చదివితే చాలు. ఈ కోర్సులో 10 పుస్తకాలు, 1 CD ఉంటాయి. మీకు ఏమయినా సందేహాలు ఉంటే, లెటరు వ్రాసి తెలుసుకోవచ్చు. 10 రోజులలో పోస్ట్‌మేన్ కోర్స్ ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్స్ మెటీరియల్ పొందవచ్చును. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**93915 49930. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

పాత కథ

అవ్వ తిరునాళ్లలో తప్పిపోయింది

- దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

మా అవ్వ నెరుగరూ మీరూ, అవ్వని హయ్యో! సుబ్బమ్మవ్వని మా వూళ్లో ఆవిణ్ణి యెరగని వాళ్లు లేరే! అసలు వూరంతా అవ్వనే పిలుస్తారావిణ్ణి. కొద్ది మంది 'సుబ్బమ్మవ్వగారూ' అని కూడా అంటారు. ఆవిడకి కోపం వచ్చినప్పుడు, 'ఆఆఆ! యెవర్రా అవ్వ! నువ్వు నా కేవవుతావురా చస్తే దెయ్యవవుతావుగాని' అని గద్దిస్తుంది. అప్పుడు చటుక్కున్న సర్దుకుని 'సుబ్బమ్మగారూ' అంటారు. ఒక్కొక్కప్పుడు, 'సుబ్బమ్మగారూ' అని పిలిస్తే "హోరి గాడిదా! వేలెడంతలేవు, బొడ్డుకోసి పేరెడతావురా నాకూ!" అని దులిపేస్తుంది. వెంటనే దిద్దుకుని 'అవ్వగారూ!' అంటారు.

ఏవయితేనేం ఆవిడంటే అందరికీ యిష్టవే, అవ్వంటే.

అవును. అందరికీ యిష్టవే మరి! వాళ్లకేం పోయింది యిష్టం గాక! యెప్పుడో కనిపిస్తుంది వాళ్లకి. కనిపించినప్పుడు యంచక్కా కుశల ప్రెశ్నలూ అవీ వేస్తుంది. సావెతల్తో సాతాళించి కబుర్లూ కథలూ చెపుతుంది. మాంచి ఫారమ్‌లో ఉంటే – అంటే ఒడుపులో వుంటే పాటలు పాడుతుంది. పావు పాటా అవీ. ఆ కాస్సేపూ వాళ్లకి కులాసాగా వుంటుంది. వింటారు. పోతారు. వాళ్లకేం! రాత్రీ పగలూ ఆవిడతో యింట్లో వుండే వాళ్లం. మేం వేగలేక చస్తున్నాం గాని!

అన్నట్టు అవ్వంటే మీరెరగరన్నారు కదూ సుబ్బమ్మవ్వని. ఆవిడ మమ్మల్నెలా యేడిపిస్తుందో చెప్పేముందు, ఆవిడ రూపు రేఖలూ ధోరణీ మీకు తెలియద్దూ. అసలు మా అవ్వంటే, మా నాన్నగారి మేనత్త. ఆయన్తాలూకు అయిదెకరాల పొలవూ, అప్పారం లోగిలీ వగైరా ఆస్తితో అవ్వ కూడా నాకు సంక్రమించింది. మా నాన్న మేనత్తంటే దాదాపు డెబ్బై పై మాట గదా. అయితేం నడుం నిటాగ్గా కదురులా నిలబెడుతుంది. యిష్టం లేనప్పుడు మాత్రం తెలుగులో 'ఐ' అక్షరం లేదూ 'ఐ'. దానిలాగా వొంగిపోతుంది. తరుచు కంఠం రైలు గంటలాగా గణగణా మోగించేస్తుంది. యిష్టం లేనప్పుడు పీలగా మూలుగుతుంది. ఈ మధ్య కొంచెం చెడ్డా, గెద్ద చూపులాంటిది అవ్వ చూపు. అయితే పళ్లు మాత్రం తీయించెయ్యడవో రాలిపోవడవో జరిగింది. వొఖ్ఖటే వొఖ్ఖ పై పన్ను మాత్రం ముందుది. కింది పెదిమ మీదికి వొంగి, అక్కడ కాలూది, మాట్టాడుతున్నప్పుడు రవ్వంత తలాడిస్తూ ఉంటుంది. అది అందానిక్కాబోలు వుంచేసిందవ్వ. మా యింటికొచ్చిన వో పెద్ద మనిషి అప్పన్న శాస్తుర్లని మాంచి కవి గూడా. ఆయనొకసారన్నాడూ చెమత్కారంగా "ప్రెపంచంలో యే ప్రెభుత్వవూ చెయ్యలేని పని సుబ్బమ్మవ్వ గారు చేసిందండీ. వొకేవొఖ్ఖటి తప్ప యే పన్నూ లేకుండా చేసిందీ!" అని. అయితే అవ్వ మాట్టాడుతుంటే మాత్రం అతి స్పష్టంగా తెలుస్తుంది.

కొందరు పళ్లు లేనివాళ్ల నోరు లక్కపిడతలాగా డొల్లగా ఉంటుంది. మాట్టాడుతుంటే యేవీ తెలీదు. రొచ్చులో నడుస్తున్నట్లు పుసుకూ పుసుకూ గాలిపోసుకుంటుంది. అంతే, పాత రబ్బరు బొమ్మ కడుపు నొక్కితే చప్పుడైనట్టు. అవ్వలాగాదు.

అయినా ఓ లోపం ఉంది. అవ్వ మాటల్లో 'ప' 'ఫ' అని పలుకుతుంది. 'తప్ఫూ, వప్ఫూ, చెప్ఫూ' అంటుంది. ఈ వొంటిపన్ను వల్ల.

అసలు అవ్వదీ, మా సుబ్బమ్మవ్వదీ పెద్ద జాతీయ నాయకుడి వుపన్యాస ధోరణి. అయితే అవ్వ తెలివిగా మాట్టాడుతుంది. ఓసారీ, వుపన్యాసాల్తో దేశాన్నంతనీ తల దిమ్మెక్కించే ఓ పెద్ద మనిషి మా యింటికొచ్చాడు. ఆయన సభలోనే గాక సభ యివతల కూడా సభలో అంతా మాట్లాడతాడు. మా యింటికొచ్చిన పది నిమిషాల్లో మొదలెట్టాడు ప్రసంగం. మరి పది నిమిషాల్లో అవ్వ కలుగజేసుకుని రంగస్థలంలో విరగబడింది. ఆయనగారు తోక జాడించి, నాటికీ నేటికీ అవ్వకి 'నమస్తే'. అంతే! ఆవిడ సన్నిధానంలో నోరు విప్పడు.

వెనకటికి ఓ కవిగాడు చెప్పినట్టు 'నిప్పుల, నీళ్లను, చప్పిడుప్పిళ్లలను, తీర్థాల, తిరునాళ్ల త్రిప్పటలను, గడిదేరి గడ్డకట్టిన ఘటం అవ్వ. పెళ్లికి కాస్త ముందో వెనకో పోయాడు పెనివిటి. డెబ్బై యేళ్ల పైని యేకధాటీగా అంటే యేక టాకీని వైధవ్య రాజ్యాన్ని పరిపాలించి పారేసిన రాణీ బహద్దర్. గడ్డు బ్రహ్మచారిణి. యాక్సిడెంట్, అంటే ఏ కారో రైలో కలగజేసుకుంటే తప్ప మార్కండేయాది చిరంజీవుల లిస్టులో మనిషి మా అవ్వ.

నాలుగ్గంటలకే లేచి తొలి కోడిని లేపడం, తలుపులన్నీ తెరిచి పారేసి పాచి పనులు అవీ చెయ్యడం, చెంబులూ, గిన్నెలూ చప్పుళ్ల చెయ్యడం, స్నానం చెయ్యడం, పత్తిరాట్టం లాంటి కంఠవెత్తి 'ప్రాత స్మరామి' వగైరా శ్లోకాలు చదవడం, మా నిద్దర తగలెయ్యడం ఇలాగ రోజంతా జరిగే తంతుని గూర్చి అట్టే చెప్పడం నాకిష్టం లేదు. ఈ వివరాలు కూడా మీకు చెప్పకపోదును. కాని మీ కోసమే చెప్పా యిదంతా. అవ్వ ధోరణిలో చెప్పవలసి వొస్తే యెప్పుడైనా అవ్వ యెదురయితే చప్పున తప్పుకుని మీరు దాటిపోవచ్చుని! అంతే గాక, ఇవన్నీ చెప్తేగాని, మేవావిడతో యెలా వేగిపోతున్నావో మీకు తెలీదని గూడా యిన్ని వివరాలిచ్చా మీకు. ఇంట్లో మిమ్మల్ని ప్రతి ఘడియా యేడిపించే పనుల్ని గూర్చి నేను చెప్పనే లేదు. హయ్యో బాబో! యే నవ్వండీ బాబూ! కోటయ్యగారు క్లీన్గా భోంచేసిన విస్తట్లోనే కొత్తదనుకున్నానని, మా శాషమ్మ దొడ్డమ్మకి మళ్లీ వొడ్డించడం, నీళ్లనుకుని చెంబెడు సామర్లకోట పప్పు నూనితో చెయ్యి కడుక్కోవడం, యెంగిలి విస్తళ్లన్నీ కట్టగట్టి గోడమీద నుండి వీధంట వెడ్తున్న మేస్త్రీటు వీర్రాజు గారి తలమీద పడేటట్టు విసిరివేయడం ఈ గొడవలన్నీ ముందు ముందు మీకు తెలుస్తాయి. అలాగే సినిమాకు వెళ్లడం, సర్కస్ వాళ్ల బోనుల దగ్గర కదలకుండా నిలబడి అక్కడ జెంతువుల్తో జెత కట్టడం, శాసన సభ సీటు కోసం మా వూళ్లో చేసిన పెద్ద ఎన్నికల సభలో రభస చెయ్యడం ఇలాంటివన్నీ కూడా యిప్పుడు కాదు, తర్వాత చెప్తా.

అయితే, వో చిన్న సంగతి చెప్పి, అది చెప్పి తీరాలి – ఆవిడ తిర్నాళ్లలో తప్పిపోవడం దగ్గిరకొస్తా.

అప్పన్న శాస్తుర్లు గారని చెప్పానే ఇందాకా. కవిగారు, ఆయన వోసారి అవ్వ మీద పంచరత్నాలు చెప్పాడు భోజనాల దగ్గర సరదాకి!

"సుగుణమణిగణ నికురుంబ సుబ్బమాంబ"

అనిన్నీ.

'సుజన సేవావలంబ గం, సుబ్బమాంబ"

అనిన్నీ.

"గం" అంటే గంగాభాగీరథీ సమానురాలట.

ఆయన పద్యాలు చెప్తుంటే, అవ్వ ముసిముసినవ్వుల్తో అటూ యిటూ తిరుగుతూ, ఏదో తన గొడవ కాదన్నట్టూ నిర్లక్ష్యంగా పట్టించుకోనట్టూ విననట్టూ అంతా విని, "అవి వో కాయితం మీద రాసిపారెయ్యండి బాబూ, మా నాన్నిగాడికివ్వండి" అంది.

నాన్నిగాడంటే మా పెద్దబ్బాయి. వాడంటే మా అవ్వకిష్టం. మా నాన్న పేరని. వాడూ గడుసురాస్కెల్, యేం చేశాడూ! ఆ పద్యాలు తీసుకుని, వల్లించి, అడపా తడపా పెద్ద రాగవరస పెట్టి అవ్వ దగ్గిర చదవడవూ, ఆవిడ దగ్గిరేదేనా కొట్టేడవూ. ఈ పద్యాల వెర్రి అవ్వనెంతదాకా పట్టుకుందీ అంటే, వో సారి నాతో అందీ "వొరే అబ్బాయి! నేను పోయాక పదకొండో రోజున యీ కవుల్నందర్నీ పిలిపించి నా మీద పజ్యాలు చెప్పించరా" అని.

ప్రెస్తుత మేవిటంటే, నాన్నిగాడు శివరాత్రి

తీర్థానికెళ్దామని అవ్వని రెచ్చగొట్టాడు. నాకిష్టం లేదు. "తీర్థములు మానసములు ముక్తి ప్రదములు" అంటూ "సత్యము తీర్థము" అంటూ కవి చెప్పిన మాటల్లో నమ్మకం వున్న వాణ్ణాయెను. అయితే యేం జెయ్యను అవ్వా నాన్నిగాళ్లల్లో ఏ ఒక్కళ్లనీ లొంగదీయడవే కష్టం! యిద్దరూ పట్టుకున్నారాయె!! పోనీ యిల్లైనా ఆనాటికి విశ్రాంతిగా ఉంటుందనిన్నీ దారి పొడుగునా అస్తమానవూ అవ్వ కోసం పంచ రత్నాలు పద్యాలు చదివి నాన్నిగాడి తెగులు కుదురుతుందనిన్నీ సరేనన్నాను, చివరికి.

ఆ తీర్థానికే వెళ్తున్న రావయ్య కాపుని బతిమాలుకొని, అతని రెండెడ్ల బండిలో మా వాళ్లనీ కుక్కాను. తోవలో అవ్వ కునికిపాట్లు పడి కిందపడకుండా రావయ్యకాపు పెద్ద కొడుకుని బండి చివర బిరడాలాగా బిగించాను. ఈ బిరడా సంగతి తర్వాత చెప్తా.

వాళ్లు తెల్లారగట్టే వెళ్లారు. సాయంకాలవో, రాత్రి పడుతుంటేనో రావాలి. మూడు నాలుగ్గంటలకి యేదో పని వుండి వీధిలోకి వచ్చా. వీధరుగు పక్కని బిక్క మొహం వేసుకుని, యేడిచి యేడిచి వాచిన యెర్రకళ్లు వాడూ, నాన్నిగాడు వొదిగి నిలబడి వున్నాడు.

"ఏమిరా అవ్వేదిరా" అన్నాను.

"త త త" అన్నాడు.

"ఏమిట్రా తతత తప్పిపోయిందా. ఛ ఛ ఛ కాదుగదా, అంటే చచ్చిపోలేదు గదా" అనడిగాను.

"తీర్థంలో అవ్వ కనబళ్లేదు" అన్నాడు వాడు మెల్లిగా.

'ఆ' అన్నాను. నా గుండె గుబేలుమంది. గోదార్లో పడిందేవో! కారు కింద పడిందేవో! గుండె ఆగిపోయిందేవో, ముసల్ది. నాకు మహ జాలీ, దుఃఖం వేసుకొచ్చాయి. అసలు అవ్వంటే మా అందరికీ యెంత యిష్టవో అప్పుడు తెలిసొచ్చింది నాకు. అవ్వని తీసేస్తే లోకం యెలా వుంటుందో మాకు తెలియదు. పాపం ఆవిడకెవరున్నారు. నిజానికి నాకు ముసలాళ్లను జూస్తే ఎంతో దిగులు. ముందుకు చూసుకుంటే నోరు తెరుచుని దగ్గరగా వొచ్చే చీకటి భూతంగాక వాళ్లకే వుంది!

మా అవ్వ చూపులు వొక్కొక్కప్పుడు, దూరాన ఆకాశాన పోయే పక్షుల్లాగా వుంటాయి. యెక్కడికో యెక్కడికో పోతూన్నట్టు, అప్పుడు నాకు భయం వేస్తుంది. అవ్వ వొక్కొక్కప్పుడు పొడుగ్గా నిట్టూర్చేది! ఆ నిట్టూర్పు చిన్నతనం నుంచీ యెనభై యేళ్ల దార్లోబడి పాకివచ్చినట్టుండేది. ఇప్పుడు ఈ మాటలన్నీ స్తిమితంగా అంటున్నాను గానీ అప్పుడు...

"యేవిట్రా, యేం జరిగిందీ" అని నాన్నిగాణ్ణి అడిగాను.

గోదావర్లో స్నానం చేసొచ్చారట. గుళ్లోక్కూడా వెళ్లొచ్చారట. స్వామి దర్శనమయ్యాక, గుళ్లో మండపం మీద కూచుని వాడి చేత సరదాగా పంచ రత్నాలు గూడా చదివించుకుందిట. తర్వాత యివతలికి వొచ్చాక, రంగుల రాట్నం



దగ్గిరికొచ్చేటప్పటికీ నాన్నిగాడు అదెక్కుతానన్నాట్ట. వాడు కాస్సేపు దానిమీద తిరిగొచ్చేసరికి అవ్వక్కడ లేదు. వాడు మొదట యిక్కడా అక్కడా చూసి, కనపడకపోతే కంగారు పడి, "అవ్వా, అవ్వా" అని పిలుస్తూ తీర్థవంతా తిరగీ, బళ్లు విప్పిన చోట దగ్గిరికొచ్చి అక్కడ కూడా ఆవిడ కనబడకపోతే అయిదు మైళ్లూ నడచి ఇంటికొచ్చేశాడు. యిదీ కథ.

వెంటనే రావయ్య కాపొచ్చాడేమో వాళ్లింటికెళ్లబురు చేశాను. కావిగాణ్ణీ గోవిందునీ తిర్నాళ్లకి పరిగెత్తించాను. అవసరమైతే పోలీసుల్తో గూడా చెప్పమన్నా. ఇంట్లో మా ఆవిడా పిల్లలూ నిశ్శబ్దంగా కూచున్నారు, కుక్కిన పేనుల్లా. నేను శివ స్మరణ చేస్తూ బయటికెళ్తూ, లోపలికొస్తూ మతి పోయినట్లు తిరగడం మొదలెట్టాను.

రాత్రి పదయింది. అవ్వ లేకుండా రావయ్య కాపు బండి వొచ్చేసిందట. కావిగాడూ గోవిందు వట్టి చేతుల్తో, అంటే అవ్వ లేకుండా వొచ్చేశారు. ఇహ వూరుకుంటే బావుండదని, మా అవిడ లోపల్నించి కొంచెం కూనిరాగం యేడుపు ప్రారంభించింది. చంటి పిల్లాడు గూడా యథాశక్తి వాళ్లమ్మకి తోడయ్యాడు. చూడ్డానికీ, ఉబుసుపోకా, సొహం గ్రామం మాయింటి దగ్గిరచేరి, అవకాశం రాగానే పరామర్శల్లోనూ, అవ్వ స్మృతుల్ని నెమరువేసుకోవడంలోనూ, అప్పుడే పడిపోయారు.

ఇదీ తిర్నాళ్లరోజున అర్ధరాత్రి మా స్థితి.

అంతలో "సన్యాసిరాజుగారిల్లిదేనా?" అని దూరాన్నుంచి గద్దిస్తున్న మాటలు వినబడ్డాయి. అందరూ అటు తిరిగి చూశారు.

"యెవరు బాబూ, యేవిటి" అని గావుకేక పెట్టాన్నేను. చీకట్లోంచి వొస్తూ పోలీసు జెవాను కనబడ్డాడు. కూడా రీగ్గా నడుస్తూ, చీకట్లో దీపస్తంభం లాగా, జెవాను కంటే ధాటీగా అవ్వ సాక్షాత్కరించింది. "అవ్వొచ్చింది" అని కేకేశాను. లోపల్నించి అందరూ "ఘొల్లు"మని యివతలికి వొచ్చారు.

కొందరు మాత్రం 'అరెరె! అవ్వ అప్పుడే దొరికేసిందే. నాల్రోజుల పాటు సరదా పోయిందే' ని దిగులు మొహం వేశారు.

పోలీసు జెవాన్, 'యిదుగోనండీ ముసలావిడ. నా ప్రాణాలు తోడేసిందీ. ఈవిణ్ణి! తిర్నాళ్లకీ తీర్థాలకీ పంపి, దేశం మీద వొదుల్తారేవిటయ్యా. యీవిడ కంటే మా సూపరెంటు నయం" అని చీదరించుకుంటూ అన్నాడు.

"పోరా! నే సూపరింటునే. నాకేంరా బహద్దర్ని! శెలవిచ్చాను ఫో" అంది అవ్వ. వాడు పళ్లు బిగించి కొరకొర చూసి, చీకట్లోకి నడిచి, అక్కడ ఖాండ్రించి వుమ్మేసి చక్కా పోయాడు.

ఇహ తీర్థంలో జరిగిన కథేవిటంటే...

నాన్నిగాడు రంగులరాట్నం తిరుగుతూంటే పిల్లలందరికీ జీళ్లూ, జంగిడీ మిఠాయీ, తొక్కుడుండలూ కొందామని, ఆ కొట్లకెళ్లి వొక్కొక్కళ్లకి పేరు పేర్నా వొక్కొక్క పొట్లాం కట్టించిందట అవ్వ. అక్కడ చిల్లర విషయంలో కొట్టువాడితో పేచీ వొచ్చి, వాణ్ణి భూశెయనం చేసి పారేసి, దమ్మిడీలతో సహా వాడి దగ్గర్నుంచి రాబట్టి, పాత్ర సామాను దుకాణం వైపు దండ యాత్ర మళ్లించి, అక్కడ ఆ దుకాణం మీద పడిందట. అక్కడ రాగిచెంబూ గరిటా బేరం తెల్చడానికి రావరావణ యుద్ధం చేసి, రాచ్చిప్పల కొట్టువైపు దృష్టి తిప్పి, అటు దాడి చేసింది. దారిలో డక్కీ దమడమలబండీ వాడు తారసిల్లితే, అన్నీ వాయించి, నడిపీ చూసీ, అమ్మేవాడు బారుమని యేడ్చేదాక వాణ్ణి ఆపి, అంతలో వుప్మాకయ్యగారి కుటుంబం కనపడితే వాళ్లతో వూసులాడి, అట్టే నాలుగడుగులేసే సరికి నాన్నిగాడు గ్యాపకానికొచ్చాడు. అప్పటికప్పుడే పొద్దు వాల్తోంది.

"నాన్నిగా నాన్నిగా" అని తీర్థవంతా తిరగడం మొదలెట్టింది. బళ్ల దగ్గరి కొచ్చి చూస్తే, రావయ్య కాపు బండీ వెళ్లిపోయింది. మళ్లీ తీర్థంలోకి వొచ్చింది. "మా నాన్నిగాడు కనబడ్డాడా" అనడుగుతూ, ఎవళ్ల నడిగినా వాళ్లు పట్టించుకోలేదు. అప్పటికి కంగారు పడ్డం మొదలెట్టిందవ్వ. ఇంతలో కనబడిన పోలీస్ జెవాన్ని కూడా అడిగింది. వాడు వూరూ పేరు అన్నీ అడిగి పోలీస్ స్టేషన్ దగ్గిర కూచోబెట్టాడు.

"అమ్మా! భైపడకండి. ఇంటికి తీసికెడతాం" అని పోలీసు వాడంటే, "ఎవరికిరా భయం" అని ధీమాగా మొదట అన్నప్పటికీ, నాన్నిగాడి కోసం లోపల్లోపల కంగారు పడిపోయింది. అవ్వ పోలీస్ స్టేషన్లో కూర్చున్న సమయంలోనే కావిగాడూ గోవిందూ అవ్వ కోసం గాలించిపోయారు. యిదంతా చెప్పాక యిలాగంది అవ్వ : 'ఆ రాచ్చిప్పల దుకాణః దగ్గిరాలస్యవయి పోయిందర్రా! అక్కడే ఒళ్లు మరిచిపోతుంటాను. ఏవిరా నాన్నిగా! శివరాత్రి గూడాను. అప్పన్నశాస్తుర్లు గారి పద్యాలు నా మీద రాసినవి చదవరా" అంది. అందరూ పకపకా నవ్వారు. నాకు మాత్రం వొళ్లు భగ్గుమంది. ఆవిడ గొంతుక పట్టుకుని ఆ రాత్రి ఆవెని శివసాయుజ్యం పొందిద్దావనుకున్నాను. దిక్కుమాలిన పాప భయవో, దండన భయవో వొచ్చిపడి మళ్లీ తమాయించుకున్నాను. అంతకంటే గూడా నా లోపల పిచ్చి యిష్టం గూడా యేడిసిందాయెను అవ్వమీద, మా సుబ్బమ్మవ్వ మీద!

★



జనం మెచ్చిన జాలాది

"రాజు మరణించె ఒక తార రాలిపోయె! కవియు మరణించె ఒక తార గగనమెక్కె!! రాజు జీవించె రాతి విగ్రహముల యందు! సుకవి జీవించె ప్రజల నాలుకల యందు!!" అంటారు మహాకవి గుఱ్ఱం జాషువా. కవిత్వంలోనూ, జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, అవమానాల్లో కూడా ఆయనకు అంతేవాసి అనదగ్గ కవి జాలాదికి ఈ మాటలు అక్షరాలా సరిపోతాయి. రాసినవి కొద్ది గీతాలే అయినా, తనదైన ప్రత్యేకత చూపి, చిరకాలం జనం నోట నిలిచే పాటలతో చిరంజీవిత్వాన్ని సంపాదించిన సినీ కవి - ఈ అక్టోబర్ 14 శుక్రవారం నాడు విశాఖపట్నంలో మరణించిన 79 ఏళ్ళ జాలాది. 'ఏతమేసి తోడినా ఏరు ఎండదు, పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదు...' అంటూ జీవిత తత్వాన్ని శిలాక్షరాలైన సినీ గేయంలో ఇమిడ్చిన జనం కవి ఆయన. ఆయన జీవితం, సినీ జీవిత కృషికి ఇది అక్షరాంజలి.

జీవితం గాయం చేసినప్పుడు, గేయం ఇచ్చే ఓదార్పు ఎలాంటిదో తెలియాలంటే జాలాది రచన వినాలి. ఆగని పరుగుపందెంలో అలసిపోతున్నప్పుడు ఆ బడలిక తీరాలంటే, జాలాది గీతాన్ని గానం చేయాలి. జీవితమనే సాగర యానంలో దిక్కుతోచక బిక్కుబిక్కుమంటున్నప్పుడు జీవన తత్వాన్ని చుక్కానిగా అందించే మాట – జాలాది పాట. పల్లెటూరి భాషలో పలవరించాలన్నా, జనం గుండెల్లో జాతీయ భావన ఉరకలు వేయాలన్నా అదను చూసి కదం తొక్కడం ఆయనలోని విశిష్టత. గ్రామంలో పుట్టి, గ్రామీణుల మధ్య ఒకడిగా పెరిగి, వారితో జీవితం సాగించిన జాలాదికి సహజంగానే ఆ యాస, ఆ భాష కరతలామలం. ఉద్యోగ రీత్యా కృష్ణా జిల్లా నుంచి విజయనగరం దాకా వివిధ ప్రాంతాల్లో గడపడం, తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఉద్యమ నేపథ్యంతో అరుణారుణ భావాలతో జీవితం సాగించడం లాంటివన్నీ జాలాది రచనకు పునాదులు. లెక్కపెట్టి చూస్తే, జాలాది వందలాది సినిమాల్లో పనిచేయలేదు! వేల కొద్దీ పాటలేమీ రాయలేదు! ఇంకా చెప్పాలంటే, ఆయన పాట రాసి కొన్నేళ్ళయిపోయింది. అయినా సరే జాలాది ఎందుకు గుర్తున్నారు? ఆయన పాటలు ఎందుకు గుర్తుంటాయి? అక్కడే రచయితగా జాలాది ప్రత్యేకత కనిపిస్తుంది. వాణిజ్య చిత్రాల పాటల వెల్లువలో నలుగురితో పాటూ నారాయణగా పడి కొట్టుకొని పోకుండా, జనపదాల్లోని సామాన్య జనం భాషకు పాటలో పట్టం కట్టడం ఆయనను సినీ గేయకవుల్లో విశిష్టుడిగా నిలబెట్టింది.

చిన్ననాటి ఊసులు

కృష్ణాజిల్లా గుడివాడ దగ్గర దొండపాడు గ్రామంలో జన్మించిన జాలాది రాజారావు తన ఇంటిపేరుతో సినీ కవిగా ప్రసిద్ధుడయ్యారు. ఆ ఎదగడం వెనుక ఎన్నో రీళ్ళ కథ ఉంది. కన్నీళ్ళు, కష్టాలు ఉన్నాయి. దాదాపు 80 ఏళ్ళ క్రితం 1932 ఆగస్టు 9న ఆయన జన్మించారు. జాలాది తండ్రి ఇమ్మాన్యుయేల్ తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, జైలు శిక్షలు అనుభవించిన ధీరుడు. "పుట్టగానే అమ్మ ఆరోగ్యం దెబ్బతినడంతో, తల్లిపాలు తెలియకుండా డబ్బా పాలతో పెరిగిన" దురదృష్టవంతుణ్ణి అని జాలాది ఎప్పుడూ చెబుతుండేవారు. చిన్నతనంలో చిలిపి చేష్టలతో పెరిగిన ఆయన ఆ వయస్సులోనే అన్యాయం ఎక్కడ జరిగినా సహించేవారు కాదు. ఆడపిల్లల్ని ఏడిపిస్తున్నవారి భరతం పట్టేవారు. గుడివాడలోని జిల్లా బోర్డు స్కూల్‌లో చదువుకుంటున్న రోజుల నుంచి తెలుగు మాస్టారు చెబుతున్న ఇతిహాసాల గురించి ఎన్నెన్నో సందేహాలు వెలిబుచ్చి, వాటిని నివృత్తి చేసుకొనేందుకు ప్రయత్నించిన జిజ్ఞాసి ఆయన. స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొంటున్న తండ్రి ప్రభావం సహజంగానే జాలాది మీదా పడింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో తండ్రి స్ఫూర్తితో, గుడివాడలో కొంతమంది యువకులతో కలసి జట్టుగా ఏర్పడి, యుద్ధాన్ని నిరసిస్తూ, ఆందోళనలు చేశారు. రైలుపట్టాలు పీకడం, తీగలు తెంపడం, ఫైళ్ళు తగలబెట్టడం లాంటి చర్యలతో బ్రిటీషు వారికి తమ నిరసన తెలిపేవారట! అలాగే, జట్టులోని బాలలంతా బిచ్చగాళ్ళలా, కూలీల్లా మారువేషాలు వేసుకొని వెళ్ళి, అజ్ఞాతంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధులకు అవసరమైన సమాచారాన్నీ, వస్తువులనూ అందించేవారట! అలా 13వ ఏటనే జాతీయోద్యమ సంస్థలకు రహస్యంగా విలువైన సమాచారం అందిస్తూ, జాతీయోద్యమంలోని ప్రముఖులకు జాలాది లేఖలు రాసేవారట! చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టపడే జాలాది గుడివాడ ట్రావెలర్స్ బంగళా ఆవరణలో, సబ్ కలెక్టర్ ఆఫీసులోని మైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ లాంటివన్నీ ఆడేవారు. అక్కడ బ్రిటీషు సైనికుల దౌర్జన్యాలను మనస్సులో పెట్టుకొని, అక్కడ తమతో ఫుట్‌బాల్ ఆడడానికి వారు వచ్చినప్పుడు ఆటలో ఆటలా పొత్తికడుపులో తన్ని మరీ ఆయన కక్ష తీర్చుకొనేవారట!

ప్రభావం చూపిన సంగతులు

ఎనిమిదో తరగతి రోజుల నుంచే ఆయన గేయాలు రాసేవారు. పాఠశాలలో ప్రార్థనా గీతాలు రచించేవారు. మిత్రులతో కబుర్లాడుతూ, మాటల మధ్యలోనే కవితలు అల్లేవారు. ఆయన సరదాగా రాసిన గేయాలు, కవితలు 1942లోనే ప్రసిద్ధ 'కృష్ణాపత్రిక'లో అచ్చయ్యాయట! 'జారా', 'గోరా' లాంటి కలం పేర్లతో ఆయన రచనలు చేసేవారు. గుడివాడలో చదువుకొంటున్న రోజుల్లో నాటకాలతో ఎక్కువగా కాలక్షేపం చేసేవారు. 'ప్రభాకర నాట్యమండలి' సమాజంలో నటుడు కైకాల సత్యనారాయణ, వట్టెం సత్యం తదితరులు జాలాదితో పాటు సభ్యులు. ఆ రోజుల్లో పరిచయమైన రచయిత – విమర్శకుడు త్రిపురనేని మధుసూదనరావు ప్రోద్బలంతో జాలాది దృష్టి ఉత్తమ సాహిత్యం వైపు మళ్ళింది. ఆ ప్రభావంతో ఆయన 'మధురాజా' అనే కలం పేరుతోనూ రచనలు చేశారు. విద్యార్థి దశలోనే నాటికలు, నాటకాలు, సుమారు 200 గేయాలు రాయడం జాలాది భావి సినీ రచనా జీవితానికి తొలి మెట్టు. చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షితులైన జాలాది ఎస్.ఎల్.సి. తరువాత కొద్ది రోజులు రాజకీయాల్లో తిరిగారు. పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. తండ్రి చనిపోవడంతో 1952 ఎన్నికల్లో గుడివాడ నుంచి కానీ, కంకిపాడు నుంచి కానీ పోటీ చేయాల్సిందిగా ఆయనను అడిగారట! కానీ, అందుకు అంగీకరించని జాలాది చివరకు సమాజంలో చైతన్యం తీసుకురావడానికి మంచి సాధనంగా

భావించి, ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకున్నారు. డ్రాయింగ్ టీచర్ వేణుగోపాలరావు శిక్షణలో బొమ్మలు వేయడం నేర్చుకొని, చిత్రలేఖనంలో స్వర్ణపతకం సాధించిన ఆయన 'డ్రాయింగ్ మాస్టారు'గా ఉద్యోగం సంపాదించారు. కృష్ణాజిల్లా ఆరుగొలనులో జిల్లా బోర్డ్ హైస్కూల్‌లో కొంతకాలం పనిచేశారు. అప్పట్లో కేవలం 78 రూపాయల నెల జీతంతో పని చేసిన ఆయన ఆ తరువాత విజయనగరం జిల్లా రావివలసలో ఉద్యోగం చేశారు. అటు పైన శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల ప్రాంతానికి బదిలీ అయ్యారు. అదీ ఒకందుకు ఆయనకు లాభించింది. శ్రీకాకుళం, కృష్ణాజిల్లాల్లోని మారుమూల అటవీ ప్రాంతాల్లో టీచర్‌గా పనిచేయడంతో, అక్కడి కోయలు, గోండ్లు, సవరలు, రెల్లీలతో పరిచయాలు పెంచుకున్నారు. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు వ్యక్తిగతమైన ఆసక్తి కొద్దీ ఆయా ప్రాంతాల వారి భాష పైన, మాండలికాల పైన పట్టు సంపాదించారు. వారి జానపద గీతాలపై విశేష కృషి చేశారు. అది కూడా అనంతర కాలంలో సినీ గేయ రచనలో ఆయనకు వెన్నుదన్నయింది. అందుకే జాలాది తరచూ, "నేను చదివి రాసింది తక్కువ. విని రాసింది ఎక్కువ" అని చెబుతుండేవారు. 1964 డిసెంబర్ 28న ఆగ్నేశమ్మతో వివాహమైన జాలాదికి నలుగురు కుమార్తెలు (కుమారి, ఉమ, విజయ, నిర్మల), ఒక కుమారుడు (శ్రీనివాసరావు). ఉద్యోగ జీవితంలో కష్టాలు, అవమానాలను ఎదుర్కొన్న జాలాది పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలోకి సైతం రాజకీయాలు జొరబడటంతో బాధ కలిగి, 1968లో శ్రీకాకుళం జిల్లా వీరఘట్టంలో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశారు. వైద్యశాఖలో ఉద్యోగం చేస్తున్న భార్య జీతంతో కుటుంబం వెళ్ళదీశారు. జాలాదితో ఉన్న రాజకీయ కక్షల కారణంగా ప్రత్యర్థులు ఆమెను కనీసం రోడ్డయినా లేని ఊళ్ళకు సైతం బదిలీ చేస్తూ, ఇబ్బంది పెట్టారు. దాదాపు 9 నెలల పాటు భార్యకు జీతం కూడా రాని రోజులున్నాయి. "అయినా మేము ఏ రోజూ బాధపడలేదు. ప్రజలతో ఉన్న సత్సంబంధాల కారణంగా తిండికి ఇబ్బంది పడలేదు" అని ఓ సందర్భంలో జాలాది చెప్పుకొచ్చారు.



జాలాదికి నివాళులర్పిస్తున్న చిరంజీవి, పరుచూరి గోపాలకృష్ణ, మహారథి, సత్యానంద్

సినీ రంగంలో సక్సెస్

చివరకు సినీ రంగంలోకి వెళ్ళాల్సిందిగా స్నేహితులు ప్రోత్సహించడమే కాక, అన్యమనస్కంగా ఉన్న జాలాదిని తమ సొంత డబ్బులతో మద్రాసుకు తీసుకువెళ్ళారు. 1975 జులైలో మద్రాసు వెళ్ళి, సినిమా పాటలు రాసే ప్రయత్నాలు చేస్తూ వచ్చిన జాలాది అప్పటికే సినిమాల్లో ఉన్న మోదుకూరి జాన్సన్ ద్వారా ఇవాళ పి.సి. రెడ్డిగా ప్రసిద్ధులైన దర్శకుడు పి. చంద్రశేఖర రెడ్డికి పరిచయమయ్యారు. ఆయన ఇచ్చిన తొలి అవకాశంతో 1976లో జాలాది సినీ కవి అయ్యారు. 'పల్లెసీమ' (విడుదల – 1977) చిత్రంలోని 'సూరట్టుకు జారతాది...' అంటూ జానపద బాణీలో జాలాది రాసిన తొలిపాట రికార్డింగ్ వెనుకా ఓ కథ ఉంది. మద్రాసులోని విజయా గార్డెన్స్‌లో 1976 ఆగస్టు 9న ఆ పాట రికార్డయింది. ఆ పాట రికార్డు చేస్తున్నప్పుడు, పాటలోని కొన్ని పదాలు బాగా లేవంటూ గాయని పి. సుశీల అభ్యంతరం చెప్పారట! కానీ, చివరకు పెద్దలు నచ్చజెప్పడంతో ఆ పాట పాడారట! అలా బాలారిష్టాలు దాటుకొని వచ్చిన ఆ పాట ఆ తరువాత అందరికీ ఎంత పేరు తెచ్చి, ఇవాళ్టికీ ఎలాంటి ఎవర్‌గ్రీన్ హిట్‌గా నిలిచిందో అందరికీ తెలిసిందే! 'పల్లెసీమ'లో పాట రచన తరువాత నటి – దర్శకురాలు విజయనిర్మల ప్రోత్సాహంతో 'దేవుడే గెలిచాడు' (1976) చిత్రానికి 'ఈ కాలం పదికాలాలు బతకాలని...' అంటూ మలిగీతం రాశారు జాలాది. అదీ హిట్టే! "జాలాది కేవలం జానపదాలనే కాక, అన్ని రకాల పాటలూ రాయగలరని అది ఋజువు చేసింది" అని సినీ గీత పరిశోధకులు డాక్టర్ పైడిపాల పేర్కొన్నారు. ఆ తరువాత 'ప్రాణం ఖరీదు' (1978)లో 'యాతమేసి తోడినా...' -- అలా అలా జాలాది కలం నుంచి ఎన్నో అద్భుతమైన గీతాలు వెలువడ్డాయి. మొదటి పది సినిమాలయ్యేసరి కల్లా ఆయనకు మంచి పేరొచ్చింది. అప్పటి నుంచి కొన్నేళ్ళ పాటు ఆయన సినీ పరిశ్రమలో నిరాటంకంగా కొనసాగారు.

పల్లెటూరి భాషలో పల్లవించిన కవి

సినీ రంగంలో జాలాది సంపాదించుకున్న స్థానం తక్కువేమీ కాదు. నిజానికి, జానపద బాణీల పాటలన్నా, పల్లీయుల భాషలోని జన గీతాలన్నా సినీ రచయితల్లో అందరికీ చటుక్కున గుర్తొచ్చే పేరు – కొసరాజు (రాఘవయ్య చౌదరి). సముద్రాల సీనియర్, మల్లాది రామకృష్ణశాస్త్రి, సి. నారాయణరెడ్డి తదితరులెందరో ఆ తరహా పాటలు రాసినా, జానపద ధోరణి పాటలంటే కొసరాజునే స్మరించడం ఓ ఆనవాయితీ. ఆ మార్గాన్నే పయనించిన అనంతర కాలపు కవి జాలాది. "తెలుగు సినీ జానపద సాహిత్యంలో కొసరాజు చక్రవర్తి. నేను సామంత రాజును. కొసరాజు తరువాత జాలాది అని అన్నప్పుడు పొంగిపోయాను, పొంగిపోతాను" అని జాలాది ఓ ఇంటర్వ్యూలో తనను తాను కొసరాజుకు వారసుడిగా అభివర్ణించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు నేర్చిన మాండలికాలతో పాటలు రాస్తూ వచ్చిన జాలాది, జానపదుల పాటల ప్రేరణతో సినీ గీతాలు రాస్తే ఆ జానపద గీతాలు కాలానికి నిలుస్తాయని అభిప్రాయపడేవారు. అలాగే, జానపద గీతాల్లో శృంగారాన్ని రంగరించడం అవసరమనీ ఆయన నమ్మేవారు. అయితే, సినీ సంగీత – నృత్య విశ్లేషకుడు, పరిశోధకుడు వి.ఎ.కె. రంగారావు మాత్రం "కొసరాజు పాటల్లో సమకాలీన సమాజం పట్ల వ్యాఖ్యానం, ఓ వ్యంగ్య ధోరణి కనిపిస్తాయి. కానీ, నేను గమనించిన కొద్దిపాటి జాలాది గీతాల్లో ఆ జాడ లేదు. కొసరాజు తరహా ముద్ర లేకపోయినా, జాలాది రాసిన 'సూరట్టుకు జారతాది సితుక్కు సితుక్కు వాన సుక్క...' లాంటి పాటలు చిరస్థాయిని సంపాదించుకున్నవే" అని అభిప్రాయపడ్డారు. ఏమైనా, తొలి గీతం 'సూరట్టుకు జారతాది...'తోనే అందరి దృష్టినీ ఆకర్షించిన జాలాది ఆ పైన తనదైన ప్రత్యేకత కోసమే ఎక్కువగా శ్రమించినట్లు కనిపిస్తుంది. 'ప్రాణం ఖరీదు' (1978)లో రాసిన 'యాతమేసి తోడినా ఏరు ఎండదు...', 'ఓలమ్మ తిరణాల గిలక...' పాటలు ఆయనను అప్పటికీ, ఇప్పటికీ సుప్రసిద్ధుడిగా నిలిపాయి. జాలాది తన జీవితకాలంలో దాదాపు 275 చిత్రాలకు సుమారు 1000 పాటలు రాసి ఉంటారని లెక్కలు తెలిసినవారి అంచనా. 'పున్నమి వెన్నెల' చిత్రానికి ఆయన మాటలు కూడా రాశారు.

చిరస్మరణీయ గీతాల చిరునామా

గంగిగోవు పాల లాగా రాశిలో జాలాది పాటలు తక్కువైనా, వాటి వాసి, పొందిన జనాదరణ ఎక్కువే! ఏ రకం పాట రాసినా, అది జనం నోట నిలిచేలా తీర్చిదిద్దడం ఆయన విశిష్టత. అందుకు ఉదాహరణలు అనేకం. తొలి సినీ గీతంలోనే స్త్రీని ప్రకృతి అందాలతో పోల్చి, ఆయన అందరినీ ముగ్ధుల్ని చేశారు. కృష్ణ హీరోగా నటించిన 'పట్నవాసం' (1978) చిత్రంలో 'చేసేది పట్టణ వాసం.. మేసేది పల్లెల గ్రాసం...', అలాగే 'ఛల్ మోహన రంగ' (1978) చిత్రంలోని

'ఘల్లుఘల్లని కాలి గజ్జెలు మ్రోగంగ...' అన్న జాలాది పాటలు అప్పట్లో రేడియోలో తరచూ వినిపించేవి. 'తూర్పు వెళ్ళే రైలు' (1979)లోని 'కో అంటే కోయిలమ్మ కోకో...', 'సందె పొద్దు అందాలున్న సిన్నదీ...' పాటలు ఇప్పటికీ పాపులరే! మురళీమోహన్ నటించిన 'వారాలబ్బాయి' (1981)లో 'కాకమ్మ కాకి.. కలవోళ్ళ కాకి.. లోకాన ఏకాకి...' అంటూ సమాజంలోని తేడాలను ఆయన పాటలో బొమ్మ కట్టారు. తరువాతి రోజుల్లో నటుడు మోహన్‌బాబు చిత్రపరిశ్రమలో జాలాదిని ఎంతో ప్రోత్సహించారు. ఆయన నటించిన, నిర్మించిన చిత్రాలెన్నిటికో జాలాది మంచి పాటలు రాశారు. 'గృహప్రవేశం' (1982)లోని 'అభినవ శశిరేఖవో.. ప్రియతమ శుభలేఖవో...', 'సిరిదేవి సింగారి సిలకా...', 'రౌడీ గారి పెళ్ళాం' (1991)లోని 'కుంతీకుమారి తన నోరు జారి రాసింది ఒక భారతం...' అందుకు కొన్ని ఉదాహరణలు. అలాగే, జనం నోట నిలిచిపోయిన పాటల్లో 'ఇదా ప్రపంచం' (1987) చిత్రంలోని 'బండెల్లి పోతాందే సెల్లెలా.. బతుకు బండెల్లి పోతాందే సెల్లెలా...' ఒకటి. ఇక, ఎన్టీఆర్ హీరోగా మోహన్‌బాబు నిర్మించిన 'మేజర్ చంద్రకాంత్' (1993)లోని 'పుణ్యభూమి నా దేశం నమో నమామి...' పాట జాలాదికి చిరకీర్తిని తెచ్చిపెట్టింది. సినీ పరిశ్రమ సాగుతున్న కేంద్రంలో స్థిరనివాసం ఏర్పరచుకోకపోవడంతో ఆయనకు రావాల్సినన్ని అవకాశాలు రాలేదని కొందరి అభిప్రాయం. తరువాత రోజుల్లో జోరు తగ్గినా, ఆయన 'ఎర్రోడు', 'దొరబాబు', 'ఓ తండ్రి.. ఓ కొడుకు', 'పల్నాటి పౌరుషం', 'బొబ్బిలి సింహం', 'సుబ్బు', 'టైగర్ హరిశ్చంద్రప్రసాద్' తదితర చిత్రాలకు ఆయన పాటలు రాశారు. అందుకే, "తక్కువ పాటలే రాసినా, రాసిన ప్రతి పాటతో గుర్తింపు పొందిన అరుదైన కవి" అని జాలాదిని దర్శకుడు ముత్యాల సుబ్బయ్య స్మరించుకున్నారు. హీరో కృష్ణ ఏసుక్రీస్తుగా నటించిన 'శాంతి సందేశం' (2004) తరువాత జాలాది మరే చిత్రానికీ పాటలు రాసినట్లు లేరు. గీత రచయితగా తొలి అవకాశమిచ్చిన పి.సి. రెడ్డే ఈ ఆఖరి చిత్రానికీ దర్శకుడు కావడం కాకతాళీయం.



ఒక జాషువా! ఒక జాలాది!!

"జాలాది జీన్స్‌లోనే కవిత్వం ఉంది. 'పాడిపంటలు' (1976)లో మోదుకూరి జాన్సన్ 'జన్మభూమి నా దేశం...' అని పాట రాస్తే, 'మేజర్ చంద్రకాంత్'లో జాలాది 'పుణ్యభూమి నా దేశం..' అని మరో గొప్ప పాట రచించారు. జాషువా, జాన్సన్, జాలాది - ఈ ముగ్గురూ ఎంతో చక్కని కవులు" అని సీనియర్ సినీ రచయిత త్రిపురనేని మహారథి వ్యాఖ్యానించారు. గమనిస్తే, జాషువాకూ, జాలాదికీ కొన్ని విషయాల్లో చాలానే పోలికలున్నాయి. ఇద్దరూ అధ్యాపక వృత్తిలో పనిచేసిన వారే! ఇద్దరూ సినీ రంగంతో అనుబంధం జత కలిసినవాళ్ళే! ఇద్దరూ 'కళాప్రపూర్ణ'లే! చాలామందికి తెలియని విషయం ఏమిటంటే, మూకీ చిత్రాల రోజుల్లో కొన్నాళ్ళ పాటు సినిమా హాలులో కథాకథకుడిగానూ పని చేసిన అనుభవం జాషువాది. ఆ 'కవికోకిల', 'కవితా విశారద' ఆ తరువాత టాకీలు వచ్చాక, తొలి దశాబ్దిలో లక్ష్మీ సినీటోన్ వారి 'రాధాకృష్ణ' (1939) లాంటి ఒకటీ అరా చిత్రాలకు రచయితగా పని చేశారు. అలాగే, 'హరిశ్చంద్ర' నాటకంలోని ఆయన కాటి సీను పద్యాలు వెండితెర మీదకూ ఎక్కాయి. ఇక, జాలాది కూడా సినిమాల్లో పాటల రచనతో అశేష ఆంధ్రులకు తన ప్రతిభా వ్యుత్పత్తులను చాటారు. స్థాయిల్లో తేడా ఉన్నప్పటికీ, జాషువా, జాలాది - ఇద్దరూ కష్టనష్టాలనూ, దూషణ, భూషణ, తిరస్కారాలనూ అందుకున్నవారే! ఆఖరికి తమ అక్షర రచన ద్వారా జనంలో శాశ్వత కీర్తిని సంపాదించుకున్నవారే! జాషువా 'క్రీస్తు చరిత్ర' పేరిట కావ్యం రాశారు. ఆ కావ్యానికి సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. జాలాది ఏమో ఎన్నో క్రైస్తవ భక్తి గీతాలు రాశారు. అయితే, ఆ సంగతి ఎక్కువమందికి తెలియదు. "క్రైస్తవ రచయితగా ఆయన మద్రాసులోని హిందుస్తాన్ బైబిల్ ఇన్‌స్టిట్యూట్ వారు ప్రసారం చేసే 'ప్రేమవాణి' కార్యక్రమాల్లో ఎన్నో భక్తి పాటలు రాశారు. గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన 'ఆత్మ నింపుమా.. జీవాత్మ నింపుమా.. తృణమైన బ్రతుకు తూలిపోక జాలి చూపుమా...' అన్న భక్తి గీతం జాలాది రచనే" అని కవి, విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఎండ్లూరి సుధాకర్ తెలిపారు. ఒకప్పుడు తోటి కవులు చిన్నచూపు చూసినా, చివరకు వారే జాషువా ప్రతిభను గుర్తించి, గజారోహణలు చేయించారు. గండపెండేరాలు తొడిగారు. 1970లో ఆంధ్ర విశ్వవిద్యాలయం జాషువాకు గౌరవ డాక్టరేట్ పట్టా అయిన 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించింది. ముప్పై ఎనిమిదేళ్ళ తరువాత 2008లో అదే ఆంధ్ర విశ్వవిద్యాలయం జాలాదికి ఆ గౌరవాన్ని అందించింది. జాలాది పాటలపై ఆయన కుమార్తె మాత్రమే కాకుండా, సి.సుబ్బారావు అనే మరొక విద్యార్థి సైతం పరిశోధన జరిపారు, పిహెచ్.డి. పట్టాలు సాధించారు. వ్యక్తిగా జాలాది సాత్వికుడు, సౌమ్యుడు. ప్రచారానికీ, పటాటోపానికీ దూరంగా నిలిచే సాదాసీదా వ్యక్తి. "ప్రముఖ సినీ పంపిణీ సంస్థ 'నవయుగ'లో పనిచేస్తున్న కాలంలో బెజవాడలో ఆయనను కొన్నిసార్లు కలుసుకోవడం తటస్థించింది. ఉపాధ్యాయ వృత్తి నుంచి పైకొచ్చిన ఆయనలో ఆర్భాటమేమీ ఉండేది కాదు. అలాగే, ఆయన అంతర్ముఖుడు" అని సినీ పంపిణీ, ప్రచార వ్యవహారాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న కాట్రగడ్డ నరసయ్య గుర్తు చేసుకున్నారు. అక్కచెల్లెళ్ళు, నలుగురు అన్నదమ్ముల్లో తానొక్కణ్ణే నల్లగా ఉండడంతో, ఎవరు తనను పలకరించకపోయినా, పట్టించుకోవడం లేదని చిన్నప్పటి నుంచి జాలాది భావించేవారు. అలా అప్పట్లోనే మనస్సులో నాటుకున్న భావమే తరువాతి రోజుల్లో ఆయనను అంతర్ముఖీనుణ్ణి చేసి ఉండవచ్చు.

ప్రభుత్వ అవార్డులా? ప్రజల రివార్డులా?

మరి, జాలాదికి రావాల్సినంత గుర్తింపు వచ్చిందా? 'మేజర్ చంద్రకాంత్'లో 'పుణ్యభూమి నా దేశం నమో నమామి...' లాంటి గొప్ప పాట రాసినా, అవార్డు విషయంలో కేంద్ర ప్రభుత్వం తగిన గుర్తింపు నివ్వలేదని జాలాది తరచూ అంటూ ఉండేవారు. ఆయనకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు కూడా ఒకే ఒక్కటి. 1990వ సంవత్సరానికి గాను ఈతరం ఫిలిమ్స్ వారి 'ఎర్ర మందారం' చిత్రంలోని 'ఏలోయాల ఉయ్యాల, ఏడేడు జనమాల మొయ్యాల...' పాటకు జాలాదికి నంది అవార్డు వచ్చింది. అయితే, 1990 - 91, 1994-95 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ నంది అవార్డుల ఎంపిక సంఘంలో ఆయన సభ్యుడిగా వ్యవహరించడం, అదే సమయంలో ఆయన పాటకు పురస్కారం రావడం విమర్శలకు దారి తీసినట్లు పైడిపాల పేర్కొన్నారు. ఏమైనా, ప్రభుత్వమిచ్చే అవార్డుల కన్నా, ప్రజల రివార్డుల దృష్టిలో జాలాదికి బ్రహ్మాండమైన గుర్తింపు లభించింది. సామాన్య పల్లె జనం భాషలోని సాటిలేని తీయదనాన్ని సినీ సాహిత్యంలోకి ఆయన అనువర్తించినప్పుడల్లా ఆ పాట జనం నోట పలికింది. పది కాలాల పాటు పదిలంగా నిలిచింది. 'ఫిలిమ్ ఫేర్', 'కళాసాగర్', 'సినీ హెరాల్డ్' లాంటి ప్రసిద్ధ ప్రైవేటు సంస్థల సినీ అవార్డులు జాలాది సినీ గీతాలకు లభించాయి. ఈ ఏడాది ఆగస్టు 9న అభిమానులు జాలాది పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు. చాలా రోజులుగా ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్న జాలాది ఆ తరువాత రెండు నెలలకే మెదడులోని నరాలు దెబ్బతినడంతో శాశ్వతంగా పెన్ను మూశారు. 'ప్రాణం ఖరీదు'తో కథానాయకుడిగా జనం ముందుకు వచ్చిన హీరో చిరంజీవి చెప్పినట్లు, "ప్రభుత్వాలిచ్చే అవార్డులదేముంది! ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయే పాటలను మన ముందుంచారు. ఇదే జాలాదికి గొప్ప గుర్తింపు." సీనియర్ సినీ రచయిత సత్యానంద్ మాటల్లో చెప్పాలంటే, "కలకాలం గుర్తుండే మంచి పాటలు జాలాది రాశారు. మంచి పాటకు ఎప్పుడూ మరణం ఉండదు!" జాలాది చిరంజీవి.

- జయ

బాదుషాలు

కావలసిన పదార్థాలు

మైదాపిండి – అరకేజీ, బేకింగ్ పౌడర్ – 1 స్పూన్
వెన్న – 100 గ్రాములు, పంచదార – 400 గ్రాములు
నూనె – వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

మైదాపిండికి ఒక కప్పు పంచదార పొడి చేర్చి నీళ్లతో ముద్దలా కలిపి గంటసేపు నానబెట్టాలి. మిగిలిన పంచదారని కొద్దిగా నీళ్లుపోసి పాకం పట్టి ఉంచుకోవాలి. నానబెట్టిన పిండి ముద్దని చిన్న చిన్న వుండలు చేసి నెయ్యి రాస్తూ చపాతీలా వత్తాలి. దీన్ని నాలుగైదు సార్లు మడతపెడుతూ ఒత్తాలి. చివరిలో చపాతీని చాపలా చుట్టి అరంగుళం ముక్కలుగా కోసుకోవాలి. ఈ ముక్కను మధ్యలో కొద్దిగా అదిమి కాగిన నూనెలో వేయించాలి. వీటిని వెంటనే పంచదార పాకంలో ఓ ఐదు నిమిషాలు వేసి తీయాలి.



బియ్యంపిండి హల్వా

కావలసిన పదార్థాలు

బియ్యం – పావుకేజీ, ఏలకులు – 4
డాల్డా/ నెయ్యి – 150 గ్రాములు, బెల్లం – పావుకేజీ
జీడిపప్పు – 50 గ్రాములు

తయారు చేసే విధానం

బియ్యం నానబెట్టి బాగా మెత్తగా రుబ్బాలి. అందులో బెల్లం పొడి కలిపి సన్న సెగమీద ఉడకబెట్టాలి. ఇది ఉండలు కట్టకుండా కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం కొంచెం చిక్కబడగానే నెయ్యి/డాల్డా వేసి దగ్గరగా వచ్చేవరకు కలియదిప్పాలి. చివరిలో ఏలకుల పొడి కూడా వేసి కలపాలి. దీన్ని నెయ్యి రాసిన ప్లేటులో సమానంగా వచ్చేటట్లు పొయ్యాలి. పైన నేతిలో వేయించిన జీడిపప్పు చల్లుకోవాలి. అంతే ఘుమఘుమలాడే హల్వా తయార్.



కలాఖన్

కావలసిన పదార్థాలు

పాలు – 1 లీటరు
నిమ్మఉప్పు – చిటికెడు
పంచదార – 1/2 కేజీ

తయారు చేసే విధానం

పాలను బాగా మరిగించాలి. నిమ్మఉప్పువేసి పాలు విరగ్గొట్టాలి. పంచదారలో కొద్దిగా నీళ్ల పోసి లేతపాకం పట్టాలి. ఇందులో విరిగిన పాలను పోసి గట్టిపడేవరకు కలియదిప్పుతుండాలి. ప్లేటుకి నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని సమంగా పొయ్యాలి. ఆరిన తర్వాత ముక్కలు కోసుకోవాలి.



కోకోనట్ ఖీర్

కావలసిన పదార్థాలు

పాలు – 2 లీటర్లు, కొబ్బరి కాయ – 1
బాదంపప్పు, జీడిపప్పు, పిస్తాపప్పు – 1 కప్పు
పాలకోవా – 150 గ్రాములు
పంచదార – 1 కప్పు

తయారు చేసే విధానం

పచ్చికొబ్బరి తురుముకోవాలి. మందపాటి బాండీలో పాలు పోసి మరిగించాలి. అందులోనే కొబ్బరి తురుము, పాలకోవా, పంచదార వేసి పది నిమిషాలు ఉడికించాలి. పైన చెప్పిన పప్పుల్లో సగం అందులో వేసి కలపాలి. దీన్ని ఓ గంట ఫ్రిజ్‌లో పెట్టాలి. వడ్డించే ముందు మిగిలిన సగం పప్పులు కలిపితే బాగుంటుంది.



మైసూర్‌పాక్

కావలసిన పదార్థాలు

శనగపిండి – 1 కప్పు
పంచదార – 1 1/2 కప్పు
నెయ్యి – 1 కప్పు

తయారు చేసే విధానం

నేతిలో శనగపిండి వేయించాలి. పంచదార తీగపాకం పట్టాలి. తర్వాత వేయించిన శనగపిండి వేసి కలపాలి. అందులోనే నెయ్యి పోస్తూ తిప్పుతుండాలి. బుడగలు బుడగలు వచ్చి ముద్దలా అయ్యేవరకు అలా తిప్పుతూనే ఉండాలి. పళ్లేనికి నెయ్యిరాసి ఈ మిశ్రమాన్ని అందులో పోసి ముక్కలు కోసుకోవాలి.



చూద్దామా

సింగపూర్ సింగారాలు



సింగపూర్ విమానాశ్రయం ఎటువంటి రణగొణ ధ్వనులు లేకుండా, పచ్చని మొక్కలతో ఆహ్లాదభరితంగా ప్రశాంతంగా ఉంటుంది. 'లిటిల్ ఇండియా' అనే పెద్ద హోటల్‌ని 'మినీ దక్షిణ భారతదేశం' అంటారు. ఎందుకంటే తమిళులు, తెలుగువారు, మళయాళీలు ఎక్కువగా ఇక్కడే బస చేస్తారు. భారతీయ భోజనం, టిఫిన్లూ అన్నీ అక్కడ దొరుకుతాయి. ఇక్కడ హిందూ దేవాలయాలూ ఎక్కువే. మన పండుగలు బ్రహ్మాండంగా చేస్తారు. ఇంకా బంగారపు షాపులూ ఎక్కువే. మనకు వీధికొక కిరాణా షాపున్నట్లు అక్కడ బంగారపు షాపులు కనిపిస్తాయన్నమాట. పైగా నాణ్యమైన బంగారం దొరుకుతుంది. మజూరి ఉండదు.. అందుకే ఇక్కడకొచ్చిన పర్యాటకులు బంగారం కొనడానికి ఇష్టపడతారు. ఇన్ని బంగారపు షాపులున్నాయి కదా సెక్యూరిటీ కూడా బాగానే ఉంటుందనుకుంటాం. కానీ అలాంటి హడావుడేమీ కనిపించదు. ఇక్కడ లెదరు బ్యాగులు, డ్రెస్సులు కూడా తక్కువ ధరలకే దొరుకుతాయి.

చరిత్రలోకెళ్తే....

'రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్' అనే ద్వీపం మలేసియాకి దక్షిణ భాగంలో ఉంటుంది. 1819లో వ్యాపార నిమిత్తం ఈస్ట్ ఇండియా కంపెనీ ఇక్కడకి వచ్చిందట. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ దీన్ని స్వాధీనం చేసుకుంది. మళ్లీ 1945లో ఆంగ్లేయుల పరమైంది. 1963లో సింగపూర్, మలయా, సాబా, సరవాక్‌లు కలిసి మలేసియాగా ఏర్పడింది. 1965లో ఆగస్టు 9న సింగపూర్ స్వతంత్రదేశంగా అవతరించింది. దీని విస్తీర్ణం 274.2 చదరపు మైళ్లు. సింగపూర్‌లో ఇంగ్లీషు, మలయ్, తమిళం, చైనీస్ భాషల్ని మాట్లాడతారు. సెంగ్‌నీలా ఉటామా అనే వ్యక్తి పేరు నుండి సింగపూర్ అనే పేరు వచ్చిందట. షాపింగ్ మాల్స్ అన్నీ 24 గంటలూ తెరిచే ఉంటాయి. పట్టపగలైనా మహిళలు ఒంటరిగా బయటికెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు మనవి. కానీ అక్కడ అర్ధరాత్రుళ్లు కూడా మహిళలు ఒంటరిగా షాపింగ్‌కి వెళ్తుంటారు. కూరగాయలు, పండ్లు, పాలు, దుస్తులు... ఏవైనా నాణ్యత పరీక్షలు పూర్తి చేసుకున్న తర్వాతే మార్కెట్లోకి వస్తాయి. ఇక్కడ ఏ వస్తువైనా కళ్లు మూసుకుని కొనేయొచ్చు. కాలుష్యమంటే ఎలా ఉంటుంది? అన్నట్లుంటాయి అక్కడి రోడ్లు. ఎవరైనా చిన్న పేపర్‌ముక్క రోడ్డు మీద వేసినా శిక్ష పడుతుంది.

అద్భుత ప్రపంచం

జురంగ్ బర్డ్ పార్కులో రకరకాల పక్షులు కనిపిస్తాయి. ఆ పార్కులోని పక్షులన్నీ అడవుల్లో విహరించినంత స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. అందుకు కావలసిన ఏర్పాట్లు ఆ పార్కులో ఉన్నాయి. సెంటోసాలో ఉన్న టైగర్ స్కై టవర్ ఎత్తు 110 మీటర్లు. మధ్యలో ఓ స్తంభం... దాని చుట్టూ డిస్క్ ఆకారంలో ఎయిర్ కండిషన్ ఉన్న పెద్ద క్యాబిన్ తిరుగుతుంది. ఒకేసారి 72మంది అందులో కూర్చోవచ్చు. ఇది పైకి వెళ్తున్నప్పుడు గాజు కిటికీల్లోంచి సిటీని చూస్తుంటే భలేగా ఉంటుంది.

ఇక్కడ చూడాల్సిన మరో ప్రదేశం 'బటర్‌ఫ్లై పార్క్ అండ్ ఇన్‌సెక్ట్ కింగ్‌డమ్'. అదో అద్భుత ప్రపంచం.



ఎక్కడ చూసినా రంగురంగుల సీతాకోకచిలుకలే... ఆ దృశ్యం ఎంత మనోహరంగా ఉంటుందో చెప్పలేం. అక్కడ్నుండి సెంటోసా దీవి మీదున్న అండర్‌వాటర్ వరల్డ్‌లోకి వెళ్లొచ్చు. డాల్ఫిన్లు, తిమింగలాలు... వంటి జలచరాలన్నింటినీ 83 మీటర్ల పొడవాటి గాజు ట్రావలేటర్లో తిరుగుతూ చూడాలి. వాటి మధ్యలో నడుస్తుంటే గమ్మత్తుగా ఉంటుంది. అక్కడే లేజర్ షో, డాల్ఫిన్ షో, 4 డి షోలు కూడా వేస్తారు. సెంటోసా రైలెక్కి సింగపూర్ పరిసరాలన్నిటినీ చూడొచ్చు.

ఇక్కడ కొన్ని చోట్ల ట్రాఫిక్ పోలీసులకి బదులు రోబోలు కనిపిస్తాయి. అవే సిగ్నల్ చూపిస్తాయి. ఇది చూడ్డానికి చాలా తమాషాగా అనిపిస్తుంది.

ఆ దారిలోనే మలేకా అనే పురాతన నగరం ఉంటుంది. దీన్ని డచ్‌వారు, పోర్చుగీసువారు తర్వాత ఆంగ్లేయులు పాలించారట. ఇక్కడ 15వ శతాబ్దంలో కట్టిన చర్చీలు చాలా ఉన్నాయి. అన్నింటికన్నా ఇక్కడున్న సైకిలు రిక్షా పర్యాటకులను బాగా ఆకర్షిస్తుంది. సైకిల్‌కి ఒకవైపు రిక్షా ఉంటుంది. సైడ్ కారులా అనిపించే ఈ రిక్షాలను ఎంతో అందంగా ముస్తాబు చేస్తారు. పర్యాటకులు వీటిమీద ప్రయాణిస్తూ ఫొటోలు కూడా తీయించుకుంటారు.

మలేసియా పేరు చెప్పగానే మనందరికీ ముందుగా గుర్తుకొచ్చేవి పెట్రోనాస్ టవర్లు. ఈ ట్విన్ టవర్ల నిర్మాణంలో మొత్తంగా గాజు, స్టీలే వాడారు. 17 ఎకరాల స్థలంలో నిర్మించిన ఈ 88 అంతస్తుల భవనం చూసి తీరాల్సిందేగానీ వర్ణించడానికి మాటలు సరిపోవు. ఇప్పుడే కట్టారా అన్నట్లు మెరుస్తుంటుంది. 41, 42 అంతస్తుల మధ్య రెండింటినీ కలుపుతూ స్కై బ్రిడ్జ్ ఉంటుంది. అవసరం లేనప్పుడు దీన్ని మడిచేయొచ్చు కూడా. రోజూ ఉదయం 8 గంటలలోపు వెళ్తే 1700 మందికి మాత్రమే ఇందులోకి వెళ్లడానికి పాసులు ఇస్తారు.

కౌలాలంపూర్ టవర్‌లో రివాల్వింగ్ రెస్టారెంట్ ఉంది. ఇక్కడ నుండే ముస్లింలు నెలవంకను చూసి రంజాన్ దీక్షను విరమిస్తారు. రాత్రి సమయంలో ఇక్కడ నుండి పెట్రోనాస్ టవర్లను చూస్తే ఆ అనుభూతే వేరు. తర్వాత చూడాల్సిన వాటిలో ముఖ్యమైన ప్రదేశం గోంబాక్ రాష్ట్రంలో ఉన్న బాతుగుహలు. 400 మిలియన్ సంవత్సరాల నాటి ఈ గుహల సమీపంలో బాతు నది ప్రవహిస్తుంది. ఈ గుహల్లోనే శ్రీమురుగన్ ఆలయం ఉంది.

తిల్లివాంగ్‌సా అనే పర్వతాల మీద, సముద్రమట్టానికి 2000 మీటర్ల ఎత్తులో ఓ హోటళ్ల సమూహం ఉంది. అదే 'లాస్ వెగాస్ ఆఫ్ మలేసియా'. దీన్నే 'ఫస్ట్ వరల్డ్ హోటల్' అని కూడా పిలుస్తారు. ఇందులో 6,118 గదులున్నాయి. ప్రపంచంలో అవుట్ డోర్ థీమ్ పార్కుతో నిర్మించిన మొదటి హోటల్ ఇదే. 1998 వరకు ఇదే అతి పెద్ద హోటల్. ప్రస్తుతం మూడో స్థానంలో ఉంది. గిన్నిస్ బుక్‌లో కూడా ఎక్కిన ఈ హోటల్‌కి జెంటింగ్ స్కై వే ద్వారా వెళ్లొచ్చు. ఇదో కేబుల్ మార్గమన్నమాట. దీని పొడవు 3.38 కిలోమీటర్లు. ఈ మార్గంలో వెళ్లాలంటే గొహ్‌టాంగ్ జే నుండి వెళ్లాలి. రోడ్డు మార్గం కూడా ఉంది. కానీ కేబుల్ ప్రయాణం చేయడం బావుంటుందని ఎక్కువమంది ఇందులోనే వెళ్తుంటారు. ఇందులో గోల్ఫ్‌కోర్టులు, షాపింగ్ మాల్స్, గాంబ్లింగ్ సెంటర్లు, రెస్టారెంట్లు చాలా ఉంటాయి. ఇదో వింత లోకం. కొన్నివేల మంది ఒకేసారి అల్పాహారం చేయొచ్చు. ఇక ఇందులోని గదులు అత్యాధునిక సదుపాయాలతో రాజ భవనంలోలా ఉంటాయి.

★

టెక్‌పేజ్



మనం ఒక్క రోజు స్నానం చేయకపోతేనే అదోలా ఉంటుంది. అలాగే మన చుట్టూ వున్న పరిసరాలు శుభ్రంగా లేకపోతే మనమూ వుండలేము. శరీరం, పరిసరాలు ఎప్పుడూ శుభ్రంగా వుండాలని కోరుకుంటాం. అది సహజం కూడా... అయితే మనం వాడుతున్న కంప్యూటర్‌ను మాత్రం శుభ్రం చేయం. అది ఇల్లు కావచ్చు... ఆఫీసు కావచ్చు. మన అవసరాలకు ఉపయోగించుకుంటామే తప్ప.. అది యంత్రమేగదా అని దాని పట్ల నిర్లక్ష్యం వహిస్తాం. మరో కారణం... దాన్ని ముట్టుకుంటే ఎక్కడ పాడవుతుందోననే భయం కూడా వుండవచ్చు. ఇది చాలా తక్కువ. కంప్యూటర్ ఆపరేట్ చేస్తున్నారంటే... దానిపట్ల ఎంతోకొంత అవగాహన లేకుండా వుండదు. అటువంటప్పుడు శుభ్రం చేయడానికి ఇది ఆటంకం కాదు.

నన్ను శుభ్రం చేయండి... ప్లీజ్!!

ఒక్క కంప్యూటర్ విషయంలోనే కాదు మిగతా ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలోనూ ఇటువంటి అలసత్వాన్నే ప్రదర్శిస్తుంటాము. దానివల్ల ఆ వస్తువులు త్వరగా పాడైపోవడానికి అవకాశం ఎక్కువగా వుంటుంది. కంప్యూటర్లను గానీ, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కానీ శుభ్రం చేసేటప్పుడు ముందుగా విద్యుత్ సరఫరా చేసే కేబుల్‌ను తొలగించాలి. ఈ కేబుల్‌ను తీయకుండా కంప్యూటర్‌ను శుభ్రం చేయడానికి పూనుకుంటే షాక్ తగలడం వంటివి జరుగుతాయి. ఆ తర్వాత మిగతా వైర్లను కూడా తొలగించాలి. కంప్యూటర్‌ను అప్పుడేగనుక ఆఫ్‌చేసివుంటే వేడి తగ్గేవరకు వేచి వుండడం మంచిది. సాధారణంగా కంప్యూటర్‌లో ముందుగా మనం తాకేవి కీబోర్డ్, మౌస్, మోనిటర్. ముఖ్యంగా కీబోర్డ్, మౌస్‌లు అధికంగా దుమ్ముతో నిండిపోతుంటాయి. అదేవిధంగా సిపియు లోపల శుభ్రపర్చాలంటే కాస్త అవగాహన కూడా అవసరం. సిపియులోని ఎస్ఎంపిఎస్ ఫ్యాన్‌కి దుమ్ము పట్టివుందో లేదో గమనించాలి. ఒకవేళ దానికి దుమ్ము పట్టివుంటే సిపియులోని మిగతా భాగాలకు కూడా దుమ్ముపట్టి వుంటుందని అర్థం చేసుకోవాలి. కంప్యూటర్ లోపలి భాగాలను కూడా ప్రతి ఆరునెలలకొకసారి శుభ్రం చేయడం మంచిది. కంప్యూటర్ దుమ్ము ఎక్కువగా పడే ప్రాంతంలో వుంటే తరచుగా శుభ్రం చేయాల్సిందే. దుమ్ము పేరుకుపోవడం వలన కంప్యూటర్ పనితనం తగ్గుతుందని నిపుణులు చెపుతుంటారు. అయితే కంప్యూటర్‌ను శుభ్రపరిచే ముందు అన్ని కనెక్షన్లను తొలగించడం మంచిది.

కంప్యూటర్‌లో దుమ్ము అధికంగా కనబడేది మోనిటర్ స్క్రీన్‌పైనే. మోనిటర్‌పై దుమ్ము వుంటే మనం చూసే రంగులు, బొమ్మలు మసగ్గా కనబడతాయి. ముఖ్యంగా ఫొటో ఎడిటింగ్, డిజైనింగ్ వంటి రంగులకు సంబంధించిన పనులు వారు మోనిటర్‌పై దుమ్ము పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. మెత్తని గుడ్డ, కొలిన్ లిక్విడ్ వంటివాటిని ఉపయోగించవచ్చు. మోనిటర్‌పై ప్రత్యేక యాంటిగ్లేర్ కోటింగ్ వుంటే దానికి ప్రత్యేకమైన క్లీనర్లు ఉపయోగించాల్సి వుంటుంది. ఈ వివరాలు మోనిటర్ మాన్యువల్‌లో వుంటాయి. తుడిచేటప్పుడు లిక్విడ్ కారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అదేవిధంగా కంప్యూటర్‌లో ఎక్కువగా మురికి కనిపించేది మనం ఎక్కువగా వుపయోగించే కీబోర్డు, మౌస్. కొన్ని సందర్భాలలో ఇవి సరిగా పనిచేయకపోవడానికి కారణం కూడా దుమ్మే. కీబోర్డులను వ్యాక్యూమ్ క్లీనర్లతో శుభ్రం చేయాల్సి వుంటుంది. ఆ తర్వాత లిక్విడ్ చల్లి, మెత్తటి గుడ్డతో తుడవాలి. లిక్విడ్ కీబోర్డు లోపలి భాగాల్లోకి పోకుండా చూసుకోవాలి. చేయగలిగితే కీబోర్డుపై వుండే కీలను తొలగించి వాటిపై వున్న మురికి పోయే విధంగా శుభ్రం చేయవచ్చు. శుభ్రం చేసిన కీలను తిరిగి యథాస్థానంలో వుంచి నొక్కితే సరిపోతుంది. కాఫీ, టీ, తినుబండారాలను కంప్యూటర్ ముందు కూర్చొని తీసుకోకూడదు. అవి కీబోర్డుపై పడే ప్రమాదం వుంది.

మనం ఎక్కువగా ఉపయోగించే మరో పరికరం మౌస్. దీని పైభాగాన్ని కూడా మోనిటర్, కీబోర్డులను శుభ్రం చేసినట్టుగానే చేయాలి. మౌస్‌ను ఉపయోగించేటప్పుడు దాని లోపలికి దుమ్ము చేరుకొని అక్కడ వుండే మౌస్‌బాల్, రోలింగ్ బార్ల చుట్టూ పేరుకుపోతుంది. దీనివల్ల మౌస్ కదలిక సరళంగా వుండదు. దీన్ని శుభ్రం చేయాలంటే.. మౌస్‌ను వెనకకు తిప్పి, దాని కింద వుండే లాకింగ్ రింగ్ తిప్పితే ఓపెన్ అవుతుంది. అందులోని బాల్‌ను లిక్విడ్‌తో శుభ్రం చేయవచ్చు. తర్వాత రోలింగ్ బార్స్ చుట్టూ కూడా పేరుకుపోయి వుండే దుమ్మును ఏదైనా పిన్ వంటి పరికరంతో జాగ్రత్తగా శుభ్రం చేయాలి. తర్వాత లిక్విడ్‌తో తుడవాలి. అదే ఆప్టికల్ మౌస్‌లైతే దుమ్ము చేరదం, శుభ్రం చేయడం వంటి సమస్యలే వుండవు.

ఇక అతి ముఖ్యమైనది సిపియు. దీన్ని చాలా జాగ్రత్తగా శుభ్రం చేయాల్సి వుంటుంది. ముందుగా సిపియు కేబుల్స్ అన్నింటినీ తొలగించి, దాని కవర్‌ను ఓపెన్ చేయాలి. సిపియును ఖాళీ ప్రదేశంలో పెట్టి, వ్యాక్యూమ్ క్లీనర్‌కి బ్లోయర్ అటాచ్‌మెంట్ అమర్చి బ్లో చేయాలి. సిపియు లోపలి మూలలు, పవర్ కేబుల్స్‌తోపాటు ఫ్యాన్‌కు వున్న దుమ్ము కూడా పోయే విధంగా బ్లో చేయాలి. బ్లో చేసే సమయంలో వ్యాక్యూమ్ క్లీనర్ నాజిల్ సిపియు లోపలి భాగాలకు తగలకుండా జాగ్రత్తలు తీసు... ఆ తర్వాత సిపియు పైనుండే బాక్సును కూ... శుభ్రపరచాలి. వీటితోపాటే కంప్యూటర్‌కుండే డ్రైవ్‌లను కూడా శుభ్రం చేయాల్సి వుంటుంది. అయితే వీటిని మామూలు పద్ధతిలో శుభ్రపర్చడం వీలుకాదు. ఫ్లాపీ, సీడీ డ్రైవ్‌లను శుభ్రపర్చడానికి క్లీనింగ్ కిట్లు లభ్యమవుతాయి. వాటిని ఎలా శుభ్రపరచాలనేది ఆ కిట్లతో వచ్చే సూచనల్లో వుంటాయి. దీనికి హార్డ్‌వేర్ మెకానిక్‌లు రూ.200 నుండి రూ.300వరకు ఛార్జి చేస్తారు. కాస్త శ్రమ అయినా ఫర్వాలేదంటే ఆ పని మనమే చేసుకోవచ్చు.



\- కె.ఎక్స్.రాజు

అట్టమీది కథ



వాల్‌స్ట్రీట్ పోరు విశ్వమంతటా హోరు

- బి.అమరనారాయణ

నలుదిక్కులా ఆకాశానికి ఎగబాకిన భవంతులు. తళతళలాడే అద్దాల మేడలు. పలుచగా కదలాడే జనం. హొయలు ఒలకబోస్తూ రోడ్లపై జారిపోయే కార్లు. 'ఎప్పుడూ ఇచట నిలబడరాదు', 'ఒకవైపు మాత్రమే దారి' అన్న సంకేత బోర్డులూ దర్శనమిస్తాయి అక్కడ. కాసుల రాకాసులు తిష్టవేసిన వాల్‌స్ట్రీట్ అనే కాంక్రీటు కీకారణ్యమది. అందులోనే జుక్కోటిపార్కు పేరిట ఓ చిన్నపాటి వనం. ఆకుపచ్చని కొమ్మలు తొడుగుతూ ఆహ్లాదాన్నిచ్చే చిన్నచిన్న చెట్లతో 'ఆహా' అనిపిస్తుంది. ఆ చెట్ల చిగురుటాకుల చిరుగాలిలోంచి ఓ నిప్పురవ్వ రగిలింది. అది సామాన్యుడి ఆగ్రహ రవళి. కాంక్రీటు భవంతుల్లో తిష్టవేసిన పెట్టుబడి పైశాచికులపై సెగలు కక్కుతూ ఉద్భవించిన చిరుద్యోగ, నిరుద్యోగ నిప్పు కణిక. విశ్వవ్యాప్తంగా కేపిటలిస్టులకు వ్యతిరేకంగా బడబాగ్ని రాజేస్తున్న ఆ నిప్పు కణిక [illegible]క్ష్యపై వాల్‌స్ట్రీట్'. 1 శాతంపై 99 శాతం చేస్తున్న శాంతియుత పోరాటం.



ప్రపంచ పెట్టుబడిదార్ల ఆరాధ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న వాల్‌స్ట్రీట్ న్యూయార్క్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఎనిమిది బ్లాకులున్న ఓ వీధి అంటే నమ్మశక్యం కాదు. ఈ వీధిలో అమెరికా పతాకాన్ని తన నుదుటి నిండా పరుచుకొన్న న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజి, అమెరికా తొలి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ ప్రమాణ స్వీకారం చేసిన భవనం, పలు దేశాలు, బ్యాంకులు, బడాబడా బహుళ జాతి సంస్థల ప్రధానకేంద్రాలు స్థాపితమైవున్నాయి. తూర్పు దిక్కున మన్‌హట్టన్‌లో ఉండే సౌత్‌స్ట్రీట్ నుంచి పశ్చిమాన మన్‌హట్టన్‌లోని బ్రాడ్వే వరకు ఈ వాల్‌స్ట్రీట్ విస్తరించి వుంటుంది. అతి సమీపంలో మడ్సన్ నది... నది మధ్యనున్న ద్వీపంలో ప్రపంచ ప్రఖ్యాత లిబర్టీ విగ్రహం వుంటాయి. అమెరికా, న్యూయార్క్ మొత్తం ఫైనాన్షియల్ మార్కెట్లకు వాల్‌స్ట్రీట్ ప్రధాన కేంద్రం. అంతేకాదు యావత్ ప్రపంచంలోనే అతిపెద్దదైన లిస్టెడ్ కంపెనీల న్యూయార్క్ స్టాక్ ఏక్స్ఛేంజితో పాటు ఎన్ఎఎస్‌డిఎక్యూ, న్యూయార్క్ మర్చంటైల్ ఎక్స్ఛేంజి, అమెరికా పూర్వ స్టాక్ ఎక్స్ఛేంజి అయిన ది న్యూయార్క్ బోర్డ్ ఆఫ్ ట్రేడ్ కూడా ఇక్కడే ఉన్నాయి. ఇంతటి కీలక సంస్థలున్న వాల్‌స్ట్రీట్ మూలాన న్యూయార్క్ నగరం ప్రపంచంలోనే అత్యంత ప్రధానమైన వాణిజ్య స్థావరంగా ఖ్యాతి నొందింది.

వాల్‌స్ట్రీట్ అనేది డచ్ పేరు..

వాస్తవానికి వాల్‌స్ట్రీట్ అనేది 'ది వాల్ స్ట్రాట్ (de Waal Straat) అనే డచ్ పేరు నుంచి రూపాంతరం చెందింది. ఇది ఎలా మారిందన్నదానిపై భిన్న కథనాలు వ్యాప్తిలో ఉన్నాయి. 17వ శతాబ్దంలో డచ్ వలస రాజ్య రాజధానిగా ఉన్న న్యూఆమ్‌స్టర్‌డమ్ (ఇదే తర్వాతి కాలంలో న్యూయార్క్ నగరంగా మారింది) ఉత్తర సరిహద్దులో ఆంగ్లేయుల వలసరాజ్య ఆక్రమణల నుంచి, అమెరికా మూలజాతీయుల దాడుల నుంచి రక్షించుకునేందుకు డచ్‌వాళ్లు ఓ పెద్ద మట్టి గోడ (wall) నిర్మించి దాని పొడవునా ఒక వీధి (street) నిర్మాణం చేశారని అదే క్రమేపి వాల్‌స్ట్రీట్ (wall stree)గా మారిందన్న విషయాన్ని ఎక్కువ మంది ఏకీభవించే విషయం. 1624లో సముద్రయానం ద్వారా డచ్‌కు చెందిన ఓ 30 వాలూన్ కుటుంబాలవారు తొలుత ఈ ప్రాంతాన్ని ఆక్రమించి తిష్టవేశారని, వారి పేరు మీదే వాల్‌స్ట్రీట్ ఉదయించిందన్న వాదనలూ ఉన్నాయి. 1640లో గుడారాలు, కంచెలు ఏర్పాటు చేసుకొని నివాసాలు వెలిశాయి. ఆ తర్వాత డచ్ వెస్ట్ ఇండియా కంపెనీకి చెందిన పీటర్ స్టువేసంట్... ఆఫ్రికా బానిసలు, తెల్లవాళ్లతో కలిపి ఓ దుర్భేధ్యమైన 12 అడుగుల గోడను వీధి పొడవునా నిర్మించాడు. 1685లో స్థానిక సర్వే అధికారులు గోడ వెంబడి నిర్మాణాలు చేపట్టారు. ఈ రోజుల్లోనే స్థానిక వ్యాపారులు, దళారులు వివిధ ప్రదేశాల్లో తమకు తాము వేలందార్లుగాను, డీలర్లుగాను మారిపోయి వాటాలను, వివిధ రకాల బాండ్లను క్రయవిక్రయాలు జరిపేవారు. అయితే 1699లో ఈ గోడను బ్రిటీష్ ప్రభుత్వం కూల్చివేసింది.

తొలినాళ్లలోనే సట్టా వ్యాపారం..

18వ శతాబ్ది చరమాంకంలో వాల్‌స్ట్రీట్‌లో బటన్‌ఉడ్ అనే ఓ చెట్టు ఉండేది. ఆ చెట్టు కిందనే నాటి రోజుల్లోనే సట్టా వ్యాపారం జోరుగా సాగేది. వ్యాపారులు, సట్టా వ్యాపారులు అక్కడ గుమికూడి పరస్పర లాభాలు దక్కేలా కుమ్మక్కై వ్యాపారం సాగించేవారు. ఆ తర్వాత సట్టా వ్యాపారులంతా కలిసి 1792లో అదే బటన్‌ఉడ్ చెట్టు పేరు మీద 'బటన్ ఉడ్ అగ్రిమెంట్' పేరుతో ఒప్పందం చేసుకొని ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. కమిషన్ పేరిట మోసాలకు పాల్పడకుండా వ్యాపారం 'నిర్మాణాత్మకం'గా సాగాలని అప్పట్లో ఇలా ఒప్పందం చేసుకున్నారు. ఇందులో సంతకాలు చేసినవాళ్లు నిర్దిష్టమైన కమిషన్ చెల్లించి

వేలంలో పాల్గొనవచ్చు. ఒప్పందంలో సంతకాలు చేయనివారికి వేలంలో పాల్గొనే అవకాశం ఉన్నా అధికంగా కమిషన్ చెల్లించాల్సివుంటుంది. ఈ ఒప్పందమే నేటి వాల్‌స్ట్రీట్ పునాదిరాయిగా చెబుతారు.



తొలి అధ్యక్షుడు ప్రమాణం చేసిందిక్కడే..

గ్రేట్ బ్రిటన్ నుంచి 1776 జులై నాలుగున అమెరికాకు స్వాతంత్ర్యం లభించింది. అమెరికా రివల్యూషనరీ వార్‌కు నేతృత్వం వహించిన సైన్యాధిపతి, రాజకీయవేత్త జార్జి వాషింగ్టన్ 1789లో అమెరికా తొలి అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఆ ఏడాది ఏప్రిల్ 30న జార్జి వాషింగ్టన్ ప్రప్రథమ దేశాధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన 'ఫెడరల్ హాల్' వాల్‌స్ట్రీట్‌లోనే ఉంది. హక్కుల బిల్లు ఆమోదం పొందిన ఖ్యాతి కూడా ఈ ప్రాంతానికే దక్కుతుంది. అమెరికా ఖజానా ప్రథమ కార్యదర్శి, అమెరికా వాణిజ్య వ్యవస్థ నిర్మాణశిల్పిగా పేరొందిన అలెగ్జాండర్ హమ్లిటన్ సమాధి ఉన్న 'ట్రినిటీ చర్చ్' కూడా ఇక్కడే ఉంది. తొలి రెండు దశాబ్దాల్లోనూ వాల్‌స్ట్రీట్ ఇటు ప్రజల నివాసాలు, అటు వాణిజ్య స్థావరాలు రెండింటితోనూ నిండివుండేది. క్రమేపి వ్యాపార స్థావరాల ఆక్రమణ పెరిగింది. ఏరై కాలువ ప్రారంభించడంతో 19వ శతాబ్దిలో న్యూయార్క్‌లో వాణిజ్య బూమ్ మొదలైంది. అందునా ప్రధానమైన సముద్ర ఓడరేవు న్యూయార్క్ ఒక్కటే కావడంతో వాల్‌స్ట్రీట్ అమెరికా ఆర్థిక రాజధానిగా ఎదిగింది. వాణిజ్య ప్రయోజనాల విషయంలో వాషింగ్టన్ డిసి అధికారులకు, వాల్‌స్ట్రీట్‌కు పోటాపోటీ పోరు సాగినా తన ప్రత్యేకమైన భౌగోళిక విలక్షణాలతో వాల్‌స్ట్రీటే వాణిజ్య స్థావరంగా నిలదొక్కుకుందని చరిత్రకారుడు ఆర్ జెయిస్సట్ విశ్లేషిస్తారు. ద్వీపకల్పమైన ఈ వాల్‌స్ట్రీట్ దిగువ ప్రాంతంలో వ్యాపార స్థావారాలు బాగా విస్తరించడంతో చాలామంది నివాసితులు ఉత్తరం నుంచి మిడ్‌టౌన్‌కు మారారు. ఉత్తర ప్రాంతంలో వాణిజ్యవృద్ధికి పౌర యుద్ధం బాగా దోహదం చేసింది. న్యూయార్క్ వంటి నగరాలకు గొప్ప ఖ్యాతిని ఆర్జించిపెట్టింది. యావత్ దేశం యొక్క బ్యాంకుల కేంద్రంగా న్యూయార్క్ ఆవిర్భవించింది. 'రాజధాని పాత పదం..ఆకాంక్ష కొత్త పదం' అంటూ తనకు తాను నినదించుకుంది. జెపి మార్గాన్ మహామహా సంస్థలను ఏర్పాటు చేశారు. జాన్ డి రాక్‌ఫెల్లర్ వారి 'స్టాండర్డ్ ఆయిల్' న్యూయార్క్‌కు తరలివచ్చింది. 1860 - 1920 మధ్యకాలంలో ఆర్థికవ్యవస్థ 'వ్యవసాయం నుంచి పారిశ్రామికానికి అటునుంచి వాణిజ్యానికి' రూపాంతరం చెందింది. చరిత్రకారుడు థామస్ కిస్సనర్ ప్రకారం ఆర్థికంగా జరిగిన ఈ మార్పులకు న్యూయార్క్ నాయకత్వ పాత్ర పోషించింది. ప్రపంచ ఆర్థిక రాజధానుల్లో మొదటిది లండన్. ఆ తర్వాతి స్థానం న్యూయార్క్‌దే... అంటే వాల్‌స్ట్రీట్‌దే.

స్టాకులు షురూ..

1884లో చార్లెస్ హెచ్ డౌ (వాల్‌స్ట్రీట్ జర్నల్ వ్యవస్థాపకుడు) స్టాక్‌లను అధ్యయనం చేయడం మొదలెట్టారు. ఆయన ప్రధానంగా రైలుమార్గాల స్టాకులపై దృష్టి పెట్టాడు. మొదట 11 స్టాకులతో ప్రారంభించి, వాటికి సరాసరి ధరలు నిర్ణయించాడు. మొత్తం ధరలను కలిపి వాటిని స్టాకుల సంఖ్యతో భాగించి తన డౌ జోన్స్ సరాసరి ధర ఎంతో తెలుసుకునేవాడు. ఆ ధరలు ఎగబాకితే దానికి బుల్ మార్కెట్ అని, దిగజారితే బేర్ మార్కెట్ అని షరతులు విధించుకున్నాడు. డౌ అనుసరించిన పద్ధతే తర్వాత యావత్ స్టాక్ మార్కెట్ అంతటికీ ఆచరణీయమైన ప్రామాణిక కొలబద్దగా మారింది. అయితే 1889లో వాస్తవికమైన స్టాక్ రిపోర్టులు ఆచరణలోకి వచ్చాయి. కస్టమర్స్ ఆఫ్టర్‌నూన్ లెటర్, ది వాల్‌స్ట్రీట్ జర్నల్‌గా మారిపోయింది. వాల్‌స్ట్రీట్ పేరుతో మొదలైన ఈ పత్రిక ఇప్పుడు అంతర్జాతీయంగా అత్యంత ప్రభావశీల దిన వాణిజ్యపత్రికగా మారింది. 1896 అక్టోబర్ 7 నుంచి మరిన్ని విస్తృత స్టాకుల లిస్టులతో డౌ ప్రచురణ ప్రారంభమైంది. శతాబ్ది తర్వాత స్టాకుల సంఖ్య 30కి చేరింది. ప్రముఖ చరిత్రకారుడు జాన్ బ్రూక్స్ తన 'ఒన్స్ ఇన్ గోల్కొండ' (గోల్కొండలో ఒకప్పుడు) పుస్తకంలో '20వ శతాబ్ది మజిలీ అంతా వాల్‌స్ట్రీట్ వైభవమే' అని పేర్కొన్నారు. నాటి చరిత్రకారులు అంతగొప్పగా భావించిన వాల్‌స్ట్రీట్ నేడు ఆందోళనలకు కేంద్రమైంది. జెపి మార్గాన్ కంపెనీ ప్రధాన కార్యాలయాలుండే 'వాల్‌స్ట్రీట్ 23' అనే చిరునామానే 'ది కార్నర్'గా ప్రసిద్ధి చెందింది. ఇది భౌగోళికంగాను, వాతావరణపరంగాను, ఆర్థిక స్థావరంగాను కీలక ప్రదేశంగా ఉంది. అయితే వాల్‌స్ట్రీట్ క్రమేపి ప్రభుత్వాలపై పైచేయి సాధించేందుకు ఎత్తులు వేస్తూ వచ్చింది. సంబంధాలూ మార్చుకుంటూ వచ్చింది. ఉదాహరణకు 1913లో అధికారులు స్టాక్ బదలాయింపులపై నాలుగు డాలర్లు పన్ను వేస్తే స్టాకుల క్లర్కుల చేత ఆందోళన చేపట్టింది.

కార్పొరేట్ సంస్కృతికి బీజం

19 శతాబ్ది చరమాంకం, 20వ శతాబ్ది ఆరంభదశలో కార్పొరేటు సంస్కృతికి బీజాలు పడ్డాయి. న్యూయార్క్ అంతటా పెద్దపెద్ద వాణిజ్య సంస్థలు వెలిశాయి. బహుళ అంతస్థుల భవన నిర్మాణం వేగిరంగా ఊపందుకొంది. ఆకాశాన్నంటే మేడలు వెలిశాయి. న్యూయార్క్ నగరం అద్దాల మేడల సొబగులు అద్దుకుంది. అమెరికా ఖండంలో ఒక్క చికాగోలోనే న్యూయార్క్‌కు పోటాపోటీగా ఆకాశహర్మ్యాల నిర్మాణం సాగింది. ఇక్కడో చిన్న సంగతేంటంటే వాల్‌స్ట్రీట్ పరిసరాల్లోనే బౌలిగ్ గ్రీన్ వంటి నిరుపేద నివాస సముదాయాలూ ఉన్నాయి. బ్రాడ్వే-హడ్సన్ నది మధ్యలోనూ, వెస్సే వీధి - బెట్టారీ ప్రాంతంలోనూ ఇలాంటి నిరుపేదల ఆవాసాలున్నాయి. వాల్‌స్ట్రీట్ పెరటితోటగా ముద్దుగా పిలవబడే ఈ బౌలింగ్ గ్రీన్ ప్రాంతంలో అంతా పేద ప్రజలతో నిండివుంటుంది. నగరంలోనే అత్యంత దయనీయమైన నివాసాలుండే ప్రాంతంగానూ, శిశుమరణాలు అధికంగా ఉండే ప్రాంతంగానూ దీనికి పేరుంది. 1905లో 'వాల్‌స్ట్రీట్ 60' చిరునామాలో ఒక తపాలా కార్యాలయం వెలసింది. మొదటి ప్రపంచయుద్ధం రోజుల్లో సందర్భానుసారం జాతీయ పార్కు వంటి ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తూ వచ్చారు. 1920లో వాల్‌స్ట్రీట్, బ్రాడ్‌స్ట్రీట్ మూల మీద ఓ బాంబు పేలింది. 38 మంది చనిపోయారు. మరో 143 మంది గాయపడ్డారు. అలానే ఆ తర్వాత 1921 నుంచి వాల్‌స్ట్రీట్‌కు బాంబు బెదిరింపులు తరచూ వచ్చాయి.

సంక్షోభాల పర్వం

ప్రపంచమంతటా వివిధ కారణాలతో ఆర్థిక వ్యవస్థల్లో ఒడిదుడుకులు మొదలయ్యాయి. అది వాల్‌స్ట్రీట్‌ను వీడలేదు. యెలే విశ్వవిద్యాలయానికి చెందిన ఇర్వింగ్ ఫిసర్ అనే ఆర్థికవేత్త వాల్‌స్ట్రీట్ మదుపుదార్ల 'డబ్బంతా క్షేమం' అని ప్రకటించిన కొద్దిరోజులకే స్టాక్‌మార్కెట్ నిట్టనిలువునా కూలింది. కార్మికులు, ఉద్యోగుల్లో లక్షలాది మంది వీధులపాలయ్యారు. ధరలు నేలచూపులు చూడటంతో వ్యవసాయం కూడా సంక్షోభంలో కూరుకుపోయింది. వాల్‌స్ట్రీట్ భారీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మళ్లీ అంతా సంస్కరణలను భుజాన వేసుకొన్నారు. ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. మదుపుదారుడు ఎటువంటి రుణాలు లేకుండా పూర్తిగా తన సొంత డబ్బుతోనే స్టాకులు కొనాలని మార్జిన్ షరతు పెట్టింది. అయితే 1960 తర్వాత నాలుగు సార్లు మార్జిన్‌ను సవరించారు. ఈ బాటలో ఫెడరల్ రిజర్వు మార్జిన్‌ను 90 నుంచి 70 శాతానికి కుదించింది. ఈ వెసులుబాటుతో మదుపుదార్లు క్రెడిట్ కింద స్టాకులు కొనడం ఊపందుకుంది. 1967 వియత్నాం యుద్ధం తర్వాత స్టాకులు మరింత వేగవంతమయ్యాయి. రోజుకు 75 లక్షల షేర్లు చొప్పున ట్రేడింగ్ ఎగబాకింది. అయితే 1973లో మళ్లీ ఒడిదుడుకులొచ్చాయి. 245 మిలియన్ల డాలర్లు నష్టం వాటిల్లిందని, సాయం చేయండంటూ ఫైనాన్షియల్ వర్గం గగ్గోలు పెట్టింది. తలాడించిన ప్రభుత్వం వారికి తగిన సహాయాన్ని అందించింది. దీంతో సంస్కరణలు మ[illegible]యి. ప్రధాన స్టాక్ సంస్థలయిన ఎస్ఇసి, సెక్యూరిటీస్ అండ్ ఎక్సేంజి కమిషన్, న్యూయార్క్ స్టాక్ ఎక్సేంజి పెట్టుబడిదార్లకు అనుగుణంగా చాలా సవరణలు చేశాయి. ఇదివరకు ఉన్న షరతులు తొలగించాయి. 1976లో బ్యాంకులు కూడా స్టాకులు కొనేందుకు,

అమ్మేందుకు అనుమతించారు. ప్రజలకు స్టాకులు అంటగట్టేందుకు రంగం సిద్ధం చేశారు. బ్రోకరేజి వ్యవస్థ మరింత విస్తృతమైంది. టెలికమ్యూనికేషన్ల విప్లవంతో బ్యాంకులు, బ్రోకరేజి సంస్థలు వీలున్న ప్రదేశాలకు తరలిపోయాయి. దీంతో 1987లో మళ్లీ మరో కుదుపు. ఒక్క దిగువ మాన్‌హట్టన్‌లోనే లక్ష ఉద్యోగాలు ఊడాయి. ఈ కుదుపుల పరంపర ఇలానే కొనసాగుతూ వస్తోంది. 1990-1991లో మరోమారు స్టాకులు నేలకొరిగాయి.

వాల్‌స్ట్రీట్ నిర్మాణ శైలి

పురాతన కళాత్మక శైలి ఉట్టిపడే ఈ భవనాలు అత్యంత ఆధునిక విలాస సౌకర్యాలతో జీవం పోసుకున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా వాల్‌స్ట్రీట్ నిర్మాణశైలిలో ఆర్థిక దర్పం ప్రతిబింబిస్తుంది. అమెరికా ప్రజలకు వాల్‌స్ట్రీట్ ఒక సంపన్నుల శిఖరంగాను, రాజకీయాలను శాసించే శక్తివంతమైన కేంద్రంగాను కనిపిస్తుంది. దీన్ని చాలా మంది అమెరికన్లు వ్యాపారం ద్వారా, పెట్టుబడి విధానం ద్వారా, నూతన విషయాలు కనుగొనడం ద్వారా అభివృద్ధి చెందినట్టు చూస్తారు. ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్) 1966లో నిర్మించారు. అనేక బహుళజాతి సంస్థలు ఇక్కడ ఆఫీసులు ఏర్పాటు చేసుకున్నాయి. వాస్తవానికి ఈ ప్రాజెక్టు ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసే ఉద్దేశంతో ప్రభుత్వ నిధులతో (న్యూయార్క్ మరియు న్యూజెర్సీ పోర్ట్ అథారిటీ సహాయంతో) దీన్ని నిర్మించారు. అంతర్జాతీయ వర్తకానికి అవసరమైన ఉపకరణాలన్నిటినీ ఈ భవంతిలో భద్రపరుస్తారు. అయినా కూడా మొదట్లో చాలా వరకు ప్రదేశమంతా ఖాళీగానే ఉండిపోయేది. కొన్ని ముఖ్యమైన సంస్థలు వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో స్థానం కొనుగోలు చేశాయి. తరువాత, చుట్టుపక్కల ఉన్న మరికొన్ని ఆధిక్యమున్న వ్యాపార సంస్థలు వరల్డ్ ట్రేడ్ సెంటర్ పట్ల ఆకర్షితమయ్యాయి. ఒక విధంగా చెప్పాలంటే వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వాల్‌స్ట్రీట్ నుంచి ట్రేడ్ సెంటర్ కాంప్లెక్స్ వరకు సంబంధాలు బలోపేతం చేసిందని చెప్పవచ్చు. నీలినింగిని అందుకునేలా నిర్మితమైన ఈ వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవన సముదాయాన్ని పాదచారులు పైకెత్తి చూడాలంటే తలకట్టు (ఇప్పుడు క్యాపులు లేదా టోపీలు లెండి) కింద పడాల్సిందే. 1990లో రియల్ ఎస్టేట్ మరింతగా ఊపందుకుంది. మాన్‌హట్టన్ అంతటా నిర్మాణాలు మరింత ఊపుగా సాగాయి. ఎంతగా అంటే అప్పట్లోనే ఒక్కొక్క సంస్థ ఒక్కో ప్రాజెక్టుపై ఏకంగా 24 బిలియన్ డాలర్లు వెచ్చించాయి. 1998 న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజి 900 బిలియన్ డాలర్లు వెచ్చించి జెర్సీ సిటీలో తన ప్రధానకేంద్రాన్ని నిర్మించుకుంది. ఎన్‌వైఎస్ఇ పోటీదారు ఎన్ఎఎస్‌డిఎక్యూ కూడా వాషింగ్టన్ నుంచి న్యూయార్క్‌కు తరలివచ్చింది. ఇక ఈ **శతాబ్ది తొలి అంకంలోనే వాల్‌స్ట్రీట్‌తో పాటు అమెరికాకు, పరోక్షంగా ప్రపంచానికి** పెను షాక్ తగిలింది. ఉగ్రవాదులు 2001 సెప్టెంబర్ 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను నేలకూల్చారు. ఒక అంచనా ప్రకారం వాల్‌స్ట్రీట్‌లోని 45 శాతం కార్యాలయ ప్రదేశం దెబ్బతిన్నది. భారీగానే ప్రాణనష్టం జరిగింది. పూర్తిగా ధ్వంసమవ్వడంతో చాలా సంస్థలు శాశ్వతంగా న్యూజెర్సీకి మారాయి. అలాగే చికాగో, డెన్వర్, బోస్టన్‌ను వికేంద్రీకరించడంతో వాల్‌స్ట్రీట్ వ్యాపారాలకు పెద్ద నష్టం వాటిల్లింది. వరల్డ్ ట్రేడ్ నష్టం తరువాత గత శతాబ్దంలో ఎన్నడూ లేనంతగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అభివృద్ధి వేగవంతమైంది. మళ్లీ ప్రజలపైనా, స్థానిక సంస్థలపైనా పన్నులు బాది ప్రభుత్వం సమకూర్చిన ధనంతో అదే వరల్డ్ ట్రేడ్ సెంటర్ ప్రాంత పరిసరాల్లోనే 'ఫ్రీడం టవర్'గా నూతన భవన సముదాయం చేపట్టారు. అయితే సంక్షోభాల సుడిగుండం వాల్‌స్ట్రీట్‌తో పాటు పెట్టుబడిదారులను వదలడం లేదు. గమ్మత్తేంటంటే ఈ పెట్టుబడిదారుల మూలాన సంభవించే సంక్షోభాల వల్ల వారికే నష్టం వాటిల్లదు. పైగా బెయిల్ అవుట్ల (ఉద్దీపన పథకాలు) వల్ల బోలెడు నజరానాలు లభిస్తాయి. ఎటొచ్చీ బాధపడేదల్లా, భారాలు భరించాల్సిందిల్లా సామాన్య ప్రజానీకమే. 2004లో సంభవించిన సబ్ ప్రైమ్ రుణాల సంక్షోభ ఊబి నుంచి బయటపడక ముందే ఐరోపా సంక్షోభం ఆర్థిక వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేస్తోంది. ప్రయివేటుకు పట్టం కట్టి సాగుతున్న పెట్టుబడి మాయాప్రపంచానికి ముచ్చెమటలు పట్టేలా



ప్రజల్లో ఇప్పుడు చైతన్యం వెల్లివిరుస్తోంది. నియంత పాలకులకు, పెట్టుబడి దాసోహులకు, క్రోనీ కేపిటలిజానికి వ్యతిరేకంగా ఉద్యమాలు ఉగ్రరూపమెత్తి గర్జిస్తున్నాయి. గ్రీసు, టర్కీ, ఈజిప్టు, ట్యునీషియా ఇలా అరబ్ స్ప్రింగ్‌ను దాటి ఇప్పుడు అసలు పెట్టుబడి మూలస్థావరమైన అమెరికాను ఉద్యమజ్వాల సెగ రేపుతోంది. సట్టా వ్యాపారానికి సగౌరవ సంకేతంగా విరాజిల్లిన వాల్‌స్ట్రీట్ కేంద్రంగానే అమెరికాలో ఇప్పుడు నిరసన జ్వాల ఎగసిపడుతోంది. అణ్వాయుధ, మారణాయుధాలను అమ్ముకొంటూ దేశాలపై పెత్తనం చెలాయించే అమెరికా పాలకులకు పూర్తిభిన్నమైన రీతిలో ఆ దేశ ప్రజలు అత్యంత శాంతియుతంగా మహాత్మాగాంధీ ప్రబోధించిన అహింసా మార్గంలో ఉద్యమం చేపట్టారు.

శాంతియుత పోరాటం

వాల్‌స్ట్రీట్ ముట్టడి నిరసనకారుల రణనినాదమిదే. ప్రపంచ జనాభా మొత్తంలో ఒకే ఒక్క శాతంగా ఉన్న బడా పెట్టుబడిదారులు..మిగిలిన తొంభైతొమ్మిది శాతం ప్రజలు చెమటోడ్చి కష్టించిన ఫలితాలను పిశాచాల్లా జుర్రుకుంటున్నారన్న అస్త్రాన్ని ఎక్కుపెట్టారు. అసలు ఈ ఉద్యమం చాలా సహజసిద్ధంగా రూపుదిద్దుకుంది. దీనికి ప్రత్యేకించి ఒక నిర్మాణయుతమైన కార్యాచరణ ఏదీ ప్రారంభంలో రూపొందించలేదు. అరబ్, ఐరోపా దేశ ప్రజల ఉద్యమాల నుంచి స్ఫూర్తి పొందిన కొందరు ఈ ఏడాది సెప్టెంబర్ 17న దిగువ మాన్‌హట్టన్‌లోని సంపన్నులుండే వివిధ వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. ఆ తర్వాత వారిలోనే కొందరు జుకొట్టి పార్కులో గుమిగూడి ఆ రాత్రంతా అక్కడే గడిపారు. పార్కులోనే పడుకున్నారు. అంతకుముందు రెండుమూడ్రోజులు కూడా ఇలాంటి ప్రదర్శనలు జరిగినా రాత్రయ్యేసరికి ఎవరిదారిన వారెళ్లిపోయారు. పనిపాటాలేని పిచ్చోళ్ల వ్యవహారంగా ఉదారవాద మేధావులు కొట్టిపారేశారు. అయితే జుకొట్టి పార్కులో ఆదివారం అందునా వారంతమైనా పబ్బులు, గిబ్బులకెళ్లకుండా యువత అక్కడే బస చేయడం మేధావులను నివ్వెరపర్చింది. ఆ రోజు నుంచి నిరసన కార్యక్రమం ఊపందుకుంది. 'ఆక్యుపై వాల్‌స్ట్రీట్' నినాదం జుకొట్టిలో మార్మోగింది. ఇంతకీ ఈ ఆందోళన ఎందుకంటే వారి కోణంలోనే చెప్పాలంటే ప్రస్తుత ఆర్థిక సంక్షోభాలకు ప్రధాన కారణం కార్పొరేట్ గుత్త సంస్థలే...ప్రపంచంలో సంక్షోభం కావాలని కోరుకునేవారెవ్వరైనా ఉన్నారంటే అది ప్రపంచ జనాభాలో ఒక్క శాతంగా ఉన్న ఆ గుత్త పెట్టుబడిదారులే. ఏదైతే మిగిలిన 99 శాతం ప్రజలను ఛిన్నాభిన్నం చేసి ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలోకి విసిరేస్తుందో..అదే మాంద్యాన్ని వారు అభిలషిస్తారు. మరి అప్పుడే కదా కార్పొరేటు దిగ్గజాలకు అనుకూలమైన సంస్కరణలను పాలకుల చేత సులభంగా బెయిల్ అవుట్ నెపంతో అమలు చేయించుకోగలరు. దీనివల్ల అమెరికా సహా అనేక దేశాల్లో విద్య, సామాజిక భద్రతను పూర్తిగా ప్రయివేటీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే చేశారు కూడా. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి పెట్టుబడుల ఉపసంహరణ పేరిట వాటిని కార్పొరేట్ శక్తులకు పాలకులు అప్పనంగా కట్టబెడుతున్నారు. కార్పొరేటు దిగ్గజాలు ప్రభుత్వాలకంటే బలోపేతమై పాలకులను శాసిస్తున్నారు. అంతేకాదు ప్రజాస్వామ్యం మాటున ధనబలంతో చట్టసభల్లో ప్రవేశించేస్తున్నారు. సామాజిక అసమానతలు తీవ్ర రూపం దాల్చాయి. సంపదంతా పెట్టుబడిదారీ వర్గాల చేతిలో పోగై పేదలకు మెతుకు లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వనరులన్నింటిని సర్వనాశనం చేస్తూ ప్రజలకందరికీ దక్కాల్సిన సంపాదనను పెట్టుబడిదార్లు దోపిడీ చేస్తున్నారు. ఉదారవాద ఆర్థికవేత్తలు ఉటంకించినట్లు పెట్టుబడిదారీ విధానంలో కనీసం సంపన్నదేశాలైనా సుసంపన్నంగా ఉండాలి కానీ అమెరికా సహా అన్ని దేశాల్లోనూ ఆకలికేకలు వినిపిస్తూనే ఉన్నాయి. శిశుమరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. మరి సంపదంతా ఎక్కడికిపోతోంది. వాల్‌స్ట్రీట్ ముట్టడి నిరసనకార్ల మాటల్లో చెప్పాలంటే అదంతా పెట్టుబడిదారీ రక్తపిపాసులు జుర్రుకుంటున్నారు. ఇదే కార్పొరేట్ల మితిమీరిన లాభార్జనల వల్ల నింగి, నేల, నీరు అంతా కలుషితమై పర్యావరణానికి పెను

ప్రమాదం ఏర్పడుతోంది. ఓజోన్ పొరకు రంధ్రాలు పడి సూర్య కిరణాలు నేరుగా పుడమిని తాకుతున్నాయి. మంచుఫలకాలు కరిగిపోతున్నాయి. అనేక జీవరాశుల మనుగడే ప్రమాదంలో పడింది. భూగర్భ జలం ఇంకిపోతోంది. కార్బన్ వ్యర్థాలు పేరుకుపోయి పశు పక్ష్యాదులను పెను ప్రమాదంలో పడేస్తున్నాయి. మొత్తం పర్యావరణ వ్యవస్థనే 'పెట్టుబడి' ఛిన్నాభిన్నం చేస్తోంది. ఇంత జరుగుతున్నా..ప్రజల అదృష్టమేమంటే ఆ ఒక్క శాతంపై పోరాటం చేసేందుకు తాము 99 శాతంగా ఉండటమే. అందుకే ఇప్పుడు ఆ 99 శాతం ప్రజల గొంతుకలు ఒకే గళమై నినదిస్తున్నాయి. 'మీ సంక్షోభాలకు మేము మూల్యం చెల్లించం' అంటూ గొంతెత్తి అరుస్తున్నాయి. 2008 ఆర్థికమాంద్య పరిస్థితుల్లో ఇటలీలో స్వరరూపం దాల్చిన ఈ నినాదం అటు నుంచి గ్రీసుకు వ్యాపించింది. అదే స్వరం ఫ్రాన్సులోనూ, ఇంగ్లండ్‌లోనూ ప్రతిధ్వనించింది. ఇప్పుడు ఆ స్వరం ఆర్థికసంక్షోభాలకు మూలకేంద్రమైన అమెరికాలో 'వాల్‌స్ట్రీట్ ముట్టడి' చరణాన్ని జత చేసుకొని మార్మోగుతోంది. చాలా మంది ఈ ఉద్యమాన్ని 1999 నాటి సంక్షోభ సమయంలో కార్పొరేటు శక్తులకు వ్యతిరేకంగా నేరుగా అసంఘటితంగా యువత నాయకత్వంతో సాగిన ఉదారవాద ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమంతో పోలిక పెడుతున్నారు. 'ఉద్యమాలకు మించిన ఉద్యమం'గా భావించే ఈ '99 నాటి పోరాటంతో తమ ఆందోళనలను కీర్తించినందుకు గర్వపడుతున్నామని 'వాల్‌స్ట్రీట్ ముట్టడి' ఉద్యమకారులు తలెత్తి చెబుతున్నారు. అయితే నాటి ఉద్యమానికి నేటి తమ పోరాటానికి చాలా ముఖ్యమైన తేడాలున్నాయని కూడా వారే చెబుతున్నారు. నాడు తాత్కాలికంగా ప్రపంచ ఆర్థిక సంస్థలైన వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్, ద ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి), జి8 వంటి శిఖరాగ్ర సదస్సులను లక్ష్యంగా చేసుకొని తొలుత నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అయితే దానికన్నా 'వాల్‌స్ట్రీట్ ముట్టడి' బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఫలానా తేదీలో ఉద్యమంలో పాల్గొనాలంటూ వీరు నిర్దిష్టమైన గడువులేవీ పెట్టుకోలేదు. ఇది రోజువారీ కొనసాగుతున్న పోరాటం. ఎవరికివారే వారికి కావాల్సిన ఆహార పదార్థాలు, టెంట్లు, పడుకోవడానికి చాపలు, కార్పెట్లు తెచ్చుకొని ఆందోళనలో పాల్గొంటున్నారు. మన అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిరాపార్కు వద్ద వంటావార్పు చేసుకున్నట్లు జుకొట్టి పార్కులోనే వారు వంటలు చేసుకొని కలిసి పోరాటం సాగిస్తున్నారు. ప్లకార్డులు తయారు చేసేవారు, గ్రాఫిటీ వచ్చిన వాళ్లు నినాదాలు రాసే పనిలో వుండగా, సంగీతంలో ప్రవేశమున్నవారు ఉద్యమ పాటలతో హుషారు నింపుతున్నారు. తమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు ఆక్యుపైడ్ వాల్‌స్ట్రీట్ పేరిట ఓ పత్రికనే ప్రచురిస్తున్నారు. ఎలాంటి విధ్వంసాలకు పాల్పడడంలేదు. ఆ దీక్షాదక్షతతో కూడిన అహింసాయుత క్రమశిక్షణ వారికి ఎలా అలవడిందన్నది విశేషం. బహుశా కార్పొరేటు కాసుల పైశాచికత్వంతో ఏదో రూపంలో వారంతా బాధలు ఎదుర్కొన్నందునే కాబోలు. క్రమేపీ ఈ ఉద్యమం విశ్వవ్యాప్తమవుతోంది. వెయ్యి మందితో ప్రారంభమైన ఈ పోరాటం అక్టోబర్ 15నాటికి 82 దేశాలకు విస్తరించి 1500 నగరాల్లో రణ నినాదం చేస్తోంది.

అందరికీ ఉపాధి కల్పించాలని, కార్మికులకు మెరుగైన జీవనాన్ని అందించాలని, బడా పెట్టుబడిదారుల నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, ప్రకృతి సంపద ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలందరికీ ఇళ్లు, ఆరోగ్యం, వైద్యసౌకర్యాలు, శ్రమకు తగిన వేతనాలు, ఉచితంగా విద్య అందించాలని కోరుతున్నారు. అన్నీ సామాన్యమైన న్యాయమైన డిమాండ్లే.

పోరాటాన్ని అణిచేసే కుట్ర

శాంతియుతంగా సాగుతున్న ఈ పోరాటాన్ని అణిచేసేందుకు అక్కడి ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది. అమెరికాలో చాలా పాతకాలంనాటి కేసుల కింద వందలాది మంది నిరసనకారులను అరెస్టు చేసింది. పోలీసుల చేత చితకబాదించింది. అయినా నిరసనకారులు మడమతిప్పలేదు. హింసకు పాల్పడలేదు. శాంతియుత ప్రదర్శనలు యథాలాపంగా కొనసాగించారు. ఇలా ప్రత్యక్షంగా అణిచేయడం సాధ్యపడకపోవడంతో ఈ ఉద్యమంలో యూదులున్నారని, పెట్టుబడిదారీ మీడియా ప్రతినిధులను దింపి హింస వైపు మళ్లించే కుట్ర పన్నారు. చివరకు ఈ ఉద్యమాన్ని కమ్యూనిస్టులు క్రమేపీ తమ నాయకత్వంలోకి తీసుకుంటున్నారని ఆరోపణలు గుప్పించి కట్టుకథలల్లారు. పెట్టుబడిదారీ వర్గాల లాభాపేక్షతో వేతనాల కోతకు గురై, ఉద్యోగాలు కోల్పోయి తీవ్ర మానసిక వ్యథతో బాధపడుతున్న ప్రజానీకం ఆగ్రహంలోంచి సహజసిద్ధంగా జీవం పోసుకున్న ఈ ఉద్యమాన్ని ఎన్నివిధాలా అణచాలని చూసినా అన్ని విధాల పురివిప్పుతూ దూసుకెళ్తోంది. ✶

ఉద్యమ డైరీ

సెప్టెంబర్ 17: వెయ్యి మందితో నిరసన ప్రదర్శన. జుకొట్టి పార్కులో బస. హాస్యనటి రోసియాన్నే బార్ర్ మద్దతు.

19 : మూడో రోజుకు ఉద్యమం. వాల్‌స్ట్రీట్‌లో స్టాకుమార్కెట్ రోజువారీ కార్యకలాపాలు ప్రారంభం. ఉద్యమంపై కరెంట్ టీవీ తదితర మీడియా సంస్థల దృష్టి. విస్తృతంగా కవరేజి.

సెప్టెంబర్ 20 : మాస్కులు ధరించి ప్రదర్శన జరపడంపై 1845 నాటి చట్టాల కింద అరెస్టులు.

సెప్టెంబర్ 22 : యూనియన్ స్క్వేర్ నుంచి వాల్‌స్ట్రీట్ వైపుగా రెండు వేల మంది ప్రదర్శన. నలుగురు అరెస్టు.

23 : జుకొట్టి పార్కు ప్రధానవేదికగా కార్యక్రమాల విస్తృతి. ద గార్డియన్, న్యూయార్క్ టైమ్స్ వంటి మీడియా దిగ్గజాలు కవరేజి.

24 : వివిధ వీధుల్లో నిరసనకారుల ప్రదర్శన. 80 మంది అరెస్టు. పోలీసులు ఓ మహిళపై దాడి చేస్తున్న వీడియో తొలిసారిగా ప్రసారం.

25 : ఎన్‌వైపిడికి వ్యతిరేకంగా యుట్యూబ్‌లో వీడియో ప్రత్యక్షం

26 : 24న మహిళపై దాడి చేసిన పోలీసు గుర్తింపు. జైలుకు పంపాలని నిరసనకారుల డిమాండ్. ఉద్యమానికి సినీ దిగ్గజం మైఖేల్ మూర్ మద్దతు.

27 : వాల్‌స్ట్రీట్ ముట్టడి స్ఫూర్తితో తపాలా కార్మికుల ప్రదర్శన

28 : అమెరికా రవాణా కార్మికుల యూనియన్ (టిడబ్ల్యుయు) మద్దతు

29 : వాల్‌స్ట్రీట్ ముట్టడికి మద్దతుగా చెర్రీర్ హెడ్జ్ తదితర పత్రికల గట్టి మద్దతు. ఉద్యమానికి బాసటగా ట్విట్టర్‌లో రవాణా కార్మికుల ప్రచారం. శాన్‌ఫ్రాన్సిస్కోలో సిటీబ్యాంకు, ఛేస్ తదితర వాణిజ్య సంస్థల ముట్టడి

30 : గత వారమంతా సాగిన పోలీసు దమనకాండకు నిరసనగా పోలీసు హెడ్‌క్వార్టర్స్ వరకు కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు వెయ్యి మందితో కూడిన భారీ ప్రదర్శన

అక్టోబర్ 1 : ఐదు వేల మందితో న్యూయార్క్ న్యూజెర్సీ మధ్య వుండే బ్రూక్లైన్ బ్రిడ్జి వరకు ప్రదర్శన . 700 మంది అరెస్టు.

2 : జుకొట్టి పార్కులో నిరసనల కొనసాగింపు

3 : పెట్టుబడిదారీ పిశాచాల వేషాధారణలో నిరసన ప్రర్శనలు.

4 : తరలివచ్చిన విద్యార్థులు, నిరుద్యోగులు, యూనియన్ సంఘాల నాయకులు. పోలే స్క్వేర్ నుంచి జుకొట్టి పార్కు వరకు 15 వేల మంది ర్యాలీ

6 : ముట్టడికి మద్దతుగా పోర్ట్‌ల్యాండ్ , ఒరేగాన్ ప్రాంతాల్లో ఐదువేల మంది ప్రదర్శన, లాస్ ఏంజిల్స్, శాన్‌ఫ్రాన్సిస్‌కోలో, తంపా, ఫ్లోరిడా, హూస్టన్, అస్టిన్, టెక్సాస్‌లో ఆందోళనలు. అమెరికా ప్రజల మనస్సుల్లోని ఉద్వేగాన్ని ఈ ఉద్యమం ప్రతిబింబిస్తోందని అధ్యక్షుడు ఒబామా స్పందన.

వాషింగ్టన్ డిసికి విస్తరించిన ఆందోళనలు. జుకొట్టి పార్కు నుంచి వాసింగ్టన్ స్క్వేర్ వరకు ప్రదర్శన

9 : వైట్‌హౌస్ ఎదురుగా వంద మంది నిరసన ప్రదర్శన

10 - 14 : ఆందోళన కొనసాగింపు

అక్టోబర్ 15 : మాన్‌హట్టన్ నుంచి టైమ్స్ స్క్వేర్ వరకు వేలాది మంది ప్రదర్శన. అనేక దేశాల్లో వాల్‌స్ట్రీట్ ముట్టడి స్ఫూర్తితో ప్రదర్శనలు.

ఎవరి గోల వారిదే

చైనాతో అమెరికన్న 'కోడిపందెం'

అంకుల్ శామ్ ఇప్పుడు చైనాతో 'కోడి పందానికి' దిగాడు. అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న 'కోడి మాంసం'పై చైనా భరించలేని దిగుమతి పన్ను విధించిందంటూ అమెరికా సర్కార్ 'ప్రపంచ వాణిజ్య సంస్థ'కు ఫిర్యాదు చేసింది. ఈ చర్యతో తమ దేశంలో 'మూడులక్షల వ్యవసాయ' ఉద్యోగాలకు ముప్పు, ఈ ఏడాది ఆఖరుకు వందకోట్ల డాలర్ల మేరకు నష్టం వస్తుందని పేర్కొన్నది. ఇటీవలి కాలంలో అమెరికా అనేక దేశాలతో ఇలాంటి పేచీలకు దిగుతోంది. చైనాకు 2009లో అమెరికా ఆరులక్షల టన్నుల కోడిమాంసాన్ని ఎగుమతి చేసింది. అమెరికా సర్కారు కోళ్లదాణాకు అవసరమైన సోయా, మొక్క జొన్నలకు పెద్ద మొత్తంలో సబ్సిడీలు ఇస్తున్నందున కోడిమాంసాన్ని తక్కువ ధరలకు ఎగుమతి చేస్తున్నారని, దీంతో తమ దేశంలో రైతులు నష్టపోతున్నారని చైనా ఫిర్యాదు చేస్తోంది. సబ్సిడీలను లెక్కించే చైనా విధానం తప్పని అమెరికా అంటోంది. కంపెనీలేవీ లెక్కలు సరిగా చెప్పవని సగటు ఉత్పాదక ఖర్చు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదని అమెరికా వాదిస్తోంది.

'కిక్' కీలకం

మందు ఎలా తయారు చేస్తున్నారన్నది ముఖ్యం కాదు అదిచ్చే 'కిక్' ఎలాంటిదో చూడాలి. ముడి వస్తువులుగా వేటిని ఉపయోగించినా పేరు ఒకటే, కిక్ అదే అయినప్పుడు 'మందంటే మందే' కనుక పన్నుల విధింపులో వివక్షను ఆమోదించబోమని ప్రపంచ వాణిజ్య సంస్థ తీర్పు చెప్పింది. ఫిలిప్పైన్స్ ప్రభుత్వం విస్కీ, బ్రాందీ, ఓడ్కా వంటి వాటిని తయారు చేసే స్థానిక కంపెనీలకు ఒక రేటు, విదేశీ తయారీదార్లకు ఒక రేటు పన్ను విధిస్తున్నది. ఇది అన్యాయమంటూ అమెరికా, ఐరోపా యూనియన్ ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేశాయి. ఫిలిఫ్ఫిన్ తయారీదార్లు కొబ్బరి, పంచదార నుంచి మందును 'పిండు'తుంటే విదేశీ కంపెనీలు బంగాళాదుంపలు, గోధుమ వంటి సరకులనుంచి తయారు చేస్తున్నాయి.

చిత్తశుద్ధి ముఖ్యం

అధికారంలోకి రాకముందు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఒకమాట... అధికారంలోకి వచ్చిన తరువాత 'చట్టం తనపని తాను చేసుకుపోతుందని' మాట్లాడే నేతలెందరినో చూశాము. కానీ లాటిన్ అమెరికాలో అధికారంలోకి వచ్చిన వామపక్ష పార్టీల నాయకులు నిజంగానే ఆ పని చేస్తున్నారు. అందుకే అమెరికన్నకు అదురుపుడుతోంది. ఆ ప్రభుత్వాలను కూల్చివేసేందుకు దారులు వెతుకుతున్నారు. పెరూలో ఈ ఏడాది జులైలో అధికారానికి వచ్చిన వామపక్ష నేత, అధ్యక్షుడు 'ఒల్లాంటా హుమాలా' అవినీతి వ్యతిరేక చర్యల్లో భాగంగా దేశంలోని పోలీసు ఉన్నతాధికారులు 45 మందిలో ఏకంగా 30 మందిని బర్తరఫ్ చేశాడు. వారిలో డైరెక్టర్ జనరల్ కూడా ఉన్నాడు. గతంలో అధికారంలో ఉన్న పెద్దలు, పోలీసుల కుమ్మక్కుతో నేరగాళ్లు, మాదక ద్రవ్యాల మాఫియా ముఠా సభ్యుల సంఖ్య 1,04,000కు చేరిందట. గతేడాదే 5,600 మంది కొత్తగా చేరారట.

డర్టీ పనులంటే......

డర్టీ పనులంటే చెత్త పనులందామా? ఎందుకంటే మన ఇళ్లలో ఊడ్చిన చెత్తను దూరంగా వీధిలో ఉన్న చెత్తకుండీలోనో(అసలు ఉన్నాయా అంటారా) లేదా ఎవరికీ ఇబ్బంది కలగని చోటో పోసే వారు ఎంత మంది? సింపుల్‌గా ఏం చేస్తాం, అటూ ఇటూ చూసి ఎవరూ చూడలేదనుకొని పక్కింటి వారివైపు ఊడ్చివేయటమో, పారవేయటమో చేస్తాము.(మీరు మినహాయింపు కావచ్చు) అదే ఎవరైనా చేస్తే ఇలాంటి పనులను మనం సహించం కదా ? అలాంటపుడు ఐరోపా యూనియన్ దేశాలలోని చెత్తను ఓడల్లో తెచ్చి ఇతర ఖండాలలోని దేశాలలో పోస్తే ఊరుకుంటామా? పాతవై పోయిన యుద్ధ ఓడలను పగలగొట్టినపుడు వాటి బ్యాటరీలనుంచి క్యాన్సర్‌ను కలిగించే యాసెబెస్టాస్ పదార్థాలు, వాయువులు, వస్తువులు బయట పడతాయి. అందుకని అలాంటి వాటిని దిగుమతి చేసుకొని షిప్‌బ్రేకింగ్ పరిశ్రమల పేరుతో చుట్టుపక్కల జన ఆరోగ్యాలను పణంగా పెట్టి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. మన ప్రకాశం జిల్లాలోని వాడరేవు వద్ద, గుజరాత్‌లో అలాంటి పరిశ్రమలను పెట్టటానికి వైఎస్ రాజశేఖరరెడ్డి, నరేంద్రమోడీ అనుమతించిన విషయం తెలిసిందే. అయితే చెత్త ఎగుమతి చేసి మనం చిత్తై పోతున్నామని గుర్తించలేదంటూ యూరోపియన్లు ఇప్పుడు గుండెలు బాదుకుంటున్నారు. ఐరోపా ఎగుమతి చేసే చెత్తలో అల్యూమినియం ఒకటి. దానిని చైనా కొనుగోలు చేస్తున్నది. కంపెనీలు చైనాకైతే తమ ఓడలు సిద్ధం అని ముందుకు వస్తున్నాయట. ఎందుకంటే అక్కడి నుంచి సరకులు తీసుకువచ్చి ఐరోపా నుంచి వేస్ట్ మెటీరియల్‌ను తీసుకుపోవటం వాటికి లాభంగా ఉంది. మనం ఎంతో విద్యుత్‌ను ఖర్చు చేసి అల్యూమినియంను తయారు చేస్తున్నాం. దాని వేస్ట్‌ను చైనా అతి తక్కువ ధరకు తీసుకువెళ్లి విద్యుత్‌ను అతి తక్కువగా వాడి వాటి నుంచి తిరిగి వస్తువులను తయారు చేసి మనకే విక్రయిస్తోంది. గ్రీన్ హౌస్ గ్యాస్‌ను తక్కువగా విడుదల చేస్తోందని యూరోపియన్లు గుండెలు బాదుకుంటున్నారు. అక్కడ పరిస్థితులు దిగజారుతుండటంతో అసలు మన చెత్తను మనమే ఉపయోగించుకుంటే కొందరికి ఉద్యోగం ఇచ్చినట్లు ఉంటుంది, ముడిసరకుల దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది కదా మనకెందుకు తట్టలేదీవిషయం ఇంతకాలం అని నెత్తి బాదుకుంటున్నారు.

కాఫీతో వత్తిడి తగ్గుతుందా?

'బుర్ర బద్దలైపోతోంది ఎవరైనా కాఫీ పెట్టి ఇస్తేనా ఇప్పుడు' అని మహిళలు అనుకోవటం తెలిసిందే. రోజుకు ఒక కప్పు కంటే ఎక్కువ కాఫీ తాగిన మహిళల్లో మానసిక అశాంతి తక్కువగా ఉంటోందని పరిశోధనలు తేల్చాయట. మహిళల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు ఏదో అశాంతికి ఏదో ఒక సమయంలో గురవుతున్నారట. కెఫిన్ మనస్సులను ఎలా ప్రశాంత పరుస్తుందో చెప్పలేను గాని కాఫీ తాగిన వారు ఉల్లాసంగా ఉన్నట్లు తన పరిశోధనలో తేలిందని పరిశోధకుడు అశ్చేరియో చెబుతున్నారు.

- ఎం.కోటేశ్వరరావు

ఓ ధీరోదాత్తుని దినచర్య

డైరీ...గత అనుభవాలు, వర్తమానంలోని పరిణామాలు, భవిష్యత్తు లక్ష్యాలు ఈ మూడింటికి సంబంధించి ఏ రోజుకారోజు మన మదిలో మెదిలే ఆలోచనలు, భావాలకు అక్షర రూపం. స్కూలు పిల్లవాడి దగ్గర్నుండి జాతీయ, అంతర్జాతీయ నాయకుల వరకూ తమ నిత్య జీవితంలో ఎదురైన సంఘటనలను భద్రంగా అక్షర క్రమంలో పేర్చటం సర్వసాధారణం. అయితే ప్రపంచంలోని పీడితులు, తాడితుల విముక్తి కోసం తాను జరిపిన పోరాటాలను, వీర గాధలను, అందులోని కష్ట సుఖాలను, మంచి చెడ్డలను భావితరాలకు అందించటం ద్వారా వారిలో పోరాట స్ఫూర్తిని, ఉద్యమ కసిని రగిలించేందుకు విప్లవ వీరుడు ఎర్నెస్టో చే గువేరా చేసిన మహత్తర కృషే 'బొలీవియా డైరీ'. అమెరికా సామ్రాజ్యవాదంపై పోరాటం, లాటిన్ అమెరికా దేశాల్లో సోషలిజాన్ని స్థాపించాలన్న ఆరాటం, వీటన్నింటినీ మించి అడుగడుగునా అసమాన త్యాగం...ఈ మూడింటికీ అక్షర రూపమిస్తే అదే బొలీవియా డైరీ. శత్రువుల గుండెలపై తానెక్కుపెట్టిన తుపాకీలోంచి దూసుకొచ్చిన బుల్లెట్‌లాంటి మాటలతో 'చే' రాసిన బొలీవియా డైరీ నిజంగా 'ఓ ధీరోదాత్తుని దినచర్య'. ఇది మనం చెప్పే మాట కాదు...'చే' రాసిన డైరీని చదువుతున్నప్పుడు మన శరీరం మీద నిక్కబొడిచే వెంట్రుకలు చెప్పే నగ్నసత్యం. అర్జెంటీనాలో జన్మించిన ఈ పోరాట యోధుడు క్యూబా విప్లవ విజయం తర్వాత మొత్తం లాటిన్ అమెరికాలో సైతం విప్లవాన్ని సాధించాలని భావించాడు. ఇందుకు బొలీవియాను అనువైన స్థావరంగా ఎంచుకున్నాడు. అక్కడ 'చే' గెరిల్లా పోరాటం సాగించిన క్రమంలో 1966 నవంబరు 7 నుండి 1967 అక్టోబరు 7 వరకు ప్రతిరోజూ తన సహచరులు, మిత్రులు, సాధారణ ప్రజలు, ప్రభుత్వాధినేతల నుండి తనకెదురైన అనుభవాలను, ఇబ్బందులను, కడగళ్లను ఒక దగ్గర గుదిగుచ్చి బొలీవియా డైరీకి రూపకల్పన చేశాడు. 1966 నవంబరు 7న (డైరీని ప్రారంభించిన రోజు) అతడు తన డైరీలో రాసిన మొదటి వాక్యం 'ఒక నూతన దశ ప్రారంభమైంది'. ఈ వాక్యం ద్వారా సోషలిజం సాధించాలన్న, సాధిస్తానన్న తన లక్ష్యంపై 'చే' అపారమైన విశ్వాసాన్ని ప్రకటించుకున్నాడు. పోరాట క్రమంలో రాళ్లు, రప్పల్ని దాటుకుంటూ, కంచర గాడిదలు, గుర్రాలే వాహనాలుగా దారిలోని తుప్పలు, ముళ్ల పొదలను నరుక్కుంటూ బొలీవియాకు నైరుతి దిక్కున ఉన్న చాకో అడవుల్లో చే బృందం సాగించిన ప్రయాణం అనన్య సామాన్యం. తనకున్న ఉబ్బసం వ్యాధి మాటిమాటికీ తిరగబెట్టటం, మందుబిళ్లల్ని, డాక్యుమెంటుల్ని సైన్యం ఎత్తుకుపోవటం తదితర ఇక్కట్లను లెక్కచేయక తన లక్ష్య సాధనవైపు చే దూసుకెళ్లాడు. '1967 ఆగస్టు 31న గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రయాణానికి ఉపయోగించే గుర్రాల్నే చంపుకు తినాల్సి వచ్చింది' అని తెలపటం ద్వారా ఆశయ సిద్ధి కోసం తాను ఎన్ని కష్టాల్ని అనుభవించాల్సి వచ్చిందో 'చే' చెప్పకనే చెప్పాడు. ఇంకోచోట 'పోరాట పటిమ తాత్కాలికంగానైనా కాస్తంత వెనుకపట్టు పట్టింది' అని ఆయన తన డైరీలో రాసుకున్నారు. దీన్నిబట్టి చే తన పోరాటపథంలోని లోపాలు, వైఫల్యాలను సైతం ఒప్పుకోవటానికి సైతం వెనుకాడని ధీశాలి అని తెలుస్తుంది. ఈ 'బొలీవియా డైరీ' పుస్తకానికి జాన్ లీ అండర్సన్ పరిచయ వాక్యాలు రాస్తూ క్యూబా స్వాతంత్ర్య సమరయోధుడు జోస్‌మార్టి చెప్పిన 'ఇది కొలిమిలు రగిలించాల్సిన సమయం, ఇక మనం వెలుగు రేఖలు మాత్రమే చూడాలి' అనే వాక్యాలను ఉటంకించటం సందర్భోచితంగా ఉంది. ఆవశ్య ఉపోద్ఘాతం పేరిట ఫైడల్ కాస్ట్రో రాసిన ఉత్తేజభరిత మాటలు 'బొలీవియా డైరీ'కి మరింత వన్నె తెచ్చాయి. స్ఫూర్తిదాయకంగా ఉన్న ఇంతి పిరిడో తుది పలుకులు అదనపు ఆకర్షణ. ఇవన్నీ ఒక ఎత్తయితే ఈ పుస్తకం మీద ప్రచురించిన చే గువేరా బొమ్మ మరో ఎత్తు. ఆ ఫోటోలోని చే చూపులు...అమెరికా సామ్రాజ్యవాదుల గుండెల్లో అతను దింపిన పిడిబాకుల్లా ఉన్నాయి. ఒక చేతితో తుపాకిని ఎత్తిపట్టి పట్టుకుని, మరో చేతిని తన ప్యాంటు జేబులో పెట్టుకుని గమ్యంవైపు దూసుకెళుతున్న చే అసలు సిసలు వీరోచిత, హీరోచిత ధీరుడు. ప్రపంచంలోని పోరాట యోధులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉన్న ఈ 'బొలీవియా డైరీ'ని ప్రచురించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ అనువాదకులు ఎంతైనా అభినందనాయులు.

బొలీవియా డైరీ, ఎర్నెస్టో చే గువేరా, అనువాదం : కె.సత్యరంజన్, గుడిపూడి విజయరావు, వెల :75/-, పేజీలు :224, ప్రతులకు :ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్. మరియు అన్ని బ్రాంచీలు.

-బి.వి.యన్.పద్మరాజు

కొత్త పుస్తకాలు

యువరచయితలకు ప్రయోజనకారి

పద్మరాజుగారు "గాలివాన" అనే కథ న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన అంతర్జాతీయ కథల పోటీలో బహుమతినందుకుంది. 1937లోనే "సుబ్బి" అనే కథ రాశారు. "నల్లరేగడి" వీరి ప్రసిద్ధ నవల. 1985లో కేంద్ర సాహితీ అకాడమీ బహుమతి వీరి "గాలివాన" కథల సంపుటికి వచ్చింది. ఈ సంపుటికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి ప్రసంగ వ్యాసాన్ని ముందు మాటగా పెట్టారు. ఈ సంపుటంలో వ్యాసాలు, రోజువారీ ఊహలు (డైరీ కథనం), కవితలు... ప్రచురించారు. 17 వ్యాసాల్లో కథ గురించి రాసిన వ్యాసాలు బాగున్నాయి. ముఖ్యంగా 1920 నాటి కథలు కథా రచయితలు... నాటి సామాజికాంశాలపై వ్యాసాలు.. నేటి కథకులకు ఒక సిలబస్‌గా అనిపిస్తాయి. దాదాపు 17 కవితల్ని 40 పేజీల్లో ప్రచురించారు. 1942లో రాసిన పెద్ద కాపు కవిత (పేజీ 185), పురిటి పాట (పేజీ 175), గోదావరి (పేజీ 180), ఎర్రజీర (పేజీ193), జీవన స్వర్గం (పేజీ160), చక్కటి శబ్ద శిల్ప సౌందర్యంతో ఉన్నాయి. రోజువారీ ఊసులు 27-1-1943 నుండి 27-5-1943 దాకా స్వీయ డైరీ దినచర్యలోని అంశాలు ప్రచురించారు. ఈ డైరీ కథనం కవులకు, రచయితలకు బాగా ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. ఒక రచయిత కథ కోసం లేదా పాటకోసం సంగీత సాహిత్యం కోసం పడే తపన ఈ రోజువారీ ఊహలు. చదువుతుంటే తెలుస్తుంది. ఉదాహరణకు 3-2-1948 (పేజీ 146). కళ్యాణి రాగంలో "నీ చరణ మంజీరములు" అనే కృతి మాదిరి కీర్తన ఒకటి రాసి కథాకృష్ణ నాటకంలో చొప్పించవచ్చు. సరస్వతి రాగం రేడియోలో వింటుంటే ఆ రాగంలో ఒక పాట మంచిది రాయవచ్చని తట్టింది....ఇలా సాగుతుంది ఈ రచన... (దినచర్య). అలాగే రేడియోలో చర్చలు.. స్వగతాలు, వ్యాసాలు.. యువ రచయితలకు, కవులకు ప్రయోజనకరంగా ఉపయుక్తంగా ఉంటాయి. కవి, రచయిత, మేధావి, పండితుడూ, శాస్త్రవేత్త ఎవరైనా గొప్పవారు కావచ్చు. కానీ వారు ప్రజలకు ప్రజాసాహిత్య కారులకు, ప్రజానేతలకు, ప్రజా ఉద్యమాలకు హాని చేయరాదు. తోడ్పడకున్నా పర్వాలేదు కానీ రాళ్లు, నిందలతో ఉద్యమద్రోహం చేయరాదు. 1952-55 మధ్యకాలంలో శ్రీశ్రీపై కమ్యూనిస్టు ఉద్యమంపై వర్గ దృష్టిలేని కవులు, రచయితలు, ఉష్ణపక్షులు... కాంగ్రెస్ బొరియలో తలదూర్చి ఎంతో హాని (నిజాలు తెలుసుకోకుండా) చేశారు. పద్మరాజు, నార్ల వంటివారు వారిలో కొందరు. ప్రచురణకర్తలు ఫుట్ నోట్సు ద్వారా అయినా కొన్ని రాస్తే వేస్తే బాగుండేది. (వారి డైరీ ద్వారానే రాసినవి) మలిముద్రణల్లో ఆలోచించగలరు.

పాలగుమ్మి పద్మరాజు రచనలు - 4, పేజీలు : 198, వెల : 100/-, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, అబిడ్స్, హైదరాబాద్ -01 మరియు విశాలాంధ్ర అన్ని పుస్తక షాపులు.

- తంగిరాల చక్రవర్తి

వికాసం

పుట్టిన ప్రతి ఒక్కరూ రోజులు గడిచేకొద్దీ పెద్దవారవుతారు. వయసు పెరుగుతుంది. శారీరక పరిపక్వత వస్తుంది. అయితే శారీరక ఎదుగుదల మాత్రం జీవితంలో కొంత కాలమే ఉంటుంది. శారీరక పరిపక్వత దశలో శరీరంలోని గ్రంథులన్నీ బాగా పనిచేస్తుంటాయి. వయసుతోబాటు వారి ప్రవర్తనలో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. మనిషి ఆకారాన్ని, పని తీరును, బుద్ధిని, ప్రవర్తనా విధానాలను సమాజం సునిశిత దృష్టితో పరిశీలిస్తుంది. బంధుమిత్రులతో గతంలో ఉన్న మాదిరి స్వేచ్ఛగా ఉండలేరు. మానసికంగా ప్రతి ఒక్కరిలోనూ మార్పులు వస్తాయి. వారి భావాలను భిన్న రూపాల్లో ప్రదర్శిస్తుంటారు. తాము ఊహించినట్లు ఇతరులు ప్రవర్తించకపోతే కోపం వస్తుంది. తమ మాట ఎదుటివారు వినకపోతే కోపం తారాస్థాయికి వెళుతుంది. ఏమీ చేయలేక తమని తాము నిందించుకుంటారు. దీని ప్రభావం శరీరం మీద కూడా ఉంటుంది.





ఆలోచన... ప్రవర్తన...

- సి.వి. సర్వేశ్వరశర్మ

ఫోన్ నెం: 9866843982

sarma.chavali@gmail.com

మనిషిని చూడగానే వారి మేధను అంచనా వేయడం సాధ్యం కాదు. మనిషి బాహ్యరూపానికి ఇది అతీతమైనది. ఏ విషయాన్నైనా సులువుగా అవగాహన చేసుకోవడం, పరిస్థితులను బట్టి ప్రవర్తించడం, ఉద్రేకానికి లోనుకాకుండా సమస్యలను గుర్తించి పరిష్కారాలు చేయగల నైపుణ్యం మేధా శక్తిగలవారికి సాధ్యమౌతుంది.

మేధోవికాసం చెందినవారు ఎవరి సలహాల కోసం ఎదురు చూడరు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటారు. వాటివల్ల వచ్చే కష్టనష్టాలను భరించడానికి తయారుగా ఉంటారు. ఏదైనా జరిగితే దానికి తను బాధ్యుడని భావించగలుగుతాడు.

మనిషి ఎదుగుతుంటే సమాజంలో అతని స్థానం మారుతుంది. బంధువులు, స్నేహితులు, ఇతరులతో సుహృద్భావ వాతావరణంలో మసలడం చేతనయిన వారు సామాజిక పరిపక్వత పొందినవారవుతారు.

సమాజంలో ఎవ్వరినీ వంద శాతం మంది ఆమోదించరు. ఎక్కువశాతం ప్రజల ఆమోదం పొందగల్గిన వారు సామాజిక పరిపక్వత కల్గినవారు మాత్రమే.

లక్ష్యం ఏర్పరచుకుని దాని సాధన కోసం న్యాయబద్ధమైన మార్గాల్లో కృషి చేసేవారు మంచి వ్యక్తిత్వం గలవారిగా గుర్తించబడతారు.

మన ప్రవర్తన

మన ప్రవర్తనలో మన వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒకరకమైన ప్రతిభ నిద్రాణ స్థితిలో ఉంటుంది. దానిని గుర్తించి వెలికి తీయాలి. అలా చేయగల్గితే మనిషి వ్యక్తిత్వం గుబాళిస్తుంది. తమలోని మంచి, చెడు ఆలోచనలను బేరీజు వేసుకుని చెడు ఆలోచనలకు స్వస్తి పలకాలి.

ప్రతి వ్యక్తిలోనూ ఏదో మూల భయం దాగుంటుంది. దాని నుండి బయటపడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. బాధ్యతలను స్వీకరించగల్గాలి. శ్రమ పడడానికి తయారుగా ఉండాలి. విషయ పరిజ్ఞానం, చక్కటి ఆలోచనలు ఉంటే భయం దరిచేరదు.

తమ శక్తి సామర్థ్యాలు ఏమిటో అంచనా వేసుకోలేనివారు తమ ప్రవర్తనకు తామే సిగ్గుపడుతుంటారు. తరచు ఆత్మన్యూనతా భావానికి గురవుతుంటారు. ఈ తరహా వ్యక్తులు ఎప్పుడూ గొప్పలు చెప్పుకుంటూ అవకాశం దొరికినప్పుడల్లా ఇతరులమీద విరుచుకుపడుతుంటారు. తాము ప్రత్యేకమైన వ్యక్తులమని ఇతరులు అనుకోవాలని వీరి తాపత్రయం.

ఇటువంటి వారు వాస్తవికతకు దగ్గరగా ఉంటూ ఆత్మవిమర్శ చేసుకోగల్గితే ఈ ఆత్మన్యూనతాభావం నుండి బయటపడతారు. తొందరపడి ఇతరుల విమర్శలకు జవాబులు ఇవ్వకూడదు. ఎదుటివారి స్థితితో ఉంటే తమ ప్రవర్తన ఏ విధంగా ఉంటుందనేది ఆలోచించుకోవాలి.

వ్యతిరేక ధోరణులు

ఏ పని ప్రారంభించినా పూర్తవుతుందో లేదో అనే ఆందోళన. స్వశక్తి మీద విశ్వాసం ఉండదు. ప్రతి పనిలోనూ అసమర్థత తాండవిస్తుంది. ప్రతి చిన్న విషయానికి ఎంతో బాధపడతారు. ఫలితంగా తాము చేపట్టిన పనుల్లో పరాజితులయిపోతారు. నిస్పృహ వీరికి తోడవుతుంది. ఈ ధోరణి గల వ్యక్తులు అవకాశాలను సులువుగా జారవిడుచుకుంటారు.

వ్యతిరేక ధోరణి గల వ్యక్తుల ఆలోచనలు తమాషాగా ఉంటాయి. పెళ్లీడుకొచ్చిన కూతురు

పరీక్ష పాసవుతుందా? ఫెయిలయితే పెళ్లి వాయిదా వేయాలి! మంచి వరుడు దొరుకుతాడా? పైకి ఏమీ చెప్పరు. లోలోపల తెగ బాధపడిపోతుంటారు. చివరకు ఆ అమ్మాయి ఫస్టు క్లాసులో పాసవుతుంది. పెళ్లి కొడుకును కూడా తానే చూసుకుంటుంది.

ఈ ధోరణిగల వారు మనసును అదుపులో ఉంచుకోవాలి. అలాంటి ఆలోచనలు మానాలి. తమ శక్తి మీద నమ్మకం పెంచుకోవాలి. తప్పు జరుగుతుందని ముందు నుండే భయపడితే చివరకు తప్పే చేస్తారు. నిర్ణయాలు నిజాయితీగా తీసుకోవడం అలవరచుకోవాలి.

అభినందన అవసరం

సాధారణంగా సమాజంలో చాలామంది ఎదుటివారి ప్రతిభను అంగీకరించరు. ప్రతిభను అభినందించగల్గితే చాలా ప్రయోజనం ఉంటుంది. పొగడ్తలు మంచివి కాదు. పొగడ్త మనిషిని అసందిగ్ధతకు గురిచేస్తుంది. పొగిడేవారిని ఆమోదించలేని పరిస్థితి ఎదురవుతుంది.

నిజంగా ఎవరైనా శ్రమించి విజయం సాధిస్తే వారికి అభినందన ఒక టానిక్‌లా పనిచేస్తుంది. అభినందనలో నిజాయితీ ఉండాలి. అది గుండె లోతుల్లోంచి రావాలి. దాని కారణంగా ఆ వ్యక్తి మరిన్ని విజయాలు సాధిస్తాడు. స్వప్రయోజనాన్ని ఆశించి అభినందిస్తే భంగపాటు తప్పదు.

అభినందనలో స్పష్టత ఉండాలి. యదార్థత ఉండాలి. ఉన్నది ఉన్నట్లు చెప్పగలగాలి. ఆడంబరానికి పోయి బరువైన పదాలతో అభినందించడం మొదలెడితే వినేవారికి వికారం వచ్చే ప్రమాదం ఉంది. నిజమైన అభినందన మనిషి వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతికి తీసుకువెళ్తుంది.

దిగులు కూడదు

జీవితంలో ఎన్నో సమస్యలు ఎదురవుతుంటాయి. ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా పనులు చేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితులు ఎదురయినప్పుడు దిగులుపడకూడదు.

స్నేహితులతో సమస్యలు చెప్పుకోవాలి. కొంత ఊరట కల్గుతుంది. కొన్ని సందర్భాల్లో పరిష్కారాలు కూడా లభిస్తాయి. మనసులోని భావాలు అణచుకోకూడదు. కొన్ని విషయాలు స్నేహితులతో కూడా చెప్పుకోడానికి వీలుండదు. అప్పుడు ఒంటరిగా కూర్చుని కన్నీరు కార్చి మనసును తేలికపరచుకోవడం మంచిది. ఏడుపు మనిషిలోని ఒత్తిడిని కొంతవరకు గెంటివేస్తుంది.

ఏడుపుతో మనిషిలోని విష, ఆమ్లతత్వాలు విసర్జించబడి మనసు మూగబాధ తగ్గుతుంది. దిగులుగా ఉన్నప్పుడు వ్యాయామం చేయబుద్ధికాదు. కానీ చకచకా నడవడం, ఈత కొట్టడం వంటి వ్యాయామాలు ప్రారంభించగల్గితే కండరాల టెన్షన్ తగ్గి రిలాక్స్ అవుతారు.

దిగులుగా ఉన్నప్పుడు ఏమీ తినబుద్ధి కాదు.

తిండి తినకపోతే నీరసం మరింత అధికమై దిగులు నుండి విముక్తి పొందలేరు. ప్రొటీన్లు గల ఆహారం తీసుకోవాలి. బి విటమిన్ తీసుకోవడం ఎంతో లాభదాయకం.

మనసును ఏదో లక్ష్యం వైపు కేంద్రీకరింపజేసి దాని సాధనకై కృషి చేయడం ప్రారంభిస్తే దిగులుకూ దూరం అవుతారు. జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యం తప్పక ఉండాలి.

★

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

సంక్రాంతి కథల పోటీ

సంక్రాంతి సందర్భంగా ప్రజాశక్తి సాహితీ సంస్థ కథల పోటీ నిర్వహించనుంది. రూ. 10,000 (ప్రథమ), రూ. 5,000 (ద్వితీయ), రూ. 3,000 (తృతీయ) పారితోషికం వుంటుంది.

కథలు చేరాల్సిన ఆఖరు తేది
డిసెంబర్ 15, 2011

పాల్గొనే రచయితలకు సూచనలు : ▶ కథలకు సమకాలీన పరిణామాలు, పరిస్థితులు నేపథ్యంగా ఉండాలి. ▶ ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ▶ ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకే ప్రాధాన్యం ఉంటుంది. ▶ మూఢనమ్మకాలను పెంచేదిగా కానీ, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా కానీ వుండకూడదు. ▶ మాండలికాలను ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధపడేలా వుండాలి. ▶ నవ్యత, వైవిధ్యం కలిగి ఇప్పటివరకు స్పృశించని కోణాలను ప్రతిబింబించే కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు : ◆ కథ నిడివి ప్రింటులో మూడు A4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 10 నుంచి 12 పేజీలు వుండాలి. ◆ ప్రింటయినా, చేతిరాతయినా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండాలి. ◆ రచయిత/రచయిత్రి పేరు కథపై ఉండకూడదు. ◆ పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు, ఈ మెయిల్ ఐడి వేరే కాగితం మీద రాసి జత చేయాలి. ◆ హామీపత్రం విధిగా జత చేయాలి. ◆ కవరు మీద 'ప్రజాశక్తి కథల పోటీకి' అని స్పష్టంగా 'స్నేహ' డెస్క్, ప్రజాశక్తి దినపత్రిక, ఆజామాబాద్ ఇండస్ట్రీయల్ ఏరియా, హైదరాబాద్ - 500020

బహుమతి పొందిన కథలతో పాటు సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు స్వీకరించవచ్చు. ఈ కథలు ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో ప్రచురితమవుతాయి. అలా ప్రచురించే కథలకు సాధారణ పారితోషికం వుంటుంది. అనుభవజ్ఞులైన ప్రముఖ రచయితలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రజాశక్తి సాహితీ సంస్థదే తుది నిర్ణయం.

వి. కృష్ణయ్య, చైర్మన్, ప్రజాశక్తి సాహితీ సంస్థ

బాల కథ

పండుగ దయ్యాలు

ఏటి ఒడ్డున గొర్రెల్ని మేపుకుంటూ జీవించేవాడు లింగయ్య. "దీపావళి పండుగొస్తుంది. సంతకెళ్లి సరుకులు తీసుకురా" అని తన కొడుకు పన్నెండేళ్ల శివయ్యని పంపించాడు. శివయ్య గాడిదనెక్కి అడవికి అవతలున్న సంతకు బయలుదేరాడు. మధ్యలో తోడేలు, గుంటనక్క ఎదురై "చెరొకరిని తినేస్తాం" అంటూ దగ్గరకు వస్తాయి.

"నేను సంతకెళ్తున్నాను. అక్కడ సరుకులతో పాటు మాంసం, చేపలు, తీసుకుని వస్తా. అప్పుడైతే మీకు చక్కటి లాభం. ప్రస్తుతానికి నన్నొదిలేయండి" అన్నాడు శివయ్య. 'సరే. మళ్లీ ఇదే దారిన వస్తావు కదా. ఇది తప్ప అడవి దాటటానికి మరో మార్గం లేదు. మేమిక్కడే కూర్చుంటాం. త్వరగా రా" అంటుంది తోడేలు.

సంతకు చేరుకున్న శివయ్య, ఇంట్లోకి కావలసిన ఉప్పు, పప్పు, చింతపండు, పంచదార, కోడిమాంసం, ఎండుచేపలు వంటి సరుకులతో పాటు, దీపావళి టపాసులు కొనుక్కుని, గాడిద మీద పెట్టుకుని అడవి మధ్యకొస్తాడు. శివయ్యని చూడగానే నక్క "త్వరగా రా. నీకోసం ఉదయం నుండి ఎదురుచూస్తున్నాం. ముందు నువ్వు తెచ్చిన మాంసం, చేపల్ని ఇటు పడెయ్. ఇవాల్టికి వీటితో సరిపెట్టుకుంటాం. రేపు నీ గాడిదను, ఆ తర్వాత నిన్నూ తినేస్తాం" అంటూ దగ్గరకు వస్తుంటాయి.

"నన్ను తింటారా. ముందు మిమ్మల్ని తింటానికి పట్నం నుండి నాలుగు దయ్యాల్ని పట్టుకొస్తున్నా" అంటాడు.

దయ్యాల మాట వినగానే, మీదకొస్తున్న గుంటనక్క, తోడేలు భయంతో ఆగిపోతాయి.

వెంటనే శివయ్య సంచిలో నుండి రెండు నేల టపాకాయలు తీసి "ఓం... హ్రీం... క్రీం... పండుగ దెయ్యాల్లారా మీరు కోరుకున్న తోడేలు, నక్క ఎదురుగానే వున్నాయి. వాటిని తిని మీ ఆకలి తీర్చుకోండి" అని వాటిని గట్టిగా నేలకేసి కొడతాడు. అవి పెద్ద శబ్దంతో పేలతాయి. వెంటనే దట్టంగా పొగ అలుముకుంటుంది. ఆ శబ్దానికి నక్క, తోడేలు అదిరి పడ్డాయి. కమ్ముకున్న పొగలోంచి దయ్యాలు వస్తున్నాయని భయపడి వెనక్కు పరుగందుకుంటాయి. వెంటనే శివయ్య మరో రెండు నేల టపాకాయల్ని వాటిపైపు విసురుతాడు.

"వామ్మో ఈ శివయ్య సామాన్యుడు కాదు. మనల్ని తినే దయ్యాల్ని సంచిలో పెట్టుకుని వచ్చాడంటే చాలా తెలివిగలవాడు. బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు. పరిగెత్తు. ఈ దెయ్యాలకు మాత్రం దొరకొద్దు" అంటుంది తోడేలు. ప్రాణభయం కొద్దీ అవి కంటికి కనిపించనంత దూరంగా పారిపోతాయి.

శివయ్య ఇంటికి చేరుకుని, జరిగిందంతా తల్లిదండ్రులకు చెపుతాడు. వాళ్లు తమ పిల్లవాడి తెలివి తేటలకు ఎంతో సంతోషిస్తారు.

\- పుప్పాల కృష్ణమూర్తి



బాలనేస్తాలు

ఆహ్వానం

హాయ్ నేస్తాలూ! మీరు కథలు, కవితలు, బాగా రాస్తారట కదా. జోక్స్ బొమ్మలు, సూపర్‌గా వేస్తారట. మీకు బోలెడన్ని తమాషా ప్రశ్నలు - జవాబులు, చారిత్రక ఘట్టాలు తెలుసంట కదా. మరి అవన్నీ ఎంచక్కా పోస్టు కార్డుమీద రాసి పంపండి. మీ పేరు, స్కూల్‌తో సహా ప్రచురిస్తాం.

మా చిరునామా

బాలనేస్తాలు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,

ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజామాబాద్,

ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

దోమలు కుట్టి

మురళి : అమ్మా! సాంబయ్య మావయ్య నాలుగు రోజులు ఊరెళ్లి వస్తేనే బాగా ఒళ్లొచ్చింది. అక్కడ బాగా తిన్నట్లున్నాడు.

తల్లి : అవును. సాంబయ్యా! అక్కడ ఏం తిన్నావేంటి? ఇంత త్వరగా ఒళ్లొచ్చింది.

సాంబయ్య : అదేం కాదక్కా! ఆ ఊళ్లో బాగా దోమలు వున్నాయిలే. అవికుట్టి ఇలా వాచిపోయింది ఒళ్లు.

\- కె.ఎస్. శివరావు, 10 తరగతి, జల్లూరు.

హా హా

పరీక్ష

సురేష్ : డాక్టర్‌గారూ! నా ఆరోగ్యం బాగుండటం లేదండి.

డాక్టర్ : అలాగా! రేపు రండి బ్లడ్ టెస్ట్ చేద్దాం.

(సురేష్ ఇంటికెళ్లి పుస్తకాలన్నీ ముందుపెట్టుకుని చదువుతుంటాడు.)

సురేష్ తండ్రి : ఏంట్రా అన్ని పుస్తకాలు ముందేసుకుని చదువుతున్నావ్?

సురేష్ : డాక్టర్ గారు రేపు బ్లడ్ టెస్ట్ చేస్తానన్నారు నాన్నా. పాసవ్వాలని బాగా చదువుతున్నా.

\- ఎన్.శ్వేత, 9వ తరగతి, శ్రీకాకుళం.

క్విజ్ మాస్టర్

1. ప్రపంచంలో అతిపెద్ద యూనివర్శిటీ ఏది?
2. సైకిల్‌ని కనుగొన్నదెవరు?
3. అమెరికా మొట్టమొదటి ప్రెసిడెంట్ ఎవరు?
4. ప్రపంచంలో సుడోకును ఎక్కువగా ఎక్కడ ఆడుతారు?
5. ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడే భాష ఏది?

\- వి. రవీంద్ర నాయుడు,

నక్కవానిపాలెం, విశాఖ.



జవాబులు : 1. ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ, 2. బేరన్ వోన్ డారిస్, 3. జార్జ్ వాషింగ్టన్, 4. జపాన్, 5. మన్డోరిన్ (చైనీస్).

Z	S	Y	E	I	E	Z	L	Z	C	Q	C	L	Y	B	X	H	F
D	E	E	P	A	V	A	L	I	T	K	F	Q	P	L	M	P	Q
W	V	Q	T	S	O	J	E	K	T	O	L	X	G	E	P	S	P
J	M	C	H	T	P	Q	R	A	U	D	A	O	W	X	P	S	B
R	Z	I	A	G	O	H	E	R	C	W	M	W	T	E	I	C	B
Q	V	O	L	A	L	K	H	T	M	N	P	D	I	T	I	V	Y
C	W	S	I	N	H	Y	D	I	B	U	N	P	Y	B	W	R	I
R	C	N	F	E	H	X	O	K	R	C	L	A	K	S	H	M	I
A	M	J	M	S	U	N	J	A	R	N	P	K	A	S	C	Q	W
C	M	T	M	H	J	U	O	J	Y	Q	E	J	D	T	Y	P	A
K	I	B	Q	A	D	W	W	P	S	F	W	A	D	S	Q	F	B
E	E	Q	I	I	J	R	U	U	N	E	P	U	X	D	Q	K	G
R	D	W	B	L	O	H	O	F	I	S	C	V	R	D	H	U	X
S	S	W	E	E	T	S	U	T	P	T	J	W	A	F	W	F	G
O	Z	B	C	N	L	C	G	X	G	I	D	D	M	Y	C	B	B
I	X	K	L	Y	V	N	V	S	K	V	G	A	A	N	Y	K	G
P	G	R	Y	L	X	A	Y	P	U	A	O	D	F	J	A	K	C
R	W	B	V	R	R	U	N	R	D	L	R	S	U	A	W	Q	S

Word List

SWEETS
LAKSHMI
GANESHA
THALI
DEEPAVALI
CRACKERS
KARTIKA
FESTIVAL
RAMA
LAMP

ఎక్కడున్నాయబ్బా...

చిన్నారులూ... పైన దీపావళి పండుగకు సంబంధించి కొన్ని పదాలు ఇచ్చాం. వాటి పక్కనే ఉన్న అక్షర సమూహంలో ఈ పదాలు ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి.

పేపర్ దీపాలు



చేసేద్దాం

హాయ్ ఫ్రెండ్స్....

దీపావళి పండుగ వస్తోంది. ఈ పండుగంటే మనందరికీ చాలా ఇష్టం. ఎందుకంటే చక్కగా ప్రమిదలు వెలిగిస్తాం. ఇంకా బోలెడు కాకరపూవొత్తులు, టపాకాయలు కాలుస్తాం. మట్టి దీపాలు ఇంటి బయట పెడతాం. అయితే ఇంట్లో గోడలమీద కూడా చక్కగా దీపాలను అలంకరించొచ్చు. అప్పుడు చాలా బాగుంటుంది కదా.

ఇవి చేయడానికి ఏమేం కావాలంటే...

కాస్త మందంగా ఉన్న రంగు పేపర్, (లేదా) ఇంట్లో పనికిరాని పాత బట్ట ముక్కలున్నా వాటితో కూడా చెయ్యొచ్చు), కత్తెర, పెన్ను, గమ్.

ఎలా చేయాలంటే...

మందపాటి పేపర్ లేదా పాత బట్ట ముక్కపైన పెన్నుతో వెలుగుతున్న ప్రమిద ఆకారం గీసుకోవాలి. ఆ గీతల మీదుగా కత్తిరించుకోవాలి. అంతే పేపర్ దీపాలు రెడీ. వేర్వేరు రంగు పేపర్లతో చేస్తే ఇంకా బాగుంటాయి. బట్టముక్క అయినా ఇలాగే కత్తిరించుకోవాలి. వీటిని గమ్‌తో ఫొటోలో చూపించినట్లు మూడు ప్రమిదలు చొప్పున గోడకి వరుసగా అతికించి చూడండి. చాలా బాగుంటుంది.



చతుర్భుజాలెన్ని?

ఫ్రెండ్స్... పైన కొన్ని చతుర్భుజాలున్నాయి. అవి మొత్తం ఎన్నున్నాయో లెక్కించి చెప్పాలి. అయితే ఎక్కువ సమయం తీసుకోకూడదు సుమా. తెలీకపోతే మా జవాబు చూడండి.

రంగులు నింపేద్దాం

పిల్లలూ...ఈ బొమ్మ భలేగా ఉంది కదూ. దీనికి రంగులు వేస్తే ఇంకా బావుంటుంది. మరి చకచకా వేసి ఈ బొమ్మని మరింత అందంగా చేయండి.



మాటల కోట - 73

రూపకల్పన : కొమ్మాలపాటి

1		■	2		■	3		4
	■	5		■	6		■	
7		■	8	9	10	■	11	
	■	12	■	13			■	
■	14		■	15		■	16	
17		■	18		■	19		
	■	20	■	21	22	■		■
23		■	24	■	25		■	26
	■	27				■	28	

అడ్డం

1. చేపలు పట్టాలంటే ఇది వుండాల్సిందే (2)
2. నిప్పు, పట్టుకుంటే కాలుతుంది (2)
3. మహానటి 'మిస్సమ్మ'ను మరువగలమా (3)
5. మృత్యువుకు మారుపేరు (2)
6. గగన విహారి(2)
7. యుద్ధం (2)
8. పెద్ద అల (3)
11. కుంతీపుత్రుడు, అర్జునుడి విరోధి(2)
13. వాడుక (3)
14. నోట్లో ఉండేది కాదు. కష్టము (2)
15. అది వాడి 'వల్ల' కాదు (2)
16. 'వెళ్తాను' అని వాడుక భాషలో చెప్పండి (2)
17. ఇది చూడకుండా ఇల్లు కట్టనే కట్టరు (2)
18. వద్దు మరాడిస్తే బియ్యంతో పాటు వచ్చేది (2)
19. అబ్బో మహా కరుకు!! (3)
20. క్యూబా విప్లవ వీరుడు, నిత్య స్ఫూర్తి ప్రదాత (1)
21. రాఘవ లారెన్స్ చిత్రం. ఈ మధ్య దానికి సీక్వెల్‌గా 'కాంచన' తీశారు (2)
23. ఇది ఇంగ్లీషు ప్రవాహం (2)
25. సుగ్రీవుడి సోదరుడు (2)
27. దీపాల వరుస (4)
28. బలరాముడి భుజాన వుండేది. అటునుండి (2)

నిలువు

1. భూ కుంభకోణంలో అరెస్టయిన కన్నడ మాజీ ముఖ్యమంత్రి (4)
2. హీరో నాగార్జున అర్ధాంగి. ఆమె కూడా ఒకప్పటి హీరోయినే (3)
3. రంగారావుకు ఈ చిత్రం పేరే ఇంటిపేరై కూర్చుంది (2)
4. ముప్వన్నెల జెండా (6)
6. రాజుగారి సేన (4)
9. హరి హరీ... శాకము కూడా తెలీదా! (5)
12. సొంత కాళ్లమీద నిలబడలేని వాడికి ఇది లేదంటారు (2)
14. పేదవాడి ఉపవాసం... (2)
16. కుర్రవాడు (3)
17. అమెరికాలో కార్మిక, విద్యార్థి ఉద్యమాలకు కేంద్రంగా మారుమోగుతున్న ప్రదేశం (4)
22. చనిపోయినవారికి అర్పించేది (3)
24. పాపను పిలవండి (2)
26. 'ఆమె' చిత్ర కథానాయిక (2)

మాటలకోట - 72 జవాబు

1 గా	లి	■	2 కా	క	3 ర	■	4 జ	ర్లీ
రె	■	5 టో	పి	■	6 క్ష	మ	త	■
7 లు	ప్తం	■	8 ట	క్కు	■	9 మా	■	10 హ
■	11 పా	12 వె	ల్	■	13 వె	■	14 ఎ	ద్దు
15 బా	■	ష్ణ	■	16 జే	ల	17 క	ర్ర	■
18 బా	19 వ	■	20 త్ర	తం	■	21 పా	వ	22 కం
■	23 ల	24 వ	ణం	■	25 దూ	లం	■	చు
26 వ	■	న	■	27 అ	కు	■	28 ఖా	■
29 ఖ	ని	జ	ము	■	30 దు	తు	మం	శ్రీ

హ్హా... హ్హా...

మామిడిచెట్టు

టీచర్: బాబూ! నువ్వు నది మధ్యలో వున్నావనుకో. అప్పుడు నీకు మామిడిచెట్టు కనపడితే కాయలు ఎలా కోస్తావు?

పిల్లవాడు: నేను పక్షిలా ఎగురుకుంటూ వెళ్లి చెట్టుమీద వాలి కాయలు కోస్తాను టీచర్.

టీచర్: నిన్ను పక్షిలాగా ఎవరు చేస్తారు? నీ తాతా!

పిల్లవాడు: మరి నది మధ్యలో మామిడి చెట్టు నీ తాత పెడతాడా టీచర్?

ఇది అంతే!

టీచర్ : గణేష్ నిన్న నీకు ఒక పద్యం చెప్పానుగా. చదివావా?

గణేష్ : నిన్న తిన్న అన్నం కడుపులో ఉంటుందా టీచర్? ఇదీ అంతే!

ఎవరు గొప్ప



చాలా కాలం క్రితం నల్లమల అడవుల్లో ఓ నక్క తన భార్యాబిడ్డలతో నివసిస్తోంది. నక్క కొడుక్కు పెళ్ళి వయసు వచ్చింది. అతనికి పెళ్ళి చేయాలనుకుని సంబంధాల కోసం వెతకసాగింది. పొరుగునున్న అడివిలో ఓ మంచి సంబంధం ఉందని, అమ్మాయి బుద్ధిమంతురాలని వింది. చూడాలని వెంటనే బయలుదేరింది.

కొంత దూరం నడిచేసరికి వాన దేవుడు ఎదురొచ్చాడు.

నక్కకు మండిపోయింది. "ఓ మంచి పని మీద బయలుదేరాను. నువ్వు ఎందుకు ఎదురొచ్చావు?"అని వెనుదిరిగింది.

ఇంటికి వచ్చి కొద్ది సేపు కూర్చుని మళ్ళీ బయలుదేరింది.

నాలుగడుగులు వేసిందో లేదో భూదేవి నవ్వుతూ ఎదురొచ్చింది.

"ఏమమ్మా భూదేవి ! నీకు పని పాట ఏమీ లేదా? పొద్దున్నే ఇలా వచ్చావు?" కోపంగా అని వెనుతిరిగింది నక్క

ఇంట్లో కాస్సేపు కూర్చుని ఓ లోటా నీళ్ళు తాగి మళ్ళీ బయలుదేరింది.

పదడుగులు వేసిందో లేదో లక్ష్మీ దేవి ఎదురొచ్చింది. నక్కకు చిర్రెత్తుకొచ్చింది.

"ఏమమ్మా లక్ష్మమ్మా! ఇంట్లో ఏ పని చేయకుండా పొద్దున్నే ఇలా ఊడిపడ్డావేం?"అని వెను తిరిగి గబగబా ఇంటికొచ్చి కుర్చీలో కూలబడింది. నక్క భార్య ఓ లోటా మజ్జిగ తెచ్చి ఇచ్చింది. మజ్జిగ తాగి వాకిలి దగ్గరికి వచ్చి అటూ ఇటూ చూసి 'అమ్మయ్య ఎవరూ లేరు' అనుకుంటూ బయలుదేరింది.

రెండడుగులు వేసిందో లేదో అగ్నిదేవుడు పక్కసందులోంచి వస్తూ ఎదురు పడ్డాడు.

అయన్ని చూడగానే నక్క "ఆహా ! శుభశకునం. వెళ్ళే పని తప్పకుండా సఫలం అవుతుంది" అని నవ్వుతూ అగ్ని దేవుడికి భక్తిగా నమస్కరించి బయలుదేరింది.

పొరుగునున్న అడివిలోని నక్క దంపతులు నల్లమల నక్కను సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేశారు. పిల్లను చూపారు. పిల్ల సిగ్గుపడుతూ వచ్చి నల్లమల నక్కకు నమస్కరించింది. నక్కకు పిల్ల నచ్చటంతో 'పెళ్ళి ముహూర్తాలు తొందర్లో పెట్టుకుందాం'అని చెప్పి హుషారుగా తిరుగు ప్రయాణం అయ్యింది.

నక్క ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు చూసుకోకుండా ఓ గోతిలో పడింది. అందులో నుండి ఎలా బయటపడాలో దానికి అర్థం కాలేదు. ఎవరైనా వచ్చి రక్షిస్తారేమోనని ఎదురు చూడసాగింది.

అదే సమయంలో వాన దేవుడు, భూదేవి, లక్ష్మీదేవి దేవతల రాజైన ఇంద్రుడిని కలుస్తారు. నక్క తమను ఎలా అవమానించిందో ఆయనకు వివరించి దానికి బుద్ధి చెప్పేతీరాలని వేడుకున్నారు.

ఇంద్రుడు వాళ్ళను వెంటబెట్టుకుని నక్క దగ్గరికి బయల్దేరాడు. దారిలోనే వాళ్లకి గోతిలో పడ్డ నక్క కనిపించింది.

నక్క ఇంద్రుణ్ణి చూసి ముందు బిత్తరపోయింది. ఇంద్రుడి వెనుక ఉన్న వానదేవుడ్ని, భూదేవిని, లక్ష్మీదేవిని చూసి విషయం గ్రహించింది. వెంటనే వినయంగా ఇంద్రుడికి నమస్కరించింది.

"నక్కా! నీ వినయాలు కట్టి పెట్టు. వానదేవుడి గొప్పతనం నీకు తెలియదా? అతను ఎదురు రావటం శుభ శకునంకాదా?" కోపంగా అడిగాడు ఇంద్రుడు.

"దేవదేవా! వానలు లేకపోతే పంటలు లేక ప్రజలు ఆకలితో అలమటిస్తారని నాకు తెలుసు. అయితే ఈ వానదేవుడు కొన్నిసార్లు అతివృష్టిని, మరి కొన్నిసార్లు అనావృష్టిని సృష్టించి ప్రజలకు ఎంతో కష్టాన్ని, నష్టాన్ని కలగజేస్తాడు. అందుకే ఇతనంటే నాకు పడదు"అంది నక్క

ఆ మాటలకు వానదేవుడు ఏడ్పు మొహం పెట్టాడు.

"అలాగా, భూదేవిని ఓర్పుకు మారు పేరుగా భావిస్తారే. అలాంటి భూదేవి ఎదురు రావటం నీకు నచ్చలేదా?"అడిగాడు ఇంద్రుడు కోపంగా.

"దేవతల రాజా ! ఈ భూదేవి అందర్నీ సమానంగా చూడదు. కొన్ని ప్రాంతాల్లో ఎత్తుగాను కొన్ని ప్రాంతాల్లో పల్లంగాను ఉండటంతో వర్షపు నీరు కొన్ని ప్రాంతాల్లో బాగా నిలిచి పంటలు బాగా పండుతాయి. నీరు లేని చోట పంటలు పండక ప్రజలు బాధలు పడతారు. అందుకే భూదేవి అంటే నాకు పడదు" అంది నక్క

ఆ మాటలకు భూదేవి బిక్కమొహం పెట్టింది.

"ఓహో ! అలాగా. లక్ష్మీదేవిని పూజించని వాళ్ళే లేరే. అందరూ ఆమె తమ ఇంట్లో కాలు పెట్టాలని ఆశిస్తారే. మరి నీవు ఎందుకు ఆమె ఎదురు పడితే వెనుతిరిగి పోయావు?"అన్నాడు ఇంద్రుడు.

"ఓ దేవేంద్రా! లక్ష్మీదేవికి పక్షపాతం ఎక్కువ. ఆమె కొద్ది మంది ధనవంతుల దగ్గరే ఉంటుంది. చాలా మంది దగ్గర నిలువక వారిని బీదవాళ్ళను చేస్తుంది. అందుకే ఆమె అంటే నాకు నచ్చదు"అంది నక్క

లక్ష్మీదేవి మౌనం వహించింది.

"బాగానే సమాధానాలు చెబుతున్నావు. ఇంతకీ నీకు అగ్ని దేవుడు ఎందుకు నచ్చాడు?"అడిగాడు ఇంద్రుడు.

"ప్రభూ! అగ్నిదేవుడు పరమ పవిత్రుడు. ఎటువంటి పక్షపాతము లేనివాడు. బీదవాడి వంటకు ఉపయోగపడే అగ్నే, ధనవంతుడి ఇంటి వంటకూ ఉపయోగపడుతుంది. అంతేకాదు, బీదవాడ్ని దహించే అగ్నే ధనవంతుడ్నీ దహిస్తుంది. అగ్నిదేవుడిది సమదృష్టి అందుకే నాకు అగ్నిదేవుడంటే ఇష్టం"అంది నక్క

"మరి మంచి జరిగితే నువ్వెందుకు గోతిలో పడ్డావు? మేం రాకపోతే నీ ప్రాణాలు పోతాయి కదా. ఇదెలా మంచి జరిగినట్లు?" అడిగాడు ఇంద్రుడు.

నక్క సమాధానం చెప్పకుండా తల దించుకుంది.

"ఒకరు ఎదురు వస్తే మంచి జరగడం, మరొకరు ఎదురొస్తే చెడు జరగడం లాంటివేమీ వుండవు. మనం మంచిగా వుంటే అంతా మంచే జరుగుతుంది. ఇంకెప్పుడూ ఇలా ఆలోచించకు"అని నక్కకు బుద్ధి చెప్పాడు ఇంద్రుడు.

నక్క తన తప్పును తెలుసుకుని ఇంకెప్పుడూ ఇలా ఆలోచించనని చెప్పింది.

- రంగనాథ రామచంద్రరావు

దీపావళి శుభాకాంక్షలతో...,

SUCCESS

డా॥ పద్మజ

సంతాన సాఫల్య కేంద్రం

TVS షోరూం ప్రక్కన, స్ట్రీట్ నెం.7, హబ్సిగూడ(తార్నాక), హైదరాబాద్.

Cell : 9848343244 / 9553507755

నవ్య నర్సింగ్ హోం భువనగిరి

Cell : 9848343244 / 9848044665 / 08685-243123

web:www.drpadmajaivf.com / e-mail: drpadmajaivf@yahoo.co.in

సంతాన సాఫల్య విధానంలో వచ్చిన
ఆధునిక పరికరాలతో, ప్రపంచ స్థాయి సౌకర్యాలతో

టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్

ఐ.యు.ఐ. విధానం : భర్త వీర్యం శుద్ధిపరచి గర్భసంచిలో ఇంజెక్షన్ ద్వారా పొందుపరచడం

ఐ.వి.ఎఫ్. విధానం : శుద్ధిపరచిన వీర్యకణాలను, అండాలను ల్యాబ్‌లో ఫలదీకరించి పిండం తల్లిగర్భంలో పొందుపరచడం.

ఐ.సి.ఎస్.ఐ (ఇక్సీ) విధానం : మరీ తక్కువ వీర్యకణాలున్నప్పుడు అండంలోకి ఒకే వీర్యకణం మైక్రో ఇంజెక్షన్ ద్వారా చేర్చి ఫలితం సాధించడం.

రికానలైజేషన్ : మళ్లీ పిల్లల కోసం రివర్స్ ట్యూబెక్టమీ.

సరోగసీ : ఇతర స్త్రీ గర్భంలో ప్రసవం వరకు పెంచడం.

- స్త్రీలలో గర్భాశయం, అండాశయం, అండవాహికలో లోపాల నిర్ధారణ - చికిత్స
- పురుషుల్లో సంతానప్రాప్తి లోపాలు, వివిధ సమస్యల నిర్ధారణ - చికిత్స
- అత్యంత ఆధునికమైన పాథాలజీ,మైక్రోబయాలజీ ల్యాబ్
- లాప్రోస్కోపిక్ విధానంతో లోపాల నిర్ధారణ- సవరణ వంటి ఆధునిక వైద్య విధానాలతో...
- మీ ఆకాంక్ష నెరవేర్చుకోవడానికి - మీ కలలు సాకారం చేసుకోవడానికి సంప్రదించండి.

డా॥ పద్మజా దివాకర్
సంతాన సాఫల్య వైద్య నిపుణులు

ప్రజాశక్తి పాఠకులకు 10 % రాయితీ (ఇక్కడ లభించే అన్ని వైద్య సౌకర్యాలపై)